TARAJYOTHI TELUGU DAILY
తారాజ్యోతి
తెలుగుదిన పత్రిక
చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్
ఆదివారం, జనవరి 18, 2026 | సంపుటి - 20 | సంచిక 120 | వెల - 4రూ | పేజీలు - 12
Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

## బృహన్ ముంబైలో
# బిజెపి కూటమి గెలుపు

**ఉద్దవ్ ఠాక్రేకు ప్రజలు గుణపాఠం చెప్పారు**
**నటి, ఎంపి కంగనా రనౌత్ వ్యాఖ్యలు**



ముంబై : బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌లో దాదాపు 25 ఏళ్ల తర్వాత ఉమ్మడి శివసేన ఆధిపత్యానికి గండిగొట్టి బీజేపీ, శివసేన మహాయుతి కూటమి ఘనవిజయం సాధించడంపై బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ సంతోషం వ్యక్తం చేశారు. ఇది తమ అందరికీ గొప్ప విజయమని అన్నారు. బీఎంసీ ఎన్నికల్లో సాధించిన చారిత్రక 2లో



2

## మున్సిపల్ ఎన్నికలకు
# బిజెపి సన్నద్ధం

- సర్పంచ్ ఎన్నికల్లో సత్తా చాటాం
- మున్సిపల్ పోరులోనూ బిజెపి హవా చాటుతాం
- రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా



2

## ఇక సంగారెడ్డి నుంచి
# పోటీ చేసేది లేదు

**కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి సంచలన వ్యాఖ్యలు**

సంగారెడ్డి : కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. తాను జీవితంలో సంగారెడ్డి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయనంటూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ' ఏఐసీసీ సీనియర్ నేత రాహుల్ గాంధీని.. నేను సంగారెడ్డికి పిలిచి అవమానించానేమో అని ఫీల్ అయ్యాను. నాకోసం ఆయన సంగారెడ్డికి వచ్చారు. నన్ను గెలిపించాలని గట్టిగా ప్రచారం చేశారు. అంతగా ఆయన ప్రచారం చేసినప్పటికీ ఇక్కడి ప్రజలు నన్ను ఓడించారు. నేను చాలా ఆవేదన చెందాను.



## పాలమూరు బిడ్డల శ్రమతోనే
# ప్రాజెక్టులు
## పాలమూరు అన్యాయం చేసిన కెసిఆర్

**దేశంలో ఏ ప్రాజెక్టు కట్టినా.. వాటిలో పాలమూరు బిడ్డల శ్రమ దాగి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. వారి చెమట అందులో ఉంటుందని అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.1,284 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలోనే అత్యంత వెనుకబడిన మండలం ఈ జిల్లాలోని గట్టు మండలం. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం పదేళ్లపాటు పాలమూరు జిల్లా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది. కేసీఆర్ పదేళ్లపాటు పాలమూరు జిల్లాకు ఒక్క ప్రాజెక్ట కూడా తీసుకురాలేదని విమర్శించారు.**

- బిఆర్ఎస్ పాలనలో ఉమ్మడి జిల్లాకు తీరని అన్యాయం
- పదేళ్లపాటు ప్రాజెక్టులు కట్టకుండా తీవ్ర నిర్లక్ష్యం
- రూ.1,284 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- జడ్చర్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన
- జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పిన సిఎం రేవంత్

మహబూబ్‌నగర్ : పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును 2013లో అప్పటి కాంగ్రెస్ నేతలు సాధించారు. ప్రాజెక్టు పేరు మీద రూ.23 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించారు కానీ, ప్రాజెక్టు పూర్తి చేయలేదు. ఉద్ధండాపూర్ జలాశయం భూ నిర్వాసితులకు నిధులు చెల్లించలేదు. సంగంబండ వద్ద బండ పగుల గొట్టేందుకు కేసీఆర్ పదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పదేళ్లపాటు నిర్లక్ష్యం చేశారు. గతంలో పాలమూరు జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. జిల్లాలోని ప్రాజెక్టుల గురించి అడగలేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చ పెడితే సభకు రాకుండా పారిపోయారని ఎద్దేవా చేశారు. భాజపా ఎంపీలు రాష్ట్రానికి ఐఐఎం సాధిస్తే.. పాలమూరు జిల్లాలోనే భూమి ఇచ్చే బాధ్యత నాదని అన్నారు. పాలమూరు జిల్లాను వెనకబడిన జిల్లాగా ఇంకా ఎన్నాళ్లు చూపించాలి? పదేళ్లలో రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేశారు కానీ.. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక్కటి పూర్తి చేశారు.. అది మూడేళ్లకే కుప్పకూలింది. 2లో



## తృణమూల్‌ను సాగనంపే
# సమయం వచ్చింది

- బెంగాల్ అభివృద్ధికి మమత ప్రధాన అడ్డంకి
- చొరబాటుదారులకు తృణమూల్ అండతో నష్టం
- అవినీతి కారణంగా ప్రజలకు చేరని పథకాలు
- బీహార్ తరవాత ఇప్పుడు బెంగాల్ వంతు
- మాల్దా సభలో తృణమూల్‌ను ఏకిపారేసిన ప్రధాని మోదీ

కోల్‌కతా : బెంగాల్ ప్రజల పట్ల ఏమాత్రం కనికరం లేని అధికార తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సాగనంపే సమయం వచ్చిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇక్కడి చొరబాట్లకు తృణమూల్ అండగా నిలవడం పెద్ద సమస్యగా మారిందన్నారు. బీజేపీ అభివృద్ధి మోడల్‌ను జెన్‌జీ తరం విశ్వసిస్తోందని.. ఈసారి బెంగాల్ ప్రజలు మార్పు కోరుతూ బీజేపీకి పట్టం కడతారనే నమ్మకం తనకు ఉందని ధీమా వ్యక్తం చేశారు. బృహన్ ముంబై ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం అనంతరం తొలిసారి పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో మోదీ పాల్గొన్నారు. ఈ ఏడాది ప్రథమార్థంలో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. తరువాయి 2లో

# గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్
## గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తికి ప్రత్యేక ప్రోత్సాహం

- గ్రీన్ అమ్మోనియా ప్లాంట్‌కు సిఎం శంకుస్థాపన
- 2027 నాటికి ఉత్పత్తి ప్రారంభిస్తుందన్న చంద్రబాబు
- గ్రీన్ అమ్మోనియా ఓ మైలు రాయి అన్న పవన్ కళ్యాణ్

కాకినాడ : 2014లోనే మా ప్రభుత్వం గ్రీన్ ఎనర్జీకి నాంది పలికింది. ఇప్పుడు గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియాకు నాంది పలికాం అని అన్నారు. కాకినాడలో ఏర్పాటయ్యేది ప్రపంచంలోనే అతిపెద్ద గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ. 2027 జూన్ నాటికి మొదటి దశ ఉత్పత్తి ప్రారంభమవుతుంది. గ్రీన్ అమ్మోనియా పరిశ్రమ మన రాష్ట్రానికి గేమ్ ఛేంజర్ కానుందని చంద్రబాబు అనినారు. బొగ్గు వినియోగం వల్ల పర్యావరణం దెబ్బ తింటోంది. కాలుష్యం వల్ల సముద్రంలోనూ పెను మార్పులు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు వెయ్యి కి.మీ సముద్ర తీరం ఉంది. 20 పోర్టులు ఏర్పాటు కానున్నాయి. ప్రపంచంలో ఎండ పుష్కలంగా ఉండేది మన దేశంలోనే. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ .. 2లో



**గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్‌ను తయారు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కాకినాడలో రూ.18వేల కోట్లతో ఏర్పాటు చేయనున్న ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్రాజెక్టుకు చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. 'గ్రీన్ అమ్మోనియా.. భవిష్యత్తులో పెను మార్పునకు నాంది. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి బాగా పెంచాలని ప్రధాని మోదీ కోరుతున్నారు.**



# పట్టాలకెక్కిన తొలి వందేభారత్ స్లీపర్
## మాల్దాలో జెండా ఊపి ప్రారంభించిన ప్రధాని

కోల్‌కతా : భారత్‌లో తొలి వందేభారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కింది. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దాలో జరిగిన కార్యక్రమంలో ఈ అధునాతన రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు స్లీపర్ రైల్లో ప్రయాణించే విద్యార్థులతో మోదీ ముచ్చటించారు. రైలు లోపలికి వెళ్లి అందులోని సౌకర్యాలను ప్రధాని పరిశీలించారు. పశ్చిమ బెంగాల్‌లోని హావ్‌డా- నుంచి అస్సాంలోని గువాహటి (కామాఖ్య) మధ్య ఈ రైలు రాకపోకలు సాగించనుంది. వందేభారత్ స్లీపర్ రైలు గంటకు 180 కి.మీ. గరిష్ఠ వేగాన్ని సాధించగలిగింది. తరువాయి 2లో

## మున్సిపల్ ఎన్నికల
# రిజర్వేషన్ల ఖరారు

- ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- ఎన్నికల సంఘానికి అందనున్న రిజర్వేషన్ల జాబితా
- ఒకటి, రెండు రోజుల్లోనే మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం




హైదరాబాద్ : తెలంగాణలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికల ప్రక్రియలో కీలక ముందడుగు పడింది. 10 మున్సిపల్ కార్పొరేషన్లు, 121 మున్సిపాలిటీలకు సంబంధించిన రిజర్వేషన్లను ప్రభుత్వం ఖరారు చేసింది. శనివారం సాయంత్రానికి మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్ల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కానుంది. రాత్రికి లేదా ఆదివారం ఉదయానికి రాష్ట్ర ఎన్నికల సంఘానికి రిజర్వేషన్ల జాబితా అందజేసే అవకాశం ఉంది. ప్రభుత్వం జీవో ఇచ్చిన వెంటనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసేందుకు ఎస్ఈసీ సిద్ధంగా ఉంది. ఒకటి, రెండు రోజుల్లోనే మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. 10 కార్పొరేషన్లలో ఎస్సీ-1, ఎస్టీ-1, బీసీ-3(ఒకటి మహిళ)లకు కేటాయించారు. జనరల్ కేటగిరీలో ఐదు స్థానాలకు గానూ ఏకంగా నాలుగు స్థానాలను మహిళలకు కేటాయించారు. తరువాయి 2లో

# నేడు ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో సిఎం పర్యటన

- సిపిఐ శతవార్షికోత్సవ సభలో పాల్గొననున్న రేవంత్
- జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం
- మేడారంలో ఆలయం ప్రారంభించనున్న సిఎం
- అక్కడే కేబినెట్ భేటీకి ఏర్పట్లు పూర్తి

వరంగల్ : ఖమ్మం వరంగల్ జిల్లాల్లో సిఎం రేవంత్ రెడ్డి నేడు పర్యటించ నున్నారు. ఖమ్మంలో సిపిఐ వందో వార్షికోత్సవంలో పాల్గొన నున్నారు. అలాగే పలు అభివృద్ధి కార్యక్రమాలకు హాజరవుతారు. మద్దులపల్లిలో జెఎన్టీయూ కళాశాలకు శంకుస్థాపనతో పాటు, నర్సింగ్ కాలేజీని ప్రారంభిస్తారు. 2లో



# తుగ్లక్ పాలన ఏంటో చూస్తున్నాం

- సికింద్రాబాద్ అస్తిత్వం దెబ్బతీసేలా చర్యలు
- సికింద్రాబాద్‌పై పోరాటం ఆపేది లేదు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ బిఆర్ఎస్ నేత కెటిఆర్

హైదరాబాద్ : హైదరాబాద్, సికింద్రాబాద్ కు ఎంతో చరిత్ర ఉందని.. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని తొలగించే విధంగా చేస్తున్నారని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తుగ్లక్ గురించి పుస్తకాల్లో చదువుకున్నాం.. ప్రత్యక్షంగా తుగ్లక్ అంటే ఎలా ఉంటాడో కనిపిస్తుందని విమర్శించారు. మొట్టమొదటి పని టీఎస్‌ను టీజీగా చేశారు.. దీనివల్ల ఏ పేదవాడికి న్యాయం జరిగిందో తెలియదు.. తెలంగాణ తల్లిని తీసేసి కాంగ్రెస్ తల్లిని తీసుకొచ్చి పెట్టారన్నారు. తరువాయి 2లో

# బృహన్ ముంబైలో బిజెపి కూటమి గెలుపు

విజయానికి ప్రధాని నరేంద్ర మోదీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, పార్టీ నేతలు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారామె.ఇదే సమయంలో గతంలో ముంబైలోని తన ఆఫీసు కూల్చివేత ఘటనను గుర్తు చేసుకుంటూ ఉద్ధవ్ ఠాక్రే పార్టీపై విమర్శలు గుప్పించారు. గతంలో నన్ను వేధించిన వారిని, నా ఇంటిని కూల్చేసిన వారిని, మహారాష్ట్ర నుంచి వెళ్లిపోవాలని బెదిరించిన వారిని ఇప్పుడు రాష్ట్రమే వదిలేసింది. మహిళా విద్వేషులు, బంధుప్రీతి మాఫియాకు ప్రజలు సరైన చోటు చూపించారు’ అని కంగనా రనౌత్ విమర్శించారు. బాంద్రాలోని కంగనా రనౌత్ కార్యాలయంపై కొంత భాగాన్ని 2020లో బీఎంసీ అధికారులు నిబంధనల పేరుతో కూల్చేశారు. దీనిపై ముంబై కోర్టును కంగన ఆశ్రయించడంతో బీఎంసీ చర్యను కోర్టు తప్పుపట్టింది. కూల్చివేతలను ఆపాలని, ఆమెకు జరిగిన నష్టాన్ని పూడ్చాలని ఆదేశించింది. మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 2,869 స్థానాలకు గానూ 1,372 స్థానాలను బీజేపీ సారథ్యంలోని మహాయుతి గెలుచుకుంది. బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌నూ కైవసం చేసుకుంది. బీఎంసీలోని 227 వార్డులకు మెజారిటీ మార్క్ 114 కాగా.. బీజేపీ–శివసేన కూటమి మెజారిటీ మార్కును దక్కించుకుంది.

# తుగ్లక్ పాలన ఏంటో చూస్తున్నాం

ప్రజల దగ్గరికి పాలన పోవాలని అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందాలని వికేంద్రీకరణను ఒక విశాల దృక్పథంతోనే కేసీఆర్ ప్రారంభించారని.. కొత్త గ్రామాలు మండలాలు రెవెన్యూ డివిజన్లు జిల్లాలను ఏర్పాటు చేశారన్నారు. 10 జిల్లాలను 33 జిల్లాలుగా మార్చారని.. హైదరాబాదులోనూ వార్డులను జోన్లను పెంచడం జరిగిందన్నారు. వాటికి అభివృద్ధి నిధులను కూడా అధికంగా ఇవ్వడం జరిగిందని తెలిపారు. హైదరాబాద్ సికింద్రాబాద్ అనేది తెలంగాణ ప్రజల గొప్ప అస్తిత్వం చిహ్నాలు.. కానీ రేవంత్ రెడ్డి తీసుకున్న తుగ్లకు నిర్ణయం వలన సికింద్రాబాద్‌కి చారిత్రక గుర్తింపు పూర్తిగా పోయేటట్లు ఉన్నదని అభిప్రాయపడ్డారు. సికింద్రాబాద్లోని అన్ని వర్గాల ప్రజలు ఒక్కటై.. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. ప్రజలంతా సంఘటితమై.. మా పార్టీని ఆహ్వానించడం జరిగిందని.. అక్కడ ఉన్న ప్రజాప్రతినిధులు మొత్తం మా పార్టీకి చెందిన వార అన్నారు. సికింద్రాబాద్లో పుట్టిన బిడ్డలుగా సికింద్రాబాద్ అస్తిత్వాన్ని కాపాడాలని పోరాటం చేస్తున్నారు.. అధికారం ఇచ్చింది పట్టణాల అస్తిత్వాలను ప్రజల అస్తిత్వాలను గుర్తు లేకుండా చేరుపడం కోసం కాదని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.. ‘అధికారం ఇచ్చింది గ్యారెంటీలను అమలు చేయడానికి అధికారం ఇచ్చింది ప్రజలు వారికి మంచి చేయాలని.. కానీ ఇలాంటి ఒక్క పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి చేయడం లేదు.. హైదరాబాద్ నగరంలో రెండు సంవత్సరాలుగా ఒక్క ఇటుక కూడా పెట్టలేదు.. ఒక్క రోడ్డు కూడా వేయలేదు ఒక ఇల్లు కూడా కట్టలేదు.. కానీ నగరం మొత్తం తన విధ్వంసం ప్రణాళికలతోని ముందుకు పోతున్నారు.. ఈరోజు శాంతి ర్యాలీ పేరుతో సికింద్రాబాద్ ప్రజలు ప్రజాప్రతినిధులు ఒక కార్యక్రమాన్ని శాంతియుతంగా చేపట్టారు.. ప్రజల కోరిక మేరకు ప్రజాప్రతినిధులని కోరిక మేరకు తెలంగాణ భవన్ నుంచి బయలుదేరి వెళ్తామని సిద్ధంగా ఉన్నాం.. కానీ నిన్న రాత్రి వరకు అనుమతి ఉందని చెప్పి, ఇప్పుడు అనుమతి లేదని చెప్పి వేలాది మందిని కార్పొరేటర్లను, మాజీ కార్పొరేటర్ లను పార్టీ సీనియర్ నాయకులను సాధారణ ప్రజలను ఎక్కడికి అక్కడ అరెస్టు చేశారు.. ఇంత అరాచకంగా అక్రమంగా పనిచేస్తున్న ప్రభుత్వం అధికారం శాస్వతంగా కాదని గుర్తుపెట్టుకోవాలి.. ఇప్పుడున్న పదవిలో ఎల్లకాలం కొనసాగరని కేటీఆర్ వ్యాఖ్యానించారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాసయాదవ్, కాలె యాదయ్య, కెపి వివేకానంద, ఎమ్మెల్సీలు దేశపతి, వాణి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు బిజెపి సన్నద్ధం

హైదరాబాద్ : రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుందని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పేర్కొన్నారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు చేసిన కృషిని ఆయన అభినందించారు. దాదాపు 5 వేల సర్పంచ్ స్థానాలకు పోటీ చేశామని.. గతంలో కంటే బీజేపీ సర్పంచ్‌ల సంఖ్య పెరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ బలోపేతమైందని.. ఇందుకు ఈ ఫలితాలే నిదర్శనమని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ త్వరలో ముక్కలవు తుందని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని తెలంగాణ బీజేపీ చీఫ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లడం, సభలు నిర్వహించడం తప్ప ఏమీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 40 శాతం కమిషన్‌గా మారిపోయిందని, పారిశ్రామికవేత్తలను బెదిరిస్తుందని ఆరోపణలు చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు పెద్దఎత్తున నిధులు అందిస్తోందని.. వాటితోనే అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రాజెక్టులకు, విద్యాలయాలకు భూమి కేటాయించడం లేదని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ఏమీ చేయలేదని రాంచందర్ రావు విమర్శించారు. గ్రామాల్లో అభివృద్ధికి ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లాల్సిన అవసరం లేదని, కేంద్ర నిధులతోనే చేయవచ్చని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర పథకాలపై అబద్ధాలు ప్రచారం చేస్తోందని.. తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని ఆరోపించారు. మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో కేంద్ర పథకాలను తీసుకెళ్లాలని సూచించారు. ఇటీవల త్రివేండ్రం ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేశామని.. కేరళలో కార్యకర్తలపై దాడులు జరిగినా పట్టువదలకుండా పనిచేశామని, ముంబై కార్పొరేషన్‌లోనూ గెలిచామని గుర్తుచేశారు. బీఎంసీ ఎన్నికల్లో 29 మున్సిపాలిటీల్లో 25 స్థానాల్లో బీజేపీ గెలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలన్నారు రాంచందర్ రావు. ప్రజల సేవకు కమిట్మెంట్‌తో పనిచేస్తామని, ప్రజలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. మున్సిపాలిటీలకు కేటాయించిన ప్రాంతాల్లో నాయకులు అక్కడే ఉండాలని, బీజేపీ జెండాను ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పిలుపునిచ్చారు.

# గణతంత్ర దినోత్సవ వేళ రాష్ట్రాలకు హై అలర్ట్

న్యూఢిల్లీ,జనవరి17 : గణతంత్ర దినోత్సవం–2026 సందర్భంగా అన్ని రాష్ట్రాలకు భద్రతా సంస్థలు హై అలర్ట్ ప్రకటించాయి. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీని లక్ష్యంగా చేసుకుని ఉగ్రదాడి జరిగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఖలిస్థానీ, బంగ్లాదేశ్ కేంద్రంగా పనిచేసే ఉగ్ర గ్రూపులు ఢిల్లీ, హరియాణా, పంజాబ్, ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్, ముంబై, హైదరాబాద్ సహా పలు ప్రధాన నగరాల్లో దాడులకు పాల్పడే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) హెచ్చరించింది. ఆయా నగరాల్లోని రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఉగ్రమూకలు గగనతలం నుంచి డ్రోన్ల ద్వారా దాడులు జరిపే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని ముఖ్య ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తూ నిఘా పెంచారు అధికారులు. ఇప్పటికే సుమారు 50,000 మందికి పైగా పోలీసులు, 65 కంపెనీల పారామిలిటరీ దళాలు ఢిల్లీలో మోహరించారు. గణతంత్ర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాల భద్రతా బలగాలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో పేర్కొంది.

# పాలమూరు బిడ్డల శ్రమతోనే ప్రాజెక్టులు

పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేసే బాధ్యత నాది. ఇవాళ రాష్ట్రంలో 3.50 కోట్ల మంది పేదలకు రేషన్ కార్డులపై సన్న బియ్యం ఇస్తున్నాం. గతంలో పదేళ్ల పాటు పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. మారీచ, సుబాహులు ఏ రూపంలో వచ్చినా ఈ సారి ప్రజలు తరిమి కొడతారని సీఎం అన్నారు. భారత తొలి ప్రధాని నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు, విద్యకే తొలి ప్రాధాన్యత ఇచ్చారని, తమ ప్రభుత్వం కూడా వాటికే ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, చిట్టబోయినపల్లిలో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి నిర్వహించారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులే ఇప్పటికీ జీవనాధారం అయ్యాయన్నారు. గతంలో భూస్వాములు, దొరల వద్ద లక్షలాది ఎకరాలు ఉండేదదని, భూగరిష్ఠ పరిమితి చట్టం తెచ్చి మిగులు భూములను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పంచిందని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు పేదలకు పంచేందుకు ప్రభుత్వం వద్ద భూమి లేదని, ఇప్పుడు చేయగలిగింది మంచి విద్య అందించటమేనన్నారు. విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. నిబద్ధత లేని చదువు వల్ల ప్రయోజనం ఉండదని, ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకోవాలని సూచించారు. 25 ఏళ్లు కష్టపడి చదివితే.. 75 ఏళ్ల వరకు గౌరవంగా జీవించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహా, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డీకే అరుణ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీగా ఆంధ్రప్రదేశ్

మన రాష్ట్రానికి వరం అని అన్నారు. మన సంస్కృతిని కాపాడుకుంటూనే టెక్నాలజీని వాడుకోవాలి. ఎంత ఎత్తుకు ఎదిగినా స్వగ్రామాన్ని మర్చిపోకూడదు. ఆలోచనలు ఆచరణలో పెట్టేవారు చాలా కొద్ది మందే ఉంటారు. వారిలో చలమలశెట్టి అనిల్ ఒకరు. చరిత్రను తిరగరాయడంలో తెలుగువాడు ముందున్నందుకు గర్వంగా ఉంది. ఆనాడు ఎన్టీఆర్ చొరవతో కాకినాడకు నాగార్జున ఫెర్టిలైజర్స్ కంపెనీ వచ్చింది. కాకినాడ గురించి భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా చర్చించుకుంటారు. ఇలాంటి పరిశ్రమలకు అనుకూలమైన పరిస్థితులన్నీ ఇక్కడ ఉన్నాయి. ప్రజలకు మేలు జరిగే ఆలోచనలను కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేస్తోంది. 2047 నాటికి మన రాష్ట్రం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా తయారవుతుందని అన్నారు. గ్రీన్ అమ్మోనియా వల్ల వ్యవసాయ రంగానికి మేలు జరుగుతుందని అన్నారు. ప్రకృతి సేద్యం పెరగడమే అందరి ఆరోగ్యాలకు శ్రీరామ రక్ష. ఎరువులు, పురుగుమందుల వినియోగం బాగా తగ్గించాలి. గ్రీన్ అమ్మోనియాను ఏ దేశానికైనా ఎగుమతి చేసే అవకాశం ఉందని సీఎం అన్నారు. బలమైన సంకల్పం ఉంటేనే ఏదైనా సాధించగలమని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. తాను పుట్టి పెరిగిన కాకినాడకి అనిల్ ఎంతో చేస్తున్నారని అభినందించారు. అనేక కష్టాలను తట్టుకుని ఏఎమ్ గ్రీన్ కంపెనీ పెట్టారు. పర్యావరణాన్ని పరిరక్షించు కుంటూ ముందుకెళ్తున్నాం. గ్రీన్ హైడ్రోజన్ దిశగా మనం వేసే అడుగులు చాలా కీలకం. క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం అన వివరించారు. కాలుష్య రహిత ఇంధన ప్రయాణంలో ఇదో మైలురాయి. రాష్ట్ర సుస్థిరాభివృద్ధిలో ఇది గేమ్ ఛేంజర్ కానుంది. ఈ ప్రాజెక్టు వల్ల వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతారని అన్నారు. గత ప్రభుత్వంలో పారిశ్రామికవేత్తల ఇబ్బందులు తెలుసు. పార్టీలు మారవచ్చు.. కానీ, ప్రభుత్వ వ్యవస్థ శాశ్వతం అని పవన్ అన్నారు.

# తృణమూల్‌ను సాగనంపే సమయం వచ్చింది




రాష్ట్రంలో అవినీతి కారణంగా కేంద్ర పథకాల ప్రయోజనాలు.. పేద ప్రజలకు చేరడం లేదని ప్రధాని ఆరోపించారు. బెంగాల్‌లోని పేదలందరికీ సొంత ఇళ్లు, ఉచిత రేషన్‌తో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందాలన్నదే తన కోరిక అని అన్నారు. పేద ప్రజల కోసం పంపిన సొమ్ములను టీఎంసీ నేతలు లూటీ చేస్తున్నారన్నారు. ’టీఎంసీ ప్రభుత్వం నాకు, బెంగాల్ ప్రజలకు శత్రువుగా మారుతోంది’ అని తీవ్రంగా ఆక్షేపించారు మోదీ. బెంగాల్ విజన్‌తోనే 2047 నాటికి అభివృద్ధి భారత్ విజన్ సాకారమవుతుందని ప్రధాని అన్నారు. ఒడిశా, త్రిపుర, అస్సాం, బిహార్‌లో బీజేపీ వరుస విజయాలను ప్రస్తావిస్తూ, ఇప్పుడు బెంగాల్‌లో సుపరిపాలనకు సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. మహారాష్ట్రలో బీజేపీ ఇటీవల చారిత్రక విజయం సాధించిందని, ముఖ్యంగా ముంబై పురపోరు ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిందని గుర్తుచేశారు. ’ఈసారి బెంగాల్లో మార్పు అవసరముందని నేను చెబుతాను.. బీజేపీ సర్కార్ కావాలి’ అని మీరు చెప్పండి.. అంటూ సభికులను మోదీ ఉత్సాహపరిచారు. కేంద్ర పథకాలను పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని అడ్డుకోవడంపై విమర్శలు గుప్పిస్తూ.. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అడ్డుకున్న ఏకైక రాష్ట్రం బెంగాల్ అని, పేద ప్రజలకు ఎలాంటి పథకాలు అందనీయడం లేదని మోదీ చెప్పారు. ఇలాంటి క్రూర ప్రభుత్వానికి గుడ్‌బై చెప్పే సమయం వచ్చిందన్నారు. మాల్దాలో ఫ్యాక్టరీలు లేకపోవడంతో మాల్దా, ముర్షిదాబాద్ ప్రజలు ఉద్యోగాల కోసం వలసలు వెళ్తున్నారని, మామిడి రైతులు ప్రభుత్వ విధానాలు, వరదల సమయంలో చూపిస్తున్న నిర్లక్ష్యంతో ఎంతో నష్టపోతున్నారని అన్నారు. గంగా, ఫులాహార్ నదీ తీర కోత కారణంగా వేలాది మంది ఇళ్లు కోల్పోయారని, రక్షణ గోడ కోరుతూ ప్రజలు చేస్తున్న ఆర్తనాదాలను టీఎంసీ సర్కార్ ఖాతారు చేయడం లేదని విమర్శించారు. కేంద్రం పంపిన వరద సహాయక నిధులు లబ్దిదారులకు చేరలేదని కాగ్ నివేదకలు కూడా చెబుతున్నాయని అన్నారు. బీజేపీ అధికారంలోకి రాగానే టీఎంసీ అనుచిత విధానాలకు స్వస్తి చెప్పి, వరదల నివారణకు సమగ్ర పరిష్కారం కల్పిస్తామని, మామిడి సాగు చేసే మాల్దా రైతుల కోసం కోల్డ్ స్టోరేజీ సౌకర్యం కల్పించి ఆర్థికంగా బలపడేలా చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆకాంక్షలను తీర్చడంలో మమతా బెనర్జీ నేతృత్వంలోని ప్రభుత్వం విఫలమైందని, బెంగాల్ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ప్రధాని మోదీ అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చే భాజపా ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందన్నారు. బిహార్‌లో ఎన్డీయే విజయం సాధించిందని, ఇక బెంగాల్‌కు సమయం ఆసన్నమైందన్నారు. ఈ సందర్భంగా బెంగాల్‌కు అసలైన సవాల్ చొరబాట్లేనని, వీటిని అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. బెంగాల్‌కు అతిపెద్ద సవాల్ చొరబాట్లేనని.. వీటి కారణంగానే మాల్దా, ముర్షిదాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో అల్లర్లు చెలరేగుతున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. చొరబాట్ల ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల జనాభా వర్గీకరణలోనూ మార్పు వచ్చిందని, వీటిని అరికట్టడానికి తృణమూల్ కాంగ్రెస్ ఎటువంటి చర్యలు చేపట్టలేదని దుయ్యబట్టారు. రాష్ట్రానికి వరద సహాయ నిధులను 40 సార్లు అందించామని, అయినా అవి అసలైన లబ్దిదారులకు చేరలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కేంద్రం నిధులను తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం కొల్లగొడుతోందని.. ఆ పార్టీ అవినీతి, హింస, బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడే పార్టీ అని అన్నారు. టీఎంసీ అధికారం కోల్పోయి.. భాజపా అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. తూర్పు భారత్ దశాబ్దాలుగా వెనకబడి ఉందన్నారు.

# నేడు ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో సిఎం పర్యటన

వ్యవసాయ మార్కెట్ ప్రారంభంతో పాటు మున్నేరు లింక్ కెనాల్ ప్రారంభిస్తారు. కూసుమంచిలో వందపడకల ఆస్పత్రికి శంకుస్థాపన చేస్తారు. ఇకపోతే వరంగల్ పర్యటనలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారు. మేడారంలో అమ్మవారి గద్దెలను ప్రారంభిస్తారు. అనంతరం మేడారంలో కేబినేట్ భేటీ ఉంటుంది. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మంత్రులంతా అక్కడికి చేరుకుంటారు. మేడారంలో జరుగుతున్న సమ్మక్క–సారలమ్మ జాతర ఏర్పాట్లను రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఇప్పటికే పరిశీలించారు. జాతర పనులు తుది దశకు చేరుకున్నాయని ఆమె వెల్లడించారు. ఆ తల్లుల దర్శనం కోసం అన్నివర్గాల ప్రజలు ఈ జాతరకు తరలివస్తారన్నారు. దాదాపు రెండు కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని సీతక్క చెప్పారు. ఈ నేపథ్యంలో అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామని వివరించారు. మేడారం భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డికి.. సమ్మక్క సారలమ్మ తల్లులతో ఎంతో భావోద్వేగ బంధం ఉందని గుర్తుచేశారు. అందుకే రూ.260 కోట్లతో మేడారం అభివృద్ధి పనులు చేపట్టారని చెప్పుకొచ్చారు. జనవరి 18న మేడారంలో దేవాలయాన్ని ప్రారంభించేందుకు సీఎం విచ్చేయనున్నారని తెలిపారు. ఇక్కడే కేబినెట్ సమావేశం సైతం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కేబినేట్‌లో పలు కీలక అంశాలు చర్చించనున్నారు. అలాగే మున్సిపల్ ఎన్నికలపైనా చర్చిస్తారని సమాచారం. ఇకపోతే మేడారం వాట్సప్ చాట్ బాత్‌తోపాటు మొబైల్ యాప్‌నూ విడుదల చేశారు. వెబ్‌సైట్, మొబైల్ యాప్‌లో హెల్త్ క్యాంప్, టాయిలెట్ బాక్సులు, రూట్ మ్యాప్‌లు, ట్రాఫిక్ అప్‌డేట్‌లు, సహాయ కేంద్రాల ఫోన్ నంబర్లు, ఫిర్యాదుల నమోదుకు ప్రత్యేక వ్యవస్థ, నీటి సౌకర్యం తదితర అన్ని సౌకర్యాల సమాచారం కోసం వాట్సాప్ నంబర్ 7658912300 అందుబాటులోకి తీసుకొచ్చినట్లు సీతక్క వివరించారు.

# లక్కీడ్రాల పేరుతో మోసలు

**అలాంటి వారిని బొక్కలో తోస్తాం**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే**

**నగరపోలీస్ కమిషనర్ సజ్జన్నార్ హెచ్చరిక**

హైదరాబాద్,జనవరి17 : సోషల్ మీడియాలో లక్కీ డ్రాల పేరుతో జరుగుతున్న మోసాలపై హైదరాబాద్ సీపీ సజ్జనార్ గట్టి వార్నింగ్ ఇచ్చారు. కార్లు, బైకులు, ప్లాట్లు, డీజేలు ఇస్తామంటూ ఆకర్షణీయ ప్రకటనలతో అమాయకులను మోసం చేస్తున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ మేరకు ’ఎక్స్’ వేదికగా ట్వీట్ చేశారు. ఇటీవల సోషల్ మీడియా వేదికగా లక్కీ డ్రాల పేరుతో భారీగా మోసాలు జరుగుతున్నాయని గుర్తించామని అన్నారు. ’కేవలం రూ.99తో కారు గెలుచుకోండి. లక్కీ డ్రాలో బైక్, ప్లాట్, ఖరీదైన బహుమతులు’ అంటూ ప్రచారం చేస్తూ ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని డబ్బులు వసూలు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. ఈ స్కామ్‌లలో ముఖ్యంగా యువత, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నష్టపోతున్నారని సజ్జనార్ పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో కొంతమంది ఇన్‌ఫ్లూయెన్సర్లు కొత్త వేషాల్లో లక్కీ డ్రా స్కామ్‌లకు తెరలేపారని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌ల మాదిరిగానే వీటి ద్వారా కూడా ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి, చివరికి ఎలాంటి బహుమతులు ఇవ్వకుండా మోసం చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ విషయంలో సీపీ సజ్జనార్ కఠినంగా స్పందించారు. సెలబ్రిటీలు, సోషల్ మీడియా స్టార్లయినా సరే ఎవరికీ మినహాయింపు లేదని స్పష్టం చేశారు. పాపులారిటీని అడ్డం పెట్టుకుని ప్రజలను దోచుకుంటే కఠిన చర్యలు తప్పవని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. లక్కీ డ్రాల పేరుతో మోసాలకు పాల్పడే వారిపై ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్(బ్యానింగ్) యాక్ట్1978 కింద కేసులు నమోదు చేస్తామని సీపీ సజ్జనార్ హెచ్చరించారు. అవసరమైతే ఐటీ యాక్ట్, చీటింగ్ కేసులు, క్రిమినల్ చట్టం కింద సెక్షన్లు విధించే అవకాశం ఉందని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు. ప్రజలు లక్కీ డ్రాల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే ఆకర్షణీయ ప్రకటనలను నమ్మకండని.. ముందుగా డబ్బులు అడిగే లక్కీ డ్రాలు మోసమేనని, కార్లు, బైకులు, ఎ÷–లాట్లు ఇస్తామంటూ చేసే ఆఫర్లను నిర్ధారించుకోకుండా నమ్మొద్దని సూచించారు. అనుమానాస్పద ఖాతాలు, పోస్టులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. లక్కీ డ్రా స్కామ్‌లకు గురైన వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో, సైబర్ క్రైమ్ విభాగంలో అధికారిక హెల్ప్‌లైన్స్ ద్వారా ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ల దందా బంద్ కావడంతో లక్కీ డ్రా అంటూ కొత్త వేషాలతో వీళ్లు దర్శనమిస్తున్నారని తెలిపారు. ఈ తరహా మోసాలకు పాల్పడే సెలబ్రిటీలైనా, సోషల్‌మీడియా స్టార్లయినా సరే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పాపులారిటీని అడ్డం పెట్టుకుని ప్రజలను దోచుకుంటే కఠిన చర్యలు తప్పవని సజ్జన్నార్ హెచ్చరించారు.

# మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్ల ఖరారు

121 మున్సిపాలిటీల్లో ఎస్సీ–17, ఎస్టీ–5, బీసీ–38, జనరల్–61 కేటాయించడం జరిగింది.కార్పొరేషన్ల వారీగా రిజర్వేషన్లు... ఇలా ఉన్నాయి. కొత్తగూడెం కార్పొరేషన్ – ఎస్టీ (జనరల్),రామగుండం కార్పొరేషన్– ఎస్సీ (జనరల్), మహబూబ్‌నగర్ కార్పొరేషన్– బీసీ మహిళ, మంచిర్యాల కార్పొరేషన్– బీసీ (జనరల్), కరీంనగర్ కార్పొరేషన్ – బీసీ (జనరల్), ఖమ్మం కార్పొరేషన్– మహిళ (జనరల్), నిజామాబాద్ కార్పొరేషన్– మహిళ (జనరల్), వరంగల్ కార్పొరేషన్– జనరల్, జీహెచ్ఎంసీ – మహిళ (జనరల్) నల్లగొండ కార్పొరేషన్– మహిళ (జనరల్) కు కేటాయించారు.

# పట్టాలకెక్కిన తొలి వందేభారత్ స్లీపర్

రైల్వే భద్రత కమిషనర్ (సీఆర్ఎస్) సమక్షంలో కోటా (రాజస్థాన్) నుంచి నాగ్దా (మధ్యప్రదేశ్) మధ్య తుది పరీక్షలు నిర్వహించగా రైలు ఈ వేగాన్ని చేరుకుంది. గాజు గ్లాసుల్లో నీళు నింపి ఒకదానిపై ఒకటిగా ఈ రైలింజిన్‌లో ఉంచినా.. రైలు గరిష్ఠ వేగాన్ని చేరుకున్నప్పుడు కూడా ఏమాత్రం నీళ్లు తొణకకపోవడాన్ని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ గతంలో సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు. ఈ రైల్లో 16 కోచ్‌లు ఉన్నాయి. వీటిలో ఆకర్షణీయమైన (ఏసీ) స్లీపర్ బెర్తులు, అధునాతన సస్పెన్షన్ వ్యవస్థ, నిప్పును గుర్తించే వ్యవస్థలు, సీసీటీవీ నిఘా వంటివి ఉంటాయి. విమానంలో ప్రయాణించిన అనుభూతిని కలిగించేలా ఇందులో సౌకర్యాలను ఏర్పాటుచేశారు. ఇందులో కనీస ఛార్జి రూ.960 నుంచి ప్రారంభమవుతుంది. ఆర్ఏసీ, వెయిటింగ్ లిస్ట్ వంటి వాటిని ఇందులో అనుమతించరు.

# ఇక సంగారెడ్డి నుంచి పోటీ చేసేది లేదు

అందుకే సంగారెడ్డిలో నేను ఎమ్మెల్యేగా జీవితంలో పోటీ చేయను’ అని అన్నారు. రాహుల్ గాంధీ నా భుజంపై చేయివేసి జగ్గారెడ్డిని గెలిపించాలని అడిగితే.. నన్ను ఇక్కడి వారు ఓడించారు. నా జీవితంలో ఈ ఓటమి మరిచిపోలేనిది. నా ఓటమికి కారణం పేద ప్రజలు కాదు. సంగారెడ్డిలోని మేధావులు, కొందరు పెద్దలు మాత్రమే. రేపటి రోజు సంగారెడ్డిలో నా భార్య నిర్మలా పోటీచేసినా నేను ప్రచారానికి రాను. భవిష్యత్తులో రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లి ప్రచారం చేస్తాను. కానీ.. సంగారెడ్డిలో మాత్రం చేయను’ అంటూ జగ్గారెడ్డి సంచలన కామెంట్స్ చేశారు.

## వార్డుల రిజర్వేషన్లపై ఉత్కంఠ

**ఆయా వార్డులపై నేతల్లో ఆందోళన**

**సమాచారం కోసం నేతలతో సంప్రదింపులు**

కామారెడ్డి,జనవరి17 : ఉమ్మడి జిల్లా మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల సందడి మొదలైంది. నిజామాబాద్ జనరల్ మహిళకు రిజర్వ్ అయ్యింది. అయతే వార్డులు, ఇతర మున్సిపాలిటీల వివరాలు అందా÷–లసి ఉంది. ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు రిజర్వేషన్లపై ఆందోళన చెందుతున్నారు. గతానికి భిన్నంగా ఇప్పుడు రిజర్వేషన్లు కేటాయించే అవకాశం ఉండడంతో తమకు కలిసి వస్తుందో లేదోనని ఉత్కంఠకు గురవుతున్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా అధికారులు సోమవారం తుది ఓటరు జాబితాను ప్రకటించగా, ఇక రిజర్వేషన్ల ఖరారు మాత్రమే మిగిలి ఉండంతో అంతా ఎదురుచూశారు. ఇప్పుడు అవికూడా ఖరారు కావడంతో మెల్లగా రంగంలోకి దిగుతున్నారు. వారం రోజుల క్రితం ఓటరు జాబితా డ్రాఫ్టను విడుదల చేసిన అధికారులు, సోమవారం ఫొటోలతో కూడిన తుది ఓటరు జాబితాను అధికారికంగా ప్రచురించారు. మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ స్టేషన్ల వివరాలు, బూత్‌లను ప్రకటించనున్నారు. ఓటర్లు, వార్డులు, పురుష, మహిళా ఓటర్ల వివరాలను ప్రకటించిన అధికారులు ఇప్పుడు రిజర్వేషన్లకు సంబంధించిన వివరాల సేకరణలో నిమగ్నమైనట్లు సమాచారం. ఉన్నతాధికారులు సమాచారం అడిగిన వెంటనే ఇవ్వడానికి వారు కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఆయా మున్సిపాలిటీలకు సంబంధించిన సమగ్ర సమాచారం తీసుకున్న రాష్ట్ర స్థాయి అధికారులు రాజధానిలోనే వాటిని ఖరారు చేయనున్నారు. గత మున్సిపల్ ఎన్నికల్లో అమలుచేసిన రిజర్వేషన్లు, జనాభా లెక్కల సమాచారాన్ని క్రోడీకరించి నిబంధనల ప్రకారం రిజర్వేషన్లను ఖరారు చేస్తారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలను యూనిట్‌గా తీసుకొని రిజర్వేషన్లను ప్రకటిస్తారని తెలుస్తున్నది.ప్రతి మున్సిపల్‌లో వార్డులకు సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పటికే సంబంధిత జిల్లా అధికారులు తీసుకున్నారు. రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు ఆయా మున్సిపాలిటీల్లో గత పాలక వర్గంలో ఉన్న రిజర్వేషన్లు, ఇప్పుడు ఉన్న ఓటర్ల వివరాల ఆధారంగా ఖరారు చేసే అవకాశం ఉన్నదని అధికారులు చెబుతున్నారు. ఆయా వార్డుల్లో పెరిగిన ఓటర్ల సంఖ్య, పెరిగిన కులాల వారీగా ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా ఇప్పటి రిజర్వేషన్లు ఉండనున్నాయి. పెరిగిన మున్సిపాలిటీల్లో వార్డుల సంఖ్య పెరుగుతుంది. దీని ఆధారంగా అక్కడ వార్డుల రిజర్వేషన్లు పూర్తిగా మారే అవకాశం ఉన్నదని అధికారులు పేర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలో బీసీ, ఎస్సీ, ఎస్టీల వారీగా ఓటర్ల వివరాలను సేకరించడంలో అధికారులు బిజీగా ఉన్నారు.

# జనవరి 28 నుండి 31 వరకు మేడారం జాతర

### కాకతీయ రాజుతో పోరాడి నేలకొరిగిన కోయరాజులు

### నాటినుంచే మేడారం జాతరకు శ్రీకారం



ములుగు,జనవరి17 : రెండేళ్లకోమారు జరిగే మేడారం జాతర ఈ యేడు జనవరి 28 నుండి 31 వ తేదీ వరకు జరుగుతుంది. జాతర మొదటి రోజైన 28న కన్నేపల్లి నుంచి సారలమ్మను గద్దెకు తీసుకు వస్తారు. అదే రోజు కొండాయి నుండి గోవిందరాజులును, పూనుగుండ్ల నుండి పడిగిద్దరాజులను గద్దెలపై ప్రతిష్టింప చేస్తారు. రెండవ రోజున 29నసమ్మక్కను చిలుకల గుట్ట నుండి పూజార్లు తీసుకోని వచ్చి గ్దదెపై ప్రతిష్టింప చేస్తారు. మూడో రోజున శుక్రవారం పూర్తి మొక్కుల చెల్లింపు, నాలుగవ రోజు సాయంత్రం దేవ దేవతలను తిరిగి వన ప్రవేశం చేస్తారు. వంశపారంపర్యంగా వస్తున్న ఆదివాసులే పూజార్లు కావడం ఈ జాతర పూర్తిగా ఆదివాసీ సాంప్రదాయాల ప్రకారం నిర్వహించడం ప్రత్యేకత. తమ కోర్కెలు తీర్చమని భక్తులు అమ్మవార్లకు బంగారం (బెల్లము) నైవేద్యంగా సమర్పించుకుంటారు. తెలంగాణ రాష్ట్రంలో ములుగు జిల్లాలో జరిగే అతిపెద్ద, విశిష్ట ఆదివాసిల జాతర మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ప్రతి రెండు సంవత్సరాల కొకసారి జరుగుతుంది. ఈ సంవత్సరం జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరుగుతోంది. తెలంగాణ రాష్ట్రం నుండే కాకుండా పొరుగు రాష్టాల్రైన ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్, జార్ఖండ్, ఒడిశా రాష్టాల్ర నుంచి సుమారు కోటిన్నరకు పైగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఇది ఆసియాలోనే అతి పెద్ద గిరిజన జాతరగా పేరొందింది. 12వ శతాబ్దంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జగిత్యాల ప్రాతంలోని పొలవాసను పాలించే ఆదివాసి దొర మేడరాజు ఏకైక కుమార్తె సమ్మక్కను ఆయన మేనల్లుడైన మేడారం పాలకుడు పగిడిద్దరాజు కిచ్చి వివాహం చేశారు. ఈ దంపతులకు సారలమ్మ, జంపన్న ఇద్దరు సంతానం. కాకతీయులకు ప్రతీ సంవత్సరం చెల్లించే కప్పం కట్టలేదన్న కారణంతో కాకతీయ ప్రభువు మొదటి ప్రతాపరుద్రుడు పొలవాసపై దండెత్తుతాడు. ఆయన దాడికి తట్టుకోలేక మేడరాజు మేడారం పోయి అజ్ఞాత వాసం గడుపుతుంటాడు. మేడారాన్ని పాలించే పగిడిద్దరాజు కాకతీయుల సామంతునిగా వుంటూ కరువు కాటకాల కారణంగా కప్పం కట్టలేక పోతాడు. కప్పం కట్టకపోవడం, మేడరాజుకు ఆశ్రయం కల్పించడం, కోయ ఆదివాసిల సార్వభౌమునికి వ్యతిరేకంగా తిరుగుబాటు భావాజాలాన్ని నూరిపోసి రాజ్యాధికారాన్ని ధిక్కరిస్తున్నాడనే కారణాలతో పగిడిద్దరాజుపై ఆగ్రహం చెందిన ప్రతాపరుద్రుడు అతడిని అణచివేయడానికి తన ప్రధానమంత్రి యుగంధరుడితో మాఘ శుద్ధ పౌర్ణమి రోజున మేడారంపై దండెత్తుతాడు. సాంప్రదాయ ఆయుధాలు ధరించి పోరాడిన పగిడిద్దరాజు, సమ్మక్క, సారక్క, జంపన్న, గోవిందరాజులు విరోచితంగా పోరాటం చేసినప్పటికీ సుశిక్షుతులైన అపార కాకతీయ సేనల ధాటికి తట్టుకోలేక పగిడిద్దరాజు, సారలమ్మ, నాగులమ్మ, గోవిందరాజులు యుద్ధంలో మరణిస్తారు. పరాజయ వార్త విన్న జంపన్న అవమానాన్ని తట్టుకోలేక సంపెంగ వాగులో దూకి ఆత్యహత్యకు పాల్పడతాడు. అప్పటి నుంచి సంపెంగవాగు జంపన్న వాగుగా ప్రసిద్ధి చెందింది.ఇక సమ్మక్క యుద్ధ భూమిలో కాకలు తీరిన కాకతీయుల సైన్యాన్ని ముప్ప తిప్పలు పెడుతుంది. ఆదివాసి మహిళ యుద్ధ నైపుణ్యానికి ప్రతాపరుద్రుడు ఆశ్చర్యచకితుడు అవుతాడు. చివరికి సమ్మక్కను కాకతీయుల సైన్యం వెనుక వైపు నుండి బరిసెతో పొడుస్తారు. శత్రువుల చేతిలో దెబ్బతిన్న సమ్మక్క రక్తపు ధారలతోనే యుద్ధ భూమి నుంచి నిష్క్రమించి చిలుకల గుట్టవైపు వెళుతూ మార్గమధ్యములోనే అదృశ్యమవుతుంది. సమ్మక్కను వెతుక్కుంటూ వెళ్ళిన అనుచరులకు ఆమె జాడ కనిపించలేదు. కానీ ఆ ప్రాంతంలో ఒక పుట్ట దగ్గర పసుపు, కుంకుమలు గల కుంకుమ భరణ లభిస్తుంది. దాన్ని సమ్మక్కగా భావించి అప్పటి నుంచి ప్రతి రెండేళ్లకు ఒకసారి మాఘ శుద్ధ పౌర్ణమి రోజున సమ్మక్క - సారలమ్మ జాతరను అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారు. గిరిజనుల ఆచారం మేరకు ఈ సంప్రదాయ జాతరకు ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేసింది. గద్దెలను కొత్తగా నిర్మించింది. ఈ పనులకు సిఎం రేవంత్ రెడ్డి ఆదివారం ప్రారంభిస్తారు.

## సికింద్రాబాద్ అస్తిత్వ పరిరక్షణ కోసం పోరాటం

### బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

హైదరాబాద్,జనవరి17 : సికింద్రాబాద్ చుట్టూ రాజకీయ రగడ రాజుకుంది. సికింద్రాబాద్‌కు ప్రత్యేక మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఈ డిమాండ్‌కు మద్దతుగా 'సికింద్రాబాద్ బచావో' పేరుతో ర్యాలీ నిర్వహించేందుకు బీఆర్ఎస్ పిలుపునిచ్చింది. అయితే ఈ ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు. తెలంగాణ భవన్ వద్ద బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోగా, ర్యాలీ నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జాయింట్ సీపీ హెచ్చరించారు. దీంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌కు ఎంతో గొప్ప చరిత్ర ఉందని ఆయన గుర్తుచేశారు. సికింద్రాబాద్ అస్తిత్వాన్ని తొలగించే విధంగా ప్రస్తుతం ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. సికింద్రాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు ఉండాలని, దాన్ని కాపాడేందుకే బీఆర్ఎస్ ఈ ఉద్యమానికి పిలుపునిచ్చిందని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలపై ప్రజలు ఆలోచించాలని, సికింద్రాబాద్ అస్తిత్వ పరిరక్షణ కోసం పోరాటం కొనసాగుతుందని తెలిపారు.

## బస్టాండ్‌లలో ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్

### ఏపిఎస్ ఆర్టీసికి ప్రతిష్టాత్మక జాతీయ అవార్డు

### ఆర్టీసి అధికారులు, సిబ్బంది కృషిని అభినందించిన మంత్రి

అమరావతి,జనవరి 17 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు మరో జాతీయ అవార్డు దక్కింది. రాష్ట్రవ్యాప్తంగా బస్టాప్‌లలో ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ విజయవంతంగా అమలు చేసినందుకు గానూ ఏపీఎస్‌ఆర్టీకి ప్రతిష్టాత్మకమైన గవర్నెన్స్ నౌ 6వ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్ అవార్డ్ వరించింది. ఈ అవార్డు ద్వారా ప్రయాణికుల సౌకర్యార్థం డిజిటల్ సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించిన ఏపీఎస్‌ఆర్టీసీ కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. అవార్డుపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పందిస్తూ.. ఏపీఎస్‌ఆర్టీసీకి ప్రతిష్టాత్మక గవర్నెన్స్ నౌ - 6వ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సమ్మిట్ అవార్డు రావడం గర్వకారణమని అన్నారు. ఈ విజయం ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది అందరూ ప్రజలకు అంకితభావంతో అందిస్తున్న సేవలకు నిదర్శనమని అభివర్ణించారు. ప్రధాన బస్టాప్‌లలో అమలు చేసిన ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ ద్వారా ప్రయాణికులకు రియల్- టైమ్, స్పష్టమైన సమాచారం అందుతోందని తెలిపారు. ముందస్తు సమాచారం అందించడం వల్ల సేవల నాణ్యత గణనీయంగా పెరిగిందని మంత్రి తెలిపారు. అవార్డు సాధనలో కీలక పాత్ర పోషించిన ఏపీఎస్‌ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుతో పాటు సిబ్బందిని మంత్రి అభినందించారు. సీఎం చంద్రబాబు నాయుడు విజన్‌కు అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుని ఆర్టీసీ ముందడుగులు వేస్తోందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రయాణికులకు మరింత ఆధునిక, సౌకర్యవంతమైన సేవలు అందిస్తామన్నారు. ప్రజా రవాణా రంగంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, పండుగల సమయంలో సాధారణ ఛార్జీలు కొనసాగిస్తూ ఏపీఎస్‌ఆర్టీసీని దేశానికి ఆదర్శంగా నిలబెడతామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో ప్రయాణికులకు మరింత ఆధునిక, సౌకర్యవంతమైన సేవలు అందిస్తామన్నారు. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఢిల్లీలో అవార్డు అందుకున్నారు.

## బంగ్లాలో ఆగని హింస

### మరో హిందూ యువకుడి దారుణ హత్య

ఢాకా,జనవరి17 : బంగ్లాదేశ్‌లో మైనారిటీలే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయి. తాజాగా మరో హిందువును కారుతో తొక్కించి మరీ దారుణంగా హత్య చేశారని స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. మీడియా కథనాల ప్రకారం రాజ్‌బరిలోని కరీం ఫిల్లింగ్ స్టేషన్‌లో రిపోన్ సాహా (30) పనిచేస్తున్నాడు. శుక్రవారం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బిఎన్‌పి) రాజ్‌బరి జిల్లా యూనిట్ మాజీ కోశాధికారి అబుల్ హషేమ్ పెట్రోల్ కోసం వచ్చాడు. పెట్రోల్ కొట్టించుకున్నాక డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించాడు. రిపోన్ డబ్బు ఇవ్వాల్సిందిగా హషేమ్‌ను అడగ్గా అతడిపైకి కారుతో దూసుకెళ్లాడు. కారు తనపై నుంచి వెళ్లడంతో తీవ్రగాయాల పాలైన రిపోన్ మృతి చెందాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అబుల్ హషేమ్‌ను, అతడి కారు డ్రైవర్‌ను అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఇరాన్‌లో అస్థిర పరిస్థితులు

### భారత్ హెచ్చరికతో స్వదేశానికి పౌరులు

### రెండు విమానాల్లో పలువురిక రాక

న్యూఢిల్లీ : ఇరాన్‌లో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. నిరసనల కారణంగా ఇప్పటివరకు సుమారు రెండు వేల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇరాన్‌లోని భారతీయులు జాగ్రత్తగా ఉండాలని, వీలైనంత త్వరగా ఇండియాకు వచ్చేయాలని సూచించింది. శుక్రవారం రాత్రి రెండు కమర్షియల్ విమానాలు భారతీయులతో ఢిల్లీ చేరుకున్నాయి. అయితే.. అవి రెండూ రెగ్యులర్ విమానాలే. భారతీయులను ఇరాన్ నుంచి ఇండియాకు తరలించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన విమానాలు కాదు. ఇక.. భారత ప్రభుత్వం అక్కడి పరిస్థితులను బట్టి చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు. ఉద్రిక్త పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అత్యవసరమైతే తప్ప ఇరాన్‌కు ప్రయాణించవద్దని భారతీయులను హెచ్చరించింది. ఇరాన్ ఎయిర్ స్పేస్ తాత్కాలికంగా మూసివేయడంతో జనవరి 15 నుంచి రెండు దేశాల మధ్య పలు విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఇప్పుడిప్పుడే ఎయిర్ స్పేస్ పరిస్థితులు సాధారణ స్థితిలోకి వస్తున్నాయి. దీంతో భారతీయులు అక్కడి నుంచి ఇండియాకు వచ్చేస్తున్నారు. విపత్కర పరిస్థితుల్లో భారత ప్రభుత్వం తమకు ఎంతో సాయం చేసిందని అంటున్నారు. శుక్రవారం రాత్రి ఇండియాకు చేరుకున్న ఓ ఎంబీబీఎస్ విద్యార్థిని మీడియాతో మాట్లాడుతూ.. 'నేను నిరసనల గురించి విన్నాను. కానీ, నేరుగా చూడలేదు. అక్కడ ఇంటర్‌నెట్ కూడా లేదు' అని చెప్పుకొచ్చారు. మరో వ్యక్తి స్పందిస్తూ.. 'మేము బయటకు వెళ్లినపుడు నిరసనకారులు కారుకు అడ్డంగా వచ్చారు. కొంచెం ఇబ్బంది పెట్టారు. అక్కడ ఇంటర్‌నెట్ కూడా లేదు. ఆ కారణంతో ఇండియాలోని మా కుటుంబాలకు విషయం చెప్పలేకపోయాం. ఆఖరికి ఇండియన్ ఎంబసీని కూడా సంప్రదించలేకపోయాం' అని వాపోయారు. ఓ ఇంజనీర్ మాట్లాడుతూ.. 'ఇప్పుడిప్పుడే పరిస్థితులు చక్కబడుతున్నాయి. నెట్‌వర్క్ సమస్యలు ఉన్నాయి' అని అన్నారు.

## మేడారం జాతరకు దగ్గరపడుతున్న ఘడియలు

### భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులకు ప్లాన్

వరంగల్,జనవరి : ఆసియా ఖండంలోనే అతిపెద్ద మహోత్సవం మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు శరవేగంగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఇంటిల్లిపాది తరలివెళ్లి మొక్కులు చెల్లించడం ఆనవాయితీ. రెండేళ్లకోసారి జరిగే ఈ జాతర సమీపిస్తున్న వేళ ఇప్పటికే చాలా మంది భక్తులు మేడారం బాట పడుతున్నారు. ఈనెల 28, 29, 30, 31 తేదీల్లో మహాజాతర జరగనుండగా భక్తులను తరలించేందుకు ఆర్టీసీ అధికారులు సమాయత్తం అవుతున్నారు. జాతర జరిగే మూడు రోజుల ముందు నుంచే ప్రత్యేకంగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. భూపాలపల్లి ఆర్టీసీ డిపో నుంచి వివిధ ప్రాంతాల మీదుగా మేడారానికి భక్తులతను సురక్షితంగా తరలించేందుకు భూపాలపల్లి ఆర్టీసీ డిపో అధికారులు సన్నద్ధమయ్యారు. ఈ నెల 25 నుంచి మొదలై జాతర మొదలు ఫిబ్రవరి 1 వరకు ప్రత్యేక బస్సులను నడిపించనున్నారు. 8 రోజుల పాటు భక్తులను తరలించేందుకు ప్రత్యేకంగా 340 బస్సులను సిద్ధం చేశారు. రోజుకు సుమారు 50 ట్రిప్పులను నడిపించనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఇందుకు నాలుగు టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేస్తున్నారు. సకాలంలో ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయడంలో గతంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపించాయి. ఫలితంగా ప్రైవేటు వాహనాల్లోనే భక్తులు తరలివెళ్లడంతో అతి తక్కువ మంది ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఎదురైందనే ఆరోపణలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వం మహిళల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మహాలక్ష్మి పథకంలో భాగంగా ఈ జాతరలో ఆర్టీసీలో ఉచిత ప్రయాణాలను కల్పించేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఉన్న తరహాలోనే సూపర్ లగ్జరీ బస్సులు మినహా ఎక్స్‌ప్రెస్, ఆర్డీనరీల్లో మేడారానికి తరలివెళ్లే భక్తులకు ఉచిత ప్రయాణ సదుపాయం ఉంటుందని అధికారులు వెల్లడించారు. అయితే, చార్జీల పెంపు ఉంటుందనే చర్చ సాగతుండగా వాటిపై ప్రభత్వం ఇప్పటికి స్పష్టతనివ్వలేదు. గత జాతర మాదిరిగానే చార్జీలను అమలు చేస్తారా.. లేదా పెంచుతారా? అనే విషయం తెలియాల్సి ఉంది. మరోవైపు 340 బస్సులను ఏర్పాటు చేస్తున్న అధికారులు వీటిని సమయానుకూలంతో పాటు ప్రయాణికలకు సరిపడా బస్సులను సకాలంలో అందుబాటులో ఉంచేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలనే డిమాండ్ భక్తుల నుంచి వ్యక్తమవుతోంది.

## ఆర్టీసీ బస్సులను వినియోగించుకోండి

### కొత్త బస్సులకు మంత్రి అచ్చన్న ప్రారంభం

శ్రీకాకుళం,జనవరి17 : ప్రజలు బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, పాడిపరిశ్రమాభివఅద్ధి మత్స్యశాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శనివారం టెక్కలిలో పోలీస్ స్టేషన్ దగ్గర ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సులను పూజలు నిర్వహించిన అనంతరం జెండా ఊపి 7 బస్సులను ఆయన ప్రారంభించారు. ఈ బస్సులు శ్రీకాకుళం-1, 2 టెక్కలి డిపోలకు చెందిన వివిధ రూట్లకు సర్వీసు అందిస్తాయన్నారు. టెక్కలి - శ్రీకాకుళం -అమలాపురం మార్గంలో ఒక కొత్త సూపర్ లగ్జరీ బస్సు, టెక్కలి - విశాఖపట్నం - ఇచ్ఛాపురం మార్గంలో ఒక కొత్త ఎక్స్ ప్రెస్, టెక్కలి, విశాఖపట్నం, ఇచ్ఛాపురం మార్గంలో ఒక కొత్త బస్సు, శ్రీకాకుళం, విజయవాడ మార్గంలో ఒక కొత్త సూపర్ లగ్జరీ బస్సు, శ్రీకాకుళం -విజయనగరం మార్గంలో ఒక ఎక్స్ ప్రెస్, శ్రీకాకుళం - బత్తిలి మార్గంలో ఒక అ÷-దదె ప్లలె వెలుగు, శ్రీకాకుళం ? విశాఖపట్టణం మార్గంలో ఒక అ÷-దదె అల్టా డీలక్స్ బస్సులు ఆయా రూట్లలో ప్రజలకు సర్వీసులు అందిస్తాయన్నారు. ఇందులో మూడు బస్సులు అద్దెవని, నాలుగు బస్సులు ప్రభుత్వం కొనుగోలు చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు బస్సుల సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని సర్వీసులను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం మాజీ శాసన సభ్యులు కలమట వెంకటరమణ, పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వర ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బాగాది శేషగిరిరావు,పిసకాన అజరు కుమార్, కోల లవకుమార్, లాడి శ్రీనివాసరావు, హనుమంతు రామకఅష్ణ, కెల్లి శ్రీరాములు, ఆర్ఎం, శ్రీకాకుళం 1,2 టెక్కలి డిపోల మేనేజర్లు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## జెఇఇ పరీక్షల అడ్మిట్ కార్డుల విడుదల

న్యూఢిల్లీ,జనవరి17 : జేఈఈ మెయిన్ సెషన్-1 పరీక్షకు సంబంధించిన అడ్మిట్ కార్డులను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ శనివారం విడుదల చేసింది. జనవరి 21, 22, 23, 24 తేదీల్లో జరగనున్న పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డుల్ని వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. దేశవ్యాప్తంగా జనవరి 21, 22, 23, 24, 28 తేదీల్లో జేఈఈ మెయిన్ పేపర్-1 పరీక్ష, 29న పేపర్ -2 పరీక్ష జరగనున్నాయి. ప్రస్తుతానికి తొలి నాలుగు రోజుల అడ్మిట్ కార్డులను విడుదల చేయగా.. 28, 29 తేదీల్లో జరిగే పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డులను తర్వాత విడుదల చేయనున్నారు. మొత్తం రెండు షిఫ్టుల్లో ఈ పరీక్షలు జరుగుతాయి. తొలి షిఫ్టు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు; రెండో షిఫ్టు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహిస్తారు.

## జిల్లాలో పురపాలక ఎన్నికల హీట్

### నేతల్లో మొదలైన కోలాహలం

మహబూబాబాద్,జనవరి17 : జిల్లాలోని ఐదు పురపాలక సంఘాల్లో ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. పురపాలక ఎన్నికలకు త్వరలో షడ్యూల్ వెలువడనుండడంతో పాటు, రిజర్వేషన్లు కూడా కొలిక్కి వచ్చాయి. దీంతో పట్టణాల్లో సందడిమొదలయ్యింది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇటీవల పురపాలక సంఘాల్లో సామాజిక వర్గాల వారీగా వార్డుల సంఖ్య కోటాను ప్రకటించింది. దీంతో ఆశావాహులు ఏ వార్డులు ఏ కేటగిరికి రిజర్వు కావచ్చు అంటూ అంచనాలు వేస్తున్నారు. దీంతో పట్టణాల్లో సర్వత్రా వార్డుల రిజర్వేషన్లపై చర్చకొనసాగుతుంది. 2011 జనాభా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం బీసీ రిజర్వేషన్లను నిర్ణయించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. పురపాలక సంఘం అధికారులు కూడా వార్డుల రిజర్వేషన్ల ఖరారుకు కసరత్తులు చేసి సంబంధిత వివరాలను జిల్లా కలెక్టర్‌కు అందించినట్లు సమాచారం. సమావేశాలు.. సంప్రదింపులు వార్డు కౌన్సిలర్లు, ఛైర్మన్లు/ఛైర్‌పర్సన్‌ల రిజర్వేషన్లు ఖరారు కానప్పటికీ ఇప్పటికే ప్రధాన పార్టీల నాయకులు ఆశావాహుల నుంచి పేర్లను తీసుకోవడంతో పాటు గెలుపు గుర్రాలు ఎవరనే అంశాలపై దృష్టి సారించారు. కాంగ్రెస్, భారాస, భాజపా, సీపీఐ, సీపీఎం పార్టీలు పుర ఎన్నికలకు సై అంటూ అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాయి. అధికార పార్టీ పురపాలక సంఘాల వారీగా సమావేశాలు నిర్వహిస్తూ వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు చర్యలు చేపట్టారు. రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ఇటీవల మహబూబాబాద్, డోర్నకల్‌లో పర్యటించి అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించి పట్టణంలోని కార్యకర్తలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశంచేశారు. గత నెలలో బిఆర్స్ నేత కేటీఆర్ సర్పంచుల సన్మాన కార్యక్రమానికి హాజరై పురపాలికల్లో కూడా భారాస విజయం సాధించేందుకు సమష్టి కృషి చేయాలంటూ ముఖ్యనేతలకు సూచించి ఉత్సాహాన్ని నింపారు. భాజపా నాయకులు సైతం జిల్లా, పురపాలక సంఘాలవారీగా సమావేశాలను నిర్వహిస్తున్నారు. సీపీఐ, సీపీఎం పార్టీలు కూడా పోటీకి మేము సై అంటూ వార్డుల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించారు.

## తిరుగు ప్రయాణంలో జనం

### రద్దీ తట్టుకునేలా ట్రాఫిక్ మళ్లింపు

నల్లగొండ,జనవరి17 : సంక్రాంతి రద్దీ నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. పండగ అనంతరం ఏపీ నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలను దారి మళ్లిస్తున్నారు. ఎన్‌హెచ్-65 విస్తరణ పనుల దృష్ట్యా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. చిట్యాల, పెద్దకాపర్తి, కొర్లపహాడ్, పంతంగి టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశాలు ఉండటంతో.. పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాలు సూచించారు. గుంటూరు నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలను దారి మళ్లిస్తున్నారు. గుంటూరు-మిర్యాలగూడ- హాలియా- చింతపల్లి- మాల్ మీదుగా హైదరాబాద్‌కు వాహనాల మళ్లింపు చేపట్టారు. మాచర్ల- సాగర్- పెద్దవూర- చింతపల్లి- మాల్ మీదుగా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. విజయవాడ నుంచి వచ్చే భారీ వాహనాలు కోదాడ- మాల్ మీదుగా హైదరాబాద్‌కు మళ్లిస్తున్నారు. ఎన్‌హెచ్-65పై ట్రాఫిక్ జామ్ ఏర్పడితే చిట్యాల నుంచి భువనగిరి మీదుగా వాహనాలను దారిమళ్లించనున్నారు. డ్రోన్ కెమెరాలు, సీసీ టీవీలతో ట్రాఫిక్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

## వైకాపా హయాంలో వైశ్యుల అభివృద్ధి శూన్యం: రాకేశ్

అమరావతి,జనవరి17 : ఈనెల 20న కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ కోరారు. జీవో నంబర్ 15తో అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమం ప్రభుత్వ అధికారిక కార్యక్రమమైందని తెలిపారు. వైకాపా హయాంలో దేవాదాయశాఖ మంత్రిగా పనిచేసిన వెల్లంపల్లి.. వైశ్యులకు, కన్యకాపరమేశ్వరి ఆలయాలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో 20న అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పొట్టిశ్రీరాములు 58 రోజుల దీక్షకు ప్రతీకగా మార్చి 16న అమరావతిలో 58 అడుగుల విగ్రహావిష్కరణ చేయనున్నట్లు డూండి రాకేష్ వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యులకు పెద్దపీట వేస్తోందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండను .. వాసవీ పెనుగొండగా పేరుమార్పు చేయడం ఆనందదాయకమన్నారు.

## ట్రేడ్ లైసెన్స్ బకాయిల వసూళ్ళు

### పలువురు వ్యాపారులకు క్లోజర్ నోటీసులు

కర్నూలు,జనవరి17 : నగరపాలక సంస్థకు రావాల్సిన ట్రేడ్ లైసెన్స్ బకాయిల వసూళ్లను నగరపాలక సిబ్బంది వేగవంతం చేశారు. బకాయిలు చెల్లించని వ్యాపారులపై సిబ్బంది కఠిన చర్యలు చేపడుతున్నారు. పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ స్పందించని దుకాణదారులపై నిబంధనల ప్రకారం చర్యలు కొనసాగుతున్నట్లు సిబ్బంది తెలిపారు.ఈ క్రమంలో శనివారం షరాఫ్ బజార్ పరిధిలో సుమారు రూ.15 లక్షల ట్రేడ్ లైసెన్స్ బకాయిలు చెల్లించని 196 దుకాణాలకు క్లోజర్ నోటీసులు జారీ చేశారు. అలాగే క్లోజర్ నోటీసులు జారీ చేసినప్పటికీ బకాయిలు చెల్లించకుండా వ్యాపారాలు కొనసాగిస్తున్న మూడు షాపులను సీజ్ చేశారు. మున్సిపల్ నిబంధనలను అతిక్రమిస్తూ వ్యాపారాలు నిర్వహించడం చట్ట విరుద్ధమని, బకాయిలు చెల్లించని పక్షంలో మరింత కఠిన చర్యలు తప్పవని ప్రజారోగ్య సిబ్బంది హెచ్చరించారు. ట్రేడ్ లైసెన్స్ బకాయిలు చెల్లించడం ప్రతి వ్యాపారి బాధ్యత అని పేర్కొంటూ, వెంటనే బకాయిలు చెల్లించి సహకరించాలని నగరపాలక సిబ్బంది వ్యాపారులను కోరారు. నగర అభివఅద్ధి, పారిశుధ్య నిర్వహణతో పాటు ప్రజా సౌకర్యాల నిర్వహణకు ఈ వసూళ్లు ఎంతో కీలకమని వివరించారు.

# సంపాదకీయం

## అనేక దేశాల్లో అస్థిరతలకు కుట్రలు

ప్రపంచంపై పెత్తనం సాగించాలన్న ట్రంప్ రాజ్యకాంక్ష కారణంగా అనేక దేశాల్లో అస్థిరత నెలకొంటోంది. అయితే సుంకాలు లేదంటే బెదరింపులు..మరీ అయితే దాడులు అన్న మంత్రాన్ని ఎంచుకున్న ట్రంప్ రంపం కోతలు పెడుతున్నారు. అనేక దేశాలు ఇప్పుడు ట్రంప్ గుప్పిట్లో ఇరుక్కున్నాయి. పైకి తీయగా మాట్లాడుతూ..తన ధృతరాష్ట్ర కౌగిలిని బిగిస్తున్నారు. వెనిజులా తరవాత ఇరాన్‌లో అదే తరహా సన్నాహాలకు దిగినా ఎందుకనో వెనకడుగు వేశారు. అమెరికా సిఐఎ ఇప్పుడు ప్రపంచంలో చిచ్చు పెట్టే పనిలో ఉంది. శ్రీలంక,బంగ్లాదేశ్,నేపాల్, ఇరాన్, ఇరాక్, ఇలా చెప్పుకుంటూ పోతే అనేక దేశాల్లో అంతర్గత కలహాలకు ఆజ్యం పోస్తోంది. భారత్‌ను దెబ్బతీసేందుకు నానారకాల గడ్డి కరిచింది. సిఐఎ గుప్పిట తెలియకుండానే పడ్డ ఎందరో తమ దేశంలో అస్థిరతకు కారణం అవుతున్నారు. అందులో భారత్‌లోని కొందరు నేతలు కూడా ఉన్నా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఎందుకంటే కొంతకాలంగా భారత్‌లో అస్థిరతకు అనేక రకాల ప్రయత్నాలు సాగాయి. మణిపూర్ అల్లర్లు, రైతుల ఆందోళనలు, సర్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు, సరిహద్దుల్లో ఉద్రిక్తతలు, బంగ్లాను ఎగదోయడం, పాక్‌కు పాలుపోసి పెంచడం వంటివన్నీ భారత్‌లో అస్థిరతకు కారణాలుగా చూడాలి. తాజాగా ఇరాన్‌లో సాగుతున్న ఆందోళనలను అమెరికా ఎగదోస్తోంది. అక్కడి ప్రజల్లో విషం నిండానికి ప్రయత్నం చేస్తోంది. అయితే ఇరాన్‌పై సైనిక చర్య తప్పదంటూ ఇటీవల వరుస హెచ్చరికలు చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రస్తుతానికి వెనక్కి తగ్గినట్టే కనిపిస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు చేపట్టిన నిరసనకారుల అణచివేత విషయంలో టెహ్రాన్ మొత్తబడినట్లు కనిపిస్తోందని పేర్కొన్న ఆయన.. సమీప భవిష్యత్తులో ఆ దేశంపై దాడి చేయబోమన్న సంకేతాలిచ్చారు. దనీఇకి కూడా కారణం లేకపోలేదు. ఇరాన్‌పై దాడులకు దిగితే ఆ దేశంలో అనిశ్చితి మరింత పెరిగే ముప్పుండటంతో పాటు అది దీర్ఘకాలిక యుద్ధంగా పరిణమించే ప్రమాదం ఉందన్న హెచ్చరికలు వచ్చాయి. అలాగే ప్రాంతీయంగా తీవ్ర ఉద్రిక్తతలు తలెత్తే అవకాశాలు ఉండటం క ఊడా అమెరికా గమనించి ఉంటుంది. పరిమిత స్థాయి సైనిక చర్యతో ఆగిపోకుండా దీర్ఘకాలం పాటు దాడులు కొనసాగించక తప్పని పరిస్థితులు నెలకొంటే కొత్త తలనొప్పులు రావచ్చని ట్రంప్‌కు సలహాలు అందాయని అంటున్నారు. అందుకే సైనిక చర్యపై ట్రంప్ నిర్ణయం మార్పునకు కారణమైనట్లు తెలుస్తోంది. నిరసనకారులపై ఉక్కుపాదం మోపితే ఇరాన్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ట్రంప్ పదేపదే హెచ్చరించాక కొంత తగ్గారని గమనించాలి. 24 గంటల్లోనే టెహ్రాన్‌పై వాషింగ్టన్ సైనిక చర్యకు దిగడం ఖాయమనీ అంతా అనుకున్నారు. పశ్చిమాసియాలోని పలు వైమానిక స్థావరాల నుంచి అమెరికా హడావుడిగా తన బలగాలను కొంతమేర ఉపసంహరించుకోవడంతో సైనిక చర్య తప్పదన్న వార్తలకు బలాన్నిచ్చాయి. అయితే ట్రంప్ కొంత తెలివిని ప్రదర్శించారనే అనుకోవాలి. అందుకే ప్రస్తుతానికి సైనిక చర్య ప్రయత్నాలు నిలిచిపోయినట్టే కనిపిస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనల్లో చురుగ్గా పాల్గొన్న ఎర్ఫాన్ సొల్తానీ అనే 26 ఏళ్ల యువకుడికి ఈ నెల 14న మరణశిక్ష అమలు చేయాలని ఇరాన్ తొలుత భావించింది. కానీ చివరి నిమిషాల్లో ఆ శిక్ష అమలును నిలిపివేసింది. సైనిక చర్యపై ట్రంప్ వెనక్కి తగ్గడానికి ఇది బాగా ఉపయోగపడిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇరాన్‌పై దాడుల విషయంలో ట్రంప్ వెనక్కు తగ్గడానికి ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహు కూడా ఓ ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇరాన్ అంత తేలికగా తలొగ్గబోదని ట్రంప్‌నకు నెతన్యాహు హితబోధ చ ఏసి ఉంటారని కూడా అంటున్నారు. గతంలో టెహ్రాన్‌పై సైనిక చర్యను కోరిన నెతన్యాహుయే ఇప్పుడు దాడులు వద్దని స్వయంగా చెప్పడం ట్రంప్‌ను పునరాలోచనలో పడేసి ఉంటుందన్న విశ్లేషణలు కూడా ఉన్నాయి. గల్ఫ్‌లో అమెరికా మిత్రదేశాలైన సౌదీ అరేబియా, ఖతార్, ఒమన్ వంటి దేశాలతో పాటు ఈజిప్టు కూడా సైనిక చర్య నివారణకు ట్రంప్‌తో ముమ్మరంగా దౌత్య ప్రయత్నాలు చేశాయి. ఇరాన్‌పై దాడులు ప్రాంతీయంగా యుద్ధమేఘాలకు కారణమవుతాయని, దానివల్ల అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ కుదుపులకు లోనవుతుందని సూచించాయి. అయితే ఇరాన్‌లో నిరసనకారులపై హత్యాకాండను ఆపడమే తన ప్రాథమిక లక్ష్యమని ఆయా దేశాల అధికారులతో ట్రంప్ తెలిపారు. టెహ్రాన్ ఆ దిశగా సంకేతాలిస్తే సైనిక చర్యకు దిగబోనని స్పష్టం చేశారు. ఆపై కొన్ని గంటలకే ఎర్ఫాన్ సొల్తానీ మరణశిక్షను టెహ్రాన్ నిలిపివేయడం, 'ఇది శుభవార్త.. ఇదే కొనసాగుతుందని ఆశిస్తున్నా' అంటూ అమెరికా అధ్యక్షుడు వ్యాఖ్యలు చేయడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిరసనకారుల మరణశిక్షలను నిలిపివేసినందుకు ఇరాన్‌కు ట్రంప్ కృతజ్ఞతలు తెలపడం గమనార్హం. ఇదిలావుంటే ఇరాన్ అత్యంత తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఆర్థిక కష్టాలపై ప్రారంభమైన నిరసనలు దేశవ్యాప్తంగా విస్తరించి, సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖామెనీ అధికారానికి నిరంతర సవాలుగా మారింది. హింస పెరుగుతున్న వేళ, ఉరిశిక్షల బెదిరింపులు, దాదాపు సంపూర్ణ ఇంటర్నెట్ నిలిపివేత, అలాగే ముఖ్యంగా అమెరికా వంటి విదేశీ శక్తుల జోక్యం...ఇరాన్ అంతర్గత కలకలిని మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. మానవ హక్కుల సంస్థలు పరిస్థితులు వేగంగా క్షీణిస్తున్నాయని హెచ్చరిస్తున్నాయి. సంపూర్ణ ఇంటర్నెట్ బ్లాక్‌ఔట్ కారణంగా హత్యలు, అరెస్టులపై ఖచ్చితమైన సమాచారం అందడం లేదని తెలుస్తోంది. ఇప్పటికే ఇరాన్‌లోని 31 ప్రావిన్సులన్నింటిలోనూ నిరసనలు చెలరేగాయి. 180కు పైగా నగరాల్లో వందలాది ప్రదర్శనలు నమోదయ్యాయి. ఇటీవలి వారాల్లో కనీసం 850 మంది మరణించారని, 2,300 మందికి పైగా అరెస్టయ్యారని హక్కుల సంఘాలు అంచనా వేస్తున్నాయి. బ్లాక్‌ఔట్ వల్ల కుటుంబాలు పరస్పరం సంబంధాలు కోల్పోయాయి. ఇదంతా జరుగుతుండగానే భద్రతా బలగాలు తమ దమన చర్యలను మరింత కఠినతరం చేశాయి. తాజా నిరసనలకు కారణం ఆర్థిక పతనం ప్రధాన కారణంగా చెప్పుకోవాలి. ఇరానియన్ రియాల్ చరిత్రలో ఎన్నడూ లేని స్థాయికి పడిపోయింది. ద్రవ్యోల్బణం సుమారు 40 శాతానికి చేరింది. ఆహారం, ఇంధన ధరలు ఆకాశాన్నంటాయి. పెట్రోల్ ధరల పెంపు, చాలా వస్తువులపై సబ్సిడీ మారకపు రేట్ల రద్దు ఇవన్నీ అనేక కుటుంబాలను అంచుల దాకా నెట్టాయి. అయితే నిరసనలు త్వరలోనే ఆర్థిక అంశాలను దాటి, రాజకీయ దమనంపై ఉన్న కోపాన్ని ప్రతిబింబించాయి. నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఘర్షణాత్మక ధోరణి అవలంబించారు. నిరసనలు కొనసాగించాలని ఇరానీయులను ప్రోత్సహిస్తూ వచ్చారు. మొత్తంగా ట్రంప్ వెనక్కి తగ్గినా ఇరాన్ తాజా పరిస్తితులు దారికి వస్తాయా అన్నది అనుమానమే. ఛాందసవాద పాలన కారణంగా ప్రజలు నలగిపోతున్నారు. దీనినుంచి బయటపడే మార్గాలను ఇరాన్ ఆలోచించాల్సి ఉంది.

# ఎర్రజెండా పార్టీలు ఏకం కావాలి




పుట్టేవాడికి అన్న, పెరిగేవాడికి తమ్ముడు అదేగా సిపిఐ. నీకు సమకాలికుడు నారా చంద్రబాబు నాలుగు దఫాలు ముఖ్యమంత్రి, నిన్నగాక మొన్న పుట్టిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి, మీ పార్టీ పుట్టిన 1925 సంవత్సరమే ఆర్‌ఎస్‌ఎస్ పుట్టింది, అదేమో రాజ్యాధికారానికే వచ్చే. నీవేమో జెండాలు పట్టుకుని తిరుగుతున్నావు, అంతేనా? మెరిసేదంతా బంగారం కాదు, చూసిందంతా నిజమూ కాదని నానుడి ఉంది. అది తర్కం ద్వారా నిజమని తేలింది. అయితే ఆ తర్కంలోకి పోవడానికి యిది సందర్భం కాదు. సిపిఐని గురించి మరో కోణంలో చూడగలిగితే చరిత్రకు న్యాయం జరుగుతుంది. నిజమే వంద సంవత్సరాలలో సిపిఐ ఏమీ చేయలేదా? స్వాతంత్ర్య పోరాటం 1757లో ప్లాసీ యుద్ధం తర్వాత 1857లో ప్రథమ స్వాతంత్ర్య పోరాటంగా గుర్తించబడింది. (అయితే ఇది సిపాయి తిరుగుబాటుగా దురుద్దేశంతో పిలవబడింది) 1885లో బ్రిటిష్ వ్యతిరేక పోరాటానికి కాంగ్రెస్ పార్టీ స్థాపించబడింది. 1915 నుండి గాంధీ మహాత్ముడు స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించారు. వార్తలు టెక్ ట్రెండ్స్ వ్యాపార కోర్సులు కెరీర్ కౌన్సెలింగ్ వార్తాపత్రిక చందా చట్టపరమైన సలహా ఆరోగ్య బీమా ఆధ్యాత్మిక పుస్తకాలు లైఫ్ స్టైల్ ఆ ఉద్యమంలో యథాతథ వాదులు, తీవ్రవాద భావజాల కలయిక సంయుక్తంగా ఉద్యమం నిర్వహించబడింది. అయితే స్వాతంత్ర్య ఉద్యమానికి ఒక స్పష్టత కొరవడింది. ఎలాంటి స్వాతంత్ర్యం కావాలి? స్వాతంత్ర్యమా లేక సర్వ స్వాతంత్ర్యమా? (సంపూర్ణ). దీనిపై చర్చోప చర్చలు జరిగాయి. కమ్యూనిస్టు భావాలు కలిగిన వారి ఒత్తిడి మేరకే సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం తీర్మానం చేయబడింది. స్వాతంత్ర్యానంతరం ఎలాంటి స్వతంత్రం అమలు జరగాలో దానిపై గాంధీకి గానీ, కాంగ్రెస్ పార్టీకి గాని స్పష్టత లేదు లేదా ఇవ్వదలుచుకోలేదో? ఇక ముసుగులో గుద్దులాటకన్నా బహిరంగంగా రావడమే మేలని కమ్యూనిస్టులంతా కలిసి 1925 డిసంబర్ 26 న కమ్యూనిస్టు పార్టీ ఉత్తర ప్రదేశ్‌లో జాతీయ స్థాయి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియాగా ఏర్పడింది. మొదటి తీర్మానం సంపూర్ణ స్వాతంత్ర్యం, రెండు దున్నేవాడికే భూమి తదితర మౌలిక అంశాలతో ప్రజలముందుకు వచ్చింది సిపిఐ.

ఆనాటినుండి భూసమస్య తెరమీదికి రావడమేగాక, తెలంగాణ సాయుధ పోరాటం, భూమికోసం, భుక్తికోసం సాయుధ పోరాటం, బెంగాల్‌లో తెబాగా, కేరళలో పున్నప్ర, ఆంధ్రాలో చల్లపల్లి జమీందారీ వ్యతిరేక పోరాటాలు ఉవ్వెత్తున లేచాయి. 1917లో రష్యాలో కమ్యూనిస్టు విప్లవ విజయం ప్రభావం మన దేశంపై పడింది. ఆ ప్రభావమే బాబా సాహెబ్ అంబేద్కర్ నాయకత్వాన రూపొందించిన భారత రాజ్యాంగం, అలాగే ఆనాటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పై కూడా ప్రభావం పడబట్టే పబ్లిక్ సెక్టార్ నిర్మాణం. జమ్మూకశ్మీర్, పంజాబ్, ఈశాన్య రాష్ట్రాల వేర్పాటు ఉద్యమాలలో కమ్యూనిస్టుల ప్రతిఘటనే భారతదేశ ఐక్యతకు తోడ్పడింది. ఈ ప్రతిఘటన ఉద్యమం లో అనేకమంది కమ్యూనిస్టు యోధానుయోధులను పోగొట్టుకున్న పార్టీ ఏదయినా వుంది అంటే అది సిపిఐ. పై ఉద్యమాలలో ఆనాటి జనసంఘ్, ఇప్పటి బిజెపి వ్యక్తులు ఏ ఒక్కరైనా పాల్గొన్నారా? జైలుకు వెళ్లారా? అధికారం లేకపోయినా దేశాన్ని కాపాడగలిగాం, దళితులకు, గిరిజనులకు, ఇతర బలహీన వర్గాలకు అండగా వున్నది కమ్యూనిస్టులేనని గుండెమీద చేయి వేసుకుని చెప్పగలం. కమ్యూనిస్టులు 61 మంది వామపక్ష పార్లమెంట్ సభ్యులుండబట్టే గదా పనికి ఆహార పథకం సాధించగలిగాం. కమ్యూనిస్టులు బలహీన పడబట్టేగదా అటు పార్లమెంట్‌లోనూ, ఇటు శాసనసభలలో ప్రజాసమస్యలపై చర్చ జరగకుండ నీవు వెధవవి, నీవే వెధవవి అని తిట్టిపోసుకుంటూ సంపద యావత్తూ కార్పొరేట్ వర్గాలకు ధారాదత్తం చేసే కుటిల యత్నాలకు కొమ్ముకాస్తున్నారు. ఇప్పుడు చెప్పండి కమ్యూనిస్టులు దేశమౌలిక విధానాల యెడల నిబద్ధతగా నిలబడ్డారు. వందేళ్ల సిపిఐ ప్రస్థానం భారతదేశానికి కొలమానంగా నిలబడ్డామా లేదా? ప్రస్తుత కమ్యూనిస్టుల కర్తవ్యమేమిటి? ఎర్రజెండాలకు అంకితమయిన పార్టీలన్నీ ఒకగూటికి చేరాల్సిన తరుణం ఆసన్నమయింది. ఆలస్యం అమృతం విషం.

## యూపిలో అనూహ్య ఘటన

### పట్టుకున్న పాముతో వ్యక్తి సయ్యాటలు

### కసితీరా కాటేయడంతో యమలోకానికి పయనం

లక్నో,జనవరి : పాముతో చెలగాం ఆడిన ఓ వ్యక్తి ఏకంగా ప్రాణ్యాలు కోల్పోయాడు. ఉత్తరప్రదేశ్‌లో ఈ ఘటన జరిగింది. ఓ వ్యక్తి నాగు పామును చేతుల్లోకి తీసుకుని అతి చేశాడు. దాన్ని అటూ ఇటూ తిప్పుతూ జనం ముందు ఫోజులు కొట్టాడు. విష సర్పంతో ఆటలు.. ఏకంగా అతడి ప్రాణాలు తీసేశాయి. మూడుసార్లు అతణ్ని నాగుపాము కాటేయడంతో ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే చనిపోయాడు. ఈ సంఘటన ఉత్తర్ ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళితే.. రామ్‌పూర్‌కు చెందిన 50 ఏళ్ల రాజ్ సింగ్‌కు పొలాల దగ్గర ఓ నాగుపాము కనిపించింది. సుమారు ఆరు అడుగులు ఉన్న ఆ పామును అతడు ఏ మాత్రం భయపడుకుండా పట్టుకున్నాడు. అలా పట్టుకుని.. దానితో ఆటలు ఆడటం మొదలెట్టాడు. అటూ ఇటూ తిప్పుతూ సయ్యాట ఆడాడు. తర్వాత రోడ్డు మీదకు వచ్చి మరింత దానితో గేమ్స్ ఆడాడు. పామును మెడలో వేసుకుని ఫోజులు కొడుతూ తిరిగాడు. పామును పట్టుకుని తిరుగుతున్న అతడ్ని చూసి జనం భయపడిపోయారు. అతడు దగ్గరకు వస్తుంటే దూరంగా పరుగులు తీశారు. కొంతమంది అతడికి హితవు పలికారు. పామును వదిలిపెట్టమని, లేదంటే చచ్చిపోతావని హెచ్చరించారు. అయినా కూడా రాజ్ సింగ్ వారి మాటలు పట్టించుకోలేదు. పామును చాలా ఇబ్బందిపెట్టేలా ప్రవర్తించాడు. సహనం నశించిన పాము మూడుసార్లు అతడ్ని కరిచింది. పాము కాట్ల కారణంగా అతడి పరిస్థితి విషమించింది. కొద్దిసేపటికే ఆపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. స్థానికులు అతడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. రాజ్ సింగ్‌ను పరీక్షించిన వైద్యులు.. అప్పటికే చనిపోయినట్లు ధ్రువీకరించారు. ప్రస్తుతం రాజ్ సింగ్ పాముతో అతి చేసిన దృశ్యాల తాలూకా వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## కర్నాటక మాజీమంత్రి ఖండ్రే మృతి

### సంతాపం తెలియ చేసిన డిప్యూటి సిఎం పవన్

అమరావతి,జనవరి 17 : కర్ణాటక మాజీ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు డాక్టర్ భీమన్న ఖండ్రే మృతి పట్ల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంతాపం తెలిపారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. 'కర్ణాటక రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి, మిత్రులు ఈశ్వర్ ఖండ్రే తండ్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు డా.భీమన్న ఖండ్రే మృతికి చింతిస్తున్నాను. వృద్ధాప్య సంబంధిత వ్యాధుల కారణంగా ఆయన తుదిశ్వాస విడిచారని తెలిసింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. స్వాతంత్ర్య సమరంలో, హైదరాబాద్ కర్ణాటక విముక్తి, కర్ణాటక సమైక్యత ఉద్యమాల్లో డా.భీమన్న ఖండ్రే కీలక పాత్ర పోషించారు. ఈశ్వర్ ఖండ్రేకు, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ ట్వీట్ చేశారు. కాగా.. కర్ణాటక మాజీ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు భీమన్న ఖండ్రే(102) కన్నుమూశారు. వృద్ధాప్య సంబంధిత వ్యాధుల కారణంగా గత అర్ధరాత్రి బీదర్ జిల్లా భాల్కి పట్టణంలోని తన నివాసంలో ఖండ్రే తుది శ్వాస విడిచారు. గత కొద్దిరోజులుగా శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు పడటంతో పాటు రక్తపోటు సమస్యలతో ఆయన కొన్ని రోజులుగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇదిలా ఉండగా.. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రవాణా మంత్రిగా ఖండ్రే పనిచేశారు.

## అర్వపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### కారు పల్టీలు కొట్టడంతో ఇద్దరు టీచర్ల మృతి

### మరో ముగ్గురు టీచర్లకు తీవ్ర గాయాలు

సూర్యాపేట,జనవరి17 : అర్వపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఉపాధ్యాయులు ప్రయాణిస్తున్న ఓ కారు అదుపుతప్పి రోడ్డు పక్కన పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు టీచర్లు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడ్డారు. మొత్తం ఐదుగురు ఉపాధ్యాయులున్న కారు.. స్కూల్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. సంక్రాంతి సెలవుల అనంతరం.. శనివారం స్కూళ్లు తెరుచుకోవడంతో రోజువారీ విధుల్లో భాగంగా నల్గొండ నుంచి సూర్యాపేట జిల్లా తుంగతుర్తిలోని ప్రభుత్వ పాఠశాలకు కారులో బయలుదేరారు. అయితే.. అర్వపల్లి వద్ద వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి పల్టీలు కొట్టి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు ఉపాధ్యాయుల్లో కస్తూర్బా గాంధీ ఏఎస్‌వో కల్పన అక్కడికక్కడే మృతి చెందారు. హెడ్‌మాస్టర్ గీత పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే ఆమె ప్రాణాలు కోల్పోయారు. గాయపడిన మిగిలిన ముగ్గురు ఉపాధ్యాయులు ప్రస్తుతం.. సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే.. డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగిందని తెలుస్తోంది. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సంక్రాంతి సెలవుల అనంతరం శనివారం నుంచి పాఠశాలలు ప్రారంభం కావడంతో తుంగతుర్తిలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు ఓ కారులో తుంగతుర్తికి వెళ్తున్నారు. ఈ క్రమంలో అరవపల్లి వద్ద కారు అదుపుతప్పి రోడ్డు కిందికి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో తుంగతుర్తి కస్తూర్బా విద్యాలయంలో ఎస్వోగా పనిచేస్తున్న కల్పన (40) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయాణిస్తున్న గీతకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో తుదిశ్వాస విడిచారు. డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు ఉపాధ్యా యులకు గాయాలు కావడంతో 108లో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు.


## నంద్యాలలో దారుణ ఘటన

### పిల్లలకు విషమిచ్చి తల్లి ఉరేసుకుని ఆత్మహత్య

నంద్యాల,జనవరి 17 : నంద్యాల జిల్లా కేంద్రంలోని ఎన్ జి ఓ కాలనీ లలిత నగర్ లో శనివారం దారుణం జరిగింది. తన పిల్లలకు విషాన్ని ఇచ్చి తల్లి ఉరేసుకొని మరణించింది. టూ టౌన్ సిఐ తెలిపిన వివరాల ప్రకారం సుధా మల్లికా (26), ఉదయ్ లకు ఐదు ఏళ్ల కిందట వివాహం అయింది. వీరు గత కొంత కాలంగా లలిత నగర్ లో నివాసముంటున్నారు. వీరికి 5 ఏళ్ల బాబు, 6 నెలల పాప ఉన్నారు. ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తల్లి ఉరేసుకొని మరణించింది. మల్లికా మృతికి కుటుంబ కలహాలే కారణంగా ప్రాథమిక విచారణలో తేలినట్లు సిఐ తెలిపారు. ఆమెది హత్యనా.. లేక ఆత్మహత్యనా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు టూ టౌన్ సిఐ చెప్పారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని సమగ్ర విచారణ చేస్తున్నామన్నారు. ఇదిలా ఉండగా ? తమ అమ్మాయిని అత్తా ఆడపడుచులు, భర్త కలిసి కొట్టి చంపారని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు.

## పాశుర ప్రభాతం.. గోదా వైభవం

సంప్రదాయ పరంపరలో, సంస్కృతి పరిరక్షణలో, వేదాగమశాస్త్ర పోషణలో అనాదిగా భారతీయత ఉత్కృష్టమై.. మానవాళికి దిశానిర్దేశం చేస్తున్నది. నియమానుసారంగా బతికే విధానం.. మనుషుల నిత్యకర్తవ్యం కావాలనీ, ధర్మ బద్ధంగా కర్తవ్య సాధన చేయడం మానసిక దృక్పథం కావాలనీ పదే పదే ప్రబోధిస్తుంది. భారతీయ కాలమానంలో ప్రతి సంవత్సరానికీ, ప్రతి యుగానికీ, ప్రతి మాసానికీ, ప్రతి రోజుకీ ప్రత్యేకత, పవిత్రత ఉంది. ఆ గొప్పతనం తెలుసుకొని అవకాశాను గుణంగా ఫలితాలను పొందే ప్రయత్నమే మానవ ధర్మం. శ్రీమహావిష్ణువు స్థితికర్తగా ప్రపంచాన్ని పరిపాలిస్తున్నాడు. సంసార సాగరానికి ఆదిదేవుడూ ఆయనే. దానిని ఈదేర్చే తెరువూ ఆయనే! కాబట్టి శ్రీమన్నారాయణుని భక్తి సాధనతో సేవించి, ఇహపరాలలో జన్మ సార్థకతను పొందగలిగే దివ్య అవకాశం కల్పిస్తుంది 'ధనుర్మాసం'. అన్ని మాసాలలో కెల్లా మహిమాన్వితమైన ఈ మాసం తెలుగు నెలల్లో ఎక్కడా కనిపించకపోయినా.. మానవుల కర్మఫల సాధనకు ఉపయుక్తంగా ఒప్పారు తున్నది. విష్ణుమూర్తి ఆరాధనకు అనువైన కాలంగా, మధురమైన భక్తికి వేదికగా అలరారే దివ్యమాసం ఇది. ఈ నెలలో విష్ణు కైంకర్యం చేస్తే వేయి సంవత్సరాల పాటు చేసిన శుభకర్మ ఫలం లభిస్తుందనీ, అదే మధురానందమనీ, అలౌకిక భావనాభరితమనీ బ్రహ్మాండ, స్కంధ, ఆదిత్య పురాణాలు చెబుతున్నాయి. క్షీర సముద్రంలో, శేష తల్పంలో, యోగ నిద్రలో ఉన్న శ్రీమహావిష్ణువును ఉషఃకిరణాలు ప్రసరించని బ్రాహ్మీ ముహూర్తంలో మేల్కొలిపి, ఆరాధించి తరించే అదృష్టం ధనుర్మాసం కల్పించింది. విష్ణుదేవుడే మాసరూపమైన వైభవరౌ ధనుర్మాసం. అయోనిజ గోదాదేవి.. ధనుర్మాసానికి పరిపూర్ణత కలిగించిన విదుషీమణి, భక్తశిఖామణి గోదాదేవి. ప్రణయ రూపానికీ, ప్రణవ రూపానికీ బంగారు సేతువుగా నిలిచిన తిరుప్పావై పాశురాల రూపకర్త్రి ఆమె. పన్నెండుమంది ఆళ్వారుల్లో ఏకైక మహిళ. భక్తి ప్రపంచ చరిత్రలో శ్రీరామచంద్రున్ని కౌశిక మహర్షి 'కౌసల్యా సుప్రజా రామా.. ఉత్తిష్ఠ' అంటూ మేల్కొలిపిన సుప్రభాతం, శ్రీరంగనాయకుడిగా భావించిన శ్రీహరిని మేల్కొలిపిన తిరుప్పావై పాశుర ప్రభాతం అజరామరమై నిలిచిపోతాయి.



ఆధ్యాత్మికం

TARAJYOTHI TELUGU DAILY తారాజ్యోతి

# కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీల రిజర్వేషన్లు పూర్తి

## ◆ లాటరీ ద్వారా మహిళా రిజర్వేషన్ వార్డులు ఖరారు: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి ప్రతినిధి :** లాటరీ పద్ధతి ద్వారా జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మహిళా రిజర్వేషన్ వార్డులు ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు మున్సిపల్ వార్డు / డివిజన్ రిజర్వేషన్ ఖరారు చేసే ప్రక్రియను శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ మున్సిపల్ వార్డు, డివిజన్ లను రిజర్వేషన్ వారీగా కేటాయింపు ప్రక్రియ పారదర్శకంగా లాటరీ పద్ధతి ద్వారా పూర్తి చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలోని 3 మున్సిపాలిటీలు, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న 124 వార్డులలో 50 శాతం మహిళలకు కేటాయిస్తున్నట్లు, వీటిని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో డ్రా పద్ధతిలో ఖరారు చేశామని అన్నారు. పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల వార్డు సంఖ్య లో మార్పులు లేకపోవడంతో గత ఎన్నికల మాదిరిగానే ఎస్సి, ఎస్టీ, బీసీ లకు సీట్లను రిజర్వు చేశామని, రామగుండం పరిధిలో వార్డుల సంఖ్య 50 నుంచి 60 కు పెరగడంతో ప్రభుత్వం మార్గదర్శకాల మేరకు 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సి, ఎస్టీ సీట్లు, బీసి సీట్లను బీసీ డెడికేషన్ కమిషన్ నివేదిక ఆధారంగా కేటాయింపులు చేపట్టామని అన్నారు. పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీల పరిధిలో రోటేషన్ పద్ధతిలో రిజర్వేషన్ వార్డుల కేటాయింపు ఉంటుందని, రామగుండం పరిధిలో వార్డుల సంఖ్య పెరిగినందున రిజర్వేషన్ సీట్లు పునరావృతం అయ్యే అవకాశం ఉండవచ్చని అన్నారు. ఎస్సీలకు రామగుండం లో 13, పెద్దపల్లిలో 4, మంథని లో 2, సుల్తానాబాద్ లో 2, ఎస్టీ లకు రామగుండంలో 1, పెద్దపల్లిలో 1, మంథని లో 1, సుల్తానాబాద్ లో 1, బీసీలకు రామగుండం లో 16, పెద్దపల్లిలో 13, మంథని లో 3, సుల్తానాబాద్ లో 4 స్థానాలు రిజర్వ్ అయ్యాయని అన్నారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మున్సిపాలిటీలలో వార్డుల వారిగా కేటాయించిన రిజర్వేషన్ వివరాలను తెలుపుతూ లక్కీ డ్రా ద్వారా మహిళలకు వార్డుల కేటాయింపు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణ శ్రీ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ, మున్సిపల్ కమిషనర్లు, వెంకటేష్, రమేష్, మనోహర్ సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఐపీఎస్ విద్యార్థుల ఎంపిక.....



**సుల్తానాబాద్, జనవరి 17 :** రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల (ఐపీఎస్)కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికై పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ నెల 10వ తేదీన ఎన్టీపీసీ జ్యోతి నగర్ జడ్పి హెచ్ఎస్ పాఠశాలలో పెద్దపల్లి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ఐపీఎస్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించారు. అండర్ 8 విభాగంలో రన్నింగ్,లాంగ్ జంప్ పోటీల్లో అద్విత మాన్వి, అండర్10 విభాగంలో లాంగ్ జంప్‌లో బొల్లి దేవాన్ష్, అండర్ 14 విభాగంలో రన్నింగ్ పోటీలో మాటేటి సంప్రీత్ జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఈ నెల 18న ఆదిలాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ అభినందించారు. విద్యార్థుల విజయం వెనుక ఉపాధ్యాయుల కృషి, క్రమశిక్షణ, కఠిన సాధన ముఖ్య కారణమని, రాష్ట్రస్థాయి పోటీల్లోనూ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి పాఠశాలకు మరింత ప్రతిష్ఠ తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు సత్యం, శివ, సతీష్, మమతలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో స్థల పరిశీలన చేసిన మంత్రి అడ్లూరి







**ధర్మపురి, జనవరి 17, :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ధర్మపురి పర్యటన నేపథ్యంలో పట్టణ కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ధర్మపురి మండలానికి రానున్నారని తెలిపారు. ఆయన పర్యటనలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నట్లు మంత్రి అడ్లూరి తెలిపారు. ధర్మపురి ప్రాంతంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న అంశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిందని మంత్రి అడ్లూరి తెలిపారు. ఇందులో భాగంగా రూ.200 కోట్లతో యంగ్ ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం, గోదావరి నది కలుషితం కాకుండా 17 కోట్లు రూపాయలతో సివరేజ్ ప్లాంట్ ఏర్పాటు శంకుస్థాపన చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. టి.ఎఫ్.ఐ.డి ద్వారా రూ.15 కోట్ల ద్వారా ధర్మపురి పట్టణంలో అనేక పనులు చేశామని తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్ల మార్పు, కొత్త స్తంభాల ఏర్పాట్లకు రూ.4 కోట్లు మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి వెల్లడించారు. అదేవిధంగా ధర్మపురి పట్టణంలోని అన్ని కుల సంఘ భవనాల నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయడానికి ధర్మపురి నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మంత్రి అడ్లూరి నియోజకవర్గ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసీలో డాక్టరేట్ అందుకున్న సబ్బితం గ్రామస్థుడు....



**పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామానికి చెందిన పులిపాక శంకరయ్య ఫార్మసీ విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. పంజాబ్ లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ నుండి డాక్టర్ ఆశిష్ సుత్తీ, డాక్టర్ ఎం.రవికుమార్ పర్య వేక్షణలో అయన సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథం డెవలప్‌మెంట్, ఆప్టిమైజేషన్, క్యారెక్టరైజేషన్ ఆఫ్ నానో ఫార్ములేషన్స్ ఆఫ్ ఆల్పినియా మ్యూటికా అండ్ ట్రేడ్‌స్కాంటియా స్పాథేసియా యాంటీ-డయాబెటిక్ యాక్టివిటీకి గానూ పురస్కారం లభించింది. యూనివర్సిటీ 12 వ స్నాతకోత్సవంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ అశోక్ కుమార్ మిట్టల్ చేతుల మీదుగా శంకరయ్య డాక్టరేట్ అందుకున్నారు. పేద కుటుంబానికి చెందిన పులిపాక మధునమ్మ- నర్సయ్య దంపతుల కుమారుడైన శంకరయ్య పదవ తరగతి వరకు పెద్దపల్లి ఇండియన్ మిషన్ సెకండరీ పాఠశాల, ఇంటర్మీడియట్ పెద్దపల్లి ప్రభుత్వ కళాశాలలో, తర్వాత హైదరాబాదులోని సుల్తాన్ ఉల్ ఉలూమ్ కళాశాలాలో బిఫార్మసీ, వరంగల్ లోని వాగ్దేవి ఫార్మసీ కాలేజీలో ఎంఫార్మసీ పూర్తి చేశారు. ప్రస్తుతం హైదరాబాదులోని ప్రయివేటు కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నా రు. శంకరయ్యకు డాక్టరేట్ పురస్కారం లభించడం పట్ల మండలానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# విద్యుత్ సమస్యలపై అధికారుల ప్రజా బాట

### - క్షేత్రస్థాయి సమస్యలపై దృష్టి - సమ్మక్క సారక్క జాతరకు ఏర్పాట్లు




**బ్యూరో, (తారజ్యోతి):** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం జీలకుంట గ్రామంలో విద్యుత్ అధికారులు ఈరోజు ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను దృష్టిలో ఉంచుకొని గ్రామ సర్పంచ్ శ్రీమతి రాగిడి మంగా శ్రీనివాస్ రెడ్డి విద్యుత్ అధికారులను కోరడంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ గ్రామంలో కొద్ది రోజుల్లో జరగబోయే సమ్మక్క సారలమ్మ జాతరకు భారీగా జనం రానున్న దృష్ట్యా విద్యుత్ సదుపాయం కల్పించాలని అధికారులకు జాతర కమిటీ విజ్ఞప్తి చేయడం జరిగింది. గ్రామంలో ఉన్న అన్ని వాడలను సందర్శించిన అధికారులు సమస్యలను పరిశీలించారు. సర్పంచి విజ్ఞప్తి మేరకు సానుకూలంగా స్పందించిన అధికారులు త్వరలోనేఅన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీమతి రాగిడి మంగా శ్రీనివాస్ రెడ్డి తో పాటు ఉపసర్పంచ్ రౌతు మనోజ్ క్రాంతివీర్, ఏడి రవీందర్, మరియు ఏఈ,వార్డు సభ్యులు మరియు విద్యుత్ శాఖ సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తీన్మార్ మల్లన్న జన్మదిన వేడుకలు

### - మున్సిపల్ ఎన్నికల్లో సత్తా సత్తా చాటుతాం - టీఆర్పి జిల్లా అధ్యక్షుడు కాసిపేట ఉదయ్



**పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న జన్మదిన వేడుకలు శనివారం అత్యంత ఘనంగా జరిగాయి. జిల్లా అధ్యక్షుడు కాసిపేట ఉదయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. తొలుత పెద్దపల్లి మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేసిన పార్టీ శ్రేణులు, అనంతరం స్వచ్ఛంద రక్తదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కాసిపేట ఉదయ్ మాట్లాడుతూ రక్తం దానం చేయడం అంటే మరొకరికి ప్రాణదానం చేయడంతో సమానమని, తమ నాయకుడి పుట్టినరోజున ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం పెద్దపల్లి బస్టాండ్ కూడలిలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా ఈ సందర్భంగా నూతన నియామకాలను ప్రకటించారు. పెద్దపల్లి మండల అధ్యక్షుడిగా మెరుగు చందర్‌ను, ధర్మారం మండల యువజన అధ్యక్షుడిగా నెరువట్ల నరేష్‌ను నియమించారు. అలాగే ఇతర పార్టీల నుంచి వచ్చిన పలువురు మహిళలకు కాసిపేట ఉదయ్ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కాసిపేట ఉదయ్ మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. టీఆర్పీ ప్రధానంగా బీసీల హక్కుల కోసం ఆవిర్భవించిన పార్టీ అని, రాబోయే ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను నిలబెట్టి భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు ఆలోచించి రాబోయే రోజుల్లో టీఆర్పీ పార్టీకి పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ మండల, పట్టణ అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు మరియు మల్లన్న అభిమానులు పాల్గొన్నారు.

# ప్రజా బాటలో విద్యుత్ సమస్యలపై క్షేత్రస్థాయి పరిశీలన





**మంథని, జనవరి 17, :** తెలంగాణ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే లక్ష్యంతో చేపట్టిన ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా, కమాన్‌పూర్ మండల కేంద్రంలోని పలు విద్యుత్ సమస్యలను మంథని ఏడి వెంకట నారాయణ ఆధ్వర్యంలో పరిశీలించారు. ప్రజల నుంచి నేరుగా వినిపిస్తున్న సమస్యలను క్షుణ్ణంగా గమనిస్తూ, తక్షణ చర్యలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కమాన్‌పూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఉపసర్పంచ్ రఫిక్ సోహెల్, కమాన్‌పూర్ ఏఇ అశోక్, వార్డు సభ్యులు పచ్చునూరి రాజ్ కుమార్, గుంజపడుగు నవీన్, గొట్టే సరిత-సంపత్, నాయకులు గుర్రం లక్ష్మీమల్లు, తోట రాజ్ కుమార్, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజా బాట కార్యక్రమం ద్వారా సమస్యలను కార్యాలయాలకే పరిమితం చేయకుండా క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలన్న ప్రభుత్వ ఉద్దేశం స్పష్టంగా కనిపిస్తోందని పాల్గొన్న ప్రజా ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.

# పెసర పిండితో ఇలా చేస్తే ముఖంపై జిడ్డు, మృతకణాలు మాయం..! అదిరి పోయే అందం మీ సొంతం..

మన వంటింట్లో లభించే సహజ సిద్ధమైన పదార్థాలు మన చర్మ సౌందర్యాన్ని పెంచడమే, చర్మం ఎంతో ఆరోగ్యంగా ఉండేలా చేస్తాయి. ఇందులో పెసలు మన చర్మ సౌందర్యాన్ని పెంచడంలో చక్కగా పని చేస్తుందని చెబుతున్నారు. చర్మానికి ఇది చేసే మేలు అంతా ఇంతా కాదు. చర్మాన్ని మృదువుగా చేయడంలోనూ, చర్మానికి మెరుపును ఇవ్వడంలోనూ, చక్కటి రంగు తేలేలా చేయడం లోనూ పెసర్లు చక్కగా పని చేస్తాయి. ఇందుకోసం కొద్దిగా పెసరపప్పు తీసుకుని బాగా ఎండబెట్టి పొడిలా చేసుకుని నిలువ చేసుకోవాలి. దీనిని ఫేస్ ప్యాక్ లాగా వేసుకోవాలి అనుకున్నప్పుడల్లా ఆ పెసరపిండిని వినియోగించుకోవచ్చు. రెండు టీ స్పూన్ల పెసరపప్పు పొడిని తీసుకొని అందులో కాస్త పసుపు వేసుకోవాలి. అందులో కావాల్సినంతా మోతాదులో పచ్చిపాలను కలుపుకుంటూ మెత్తటి పేస్ట్ లా తయారు చేసుకోవాలి. ఇపుడు ఆ మిశ్రమాన్ని ఫేస్ ప్యాక్‌లా ముఖానికి అప్లై చేసుకోవాలి. ఆ తర్వాత పదిహేను ఇరవై నిమిషాలకు ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి... ఇలా వారానికి రెండు మూడు సార్లు చేయడం వలన చక్కటి ఫలితాలను పొందగలరు. మూడు టీ స్పూన్ల పెసరపిండి, ఒక టీ స్పూను బియ్యప్పిండి, కొద్దిగా పసుపు వేసి దానికి రోజ్ వాటర్ కలిపి మెత్తని పేస్ట్ లా చేసుకోవాలి. తర్వాత ఆ పేస్ట్ ను ముఖానికి అప్లై చేసుకుంటూ బాగా మసాజ్ చేయాలి. ఇలా చేయడం వలన చర్మ రంధ్రాలోని మురికి, బ్యాక్టీరియా పోయి చర్మం కాంతి వంతంగా కనిపిస్తుంది. చర్మం బరకగా కనిపిస్తుంటే ఇబ్బందిగా ఉంటుంది. అలాంటప్పుడు కప్పు పెసర పిండిలో చెంచా నిమ్మరసం, చెంచా ఆలివ్ నూనె కలిపి ఆ మిశ్రమాన్ని ఒంటికి పట్టించి నలుగులా రుద్దుకోవాలి. ఇలా రోజూ చేస్తుంటే మృతకణాలు తొలగి చర్మం నునుపుగా మారుతుంది.

TARAJYOTHI TELUGU DAILY తారాజ్యోతి

# మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యం..

## ◆ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, జనవరి 17 ( తారా జ్యోతి):** భూపాలపల్లి మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని వేశాలపల్లి, పెద్దకుంటపల్లి, జంగేడు లో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తో కలిసి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీ ల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. రోడ్ల విస్తరణ, సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సౌకర్యాలు, కమ్యూనిటీ హాల్స్ తదితర పనులు ఈ అభివృద్ధి కార్యక్రమాలలో భాగమని పేర్కొన్నారు. గత ప్రభుత్వాల హయాంలో నిర్లక్ష్యానికి గురైన భూపాలపల్లి ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని ఎమ్మెల్యే అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ప్రతి రూపాయి ప్రజల సంక్షేమానికే ఖర్చు చేస్తున్నామని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి అయ్యేలా అధికారులకు సూచనలు చేసినట్లు తెలిపారు. ప్రజలు కూడా సహకరించి అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కొత్త రేషన్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్యే మున్సిపాలిటీ పరిధిలోని వేశాలపల్లి డబుల్ బెడ్ రూమ్ కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన రేషన్ షాపును ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై ఎమ్మెల్యే మాట్లాడారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా, సమర్థవంతంగా చేరాలన్నదే ప్రజా ప్రభుత్వ ఉద్దేశమని అన్నారు. రేషన్ షాపుల ద్వారా నిత్యావసర వస్తువులు సులభంగా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రేషన్ సరుకులు పొందేందుకు అధికార యంత్రాంగం నిరంతరం పర్యవేక్షణ చేస్తోందని, సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కోరారు. ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే యువతను క్రీడల వైపు ప్రోత్సహించడమే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పునాది అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. జంగేడు క్రికెట్ అసోసియేషన్ వారి ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని క్రికెట్ ఆడారు. అనంతరం కేకు కోసి పలువురు క్రీడాకారులకు తినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...క్రికెట్ వంటి క్రీడలు యువతలో క్రమశిక్షణ, జట్టు భావన, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు. క్రీడాకారులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. జంగేడు క్రికెట్ అసోసియేషన్ సేవలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. మద్యపానవ్యసన విముక్తి కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మాదక ద్రవ్యాలు మరియు మద్యపాన వ్యసనాల వల్ల సమాజంలో అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని, యువత భవిష్యత్తును కాపాడుకోవాలంటే వ్యసన విముక్తి అత్యంత అవసరమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంజూరునగర్ లో సంఘమిత్ర వాలంటరీ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మాదక ద్రవ్యాల మరియు మద్యపాన వ్యసన విముక్తి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రం ద్వారా వ్యసనాలకు బానిసైన వారికి వైద్య చికిత్సతో పాటు మానసిక సలహాలు, పునరావాస సేవలు అందించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వ్యసనాలు వ్యక్తినే కాదు, కుటుంబాన్ని, సమాజాన్ని నాశనం చేస్తాయన్నారు. ఇలాంటి కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా బాధితులను సక్రమ మార్గంలోకి తీసుకురావడం మన బాధ్యతన్నారు. యువత చెడు మార్గాల వైపు వెళ్లకుండా సరైన దిశలో నడిపించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందన్నారు.

# తీన్మార్ మల్లన్న జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన టీఆర్పీ శ్రేణులు..

## ● రవి పటేల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి, వృద్ధాశ్రమంలో అన్నదానం, పండ్లు పంపిణీ








**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, జనవరి 17 ( తారా జ్యోతి):** తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న జన్మదినాన్ని పురస్కరించుకుని భూపాలపల్లి జిల్లాలో పలు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు టీఆర్పీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఆధ్వర్యంలో భూపాలపల్లి పట్టణంలోని అమృత వర్షిణి వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించి, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అక్కడ నివసిస్తున్న వృద్ధులు తీన్మార్ మల్లన్న ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని, రాష్ట్రానికి ముఖ్య మంత్రిగా మారి ప్రజలకు మరింత సేవ చేయాలని హృదయ పూర్వకంగా ఆశీర్వదించారు. అనంతరం భూపాలపల్లి జిల్లా వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, గర్భిణీ స్త్రీలకు పండ్లను పంపిణీ చేసి మానవతా సేవను చాటారు. తదుపరి భూపాలపల్లి టౌన్‌లోని అంబేద్కర్ సెంటర్‌లో బాణాసంచా కాల్చి, కేక్ కట్ చేసి, పార్టీ నాయకులతో కలిసి నినాదాలు చేస్తూ జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం తీన్మార్ మల్లన్న జన్మదినాన్ని పురస్కరించుకుని రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, ఇతర సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతుందని తెలిపారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో ఎల్లవేళలా ప్రజల సేవకే తాము అంకితమని, ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభ్యున్నతి కోసం తీన్మార్ మల్లన్న నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేస్తూ గడపగడపకు పార్టీ నినాదాన్ని తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ఎస్పీకే సాగర్, జిల్లా నాయకులు ఇనుగాల ప్రణయ్ రాజ్, బండి సునీల్, సుంకరి సందీప్, జింకల శ్రీను, రొడ్డ శ్రీనివాస్, అనంతుల సంపత్ (బొట్టు), అశోక్, సంతోష్, రంజిత్, నవీన్, సమ్మయ్య, సాయి రాజేందర్, శ్రీధర్, రాంబాబు, శ్రీకాంత్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బస్తీబాట కార్యక్రమంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన మాజీ ఎమ్మెల్యే గండ్ర



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, జనవరి 17 (తారా జ్యోతి):** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డు జవహర్నగర్ కాలనీ లో పట్టణ అధ్యక్షుడు కటకం జనార్దన్ అధ్యక్షతన రమణన్న బస్తీబాట కార్యక్రమం నిర్వహించగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండేళ్ల ప్రభుత్వ పాలనలో పట్టణాల పరిస్థితి అధోగతికి చేరిందని, కనీస మౌలిక వసతులు కూడా ప్రజలకు అందించలేక ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుధ్యం వంటి సమస్యలు రోజు రోజుకు పెరిగిపోతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ప్రజలు సమస్యలు చెబుతుంటే ఇక్కడ ఓట్లేన్ని అని అడుగుతుండు, అలా ఉంది ప్రస్తుత పాలకుల పరిస్థితి. ఏమి చేయాలన్న ఓట్లు రావాలి అనే పద్ధతి వ్యవహరిస్తుంది. ప్రభుత్వం మౌనంగా ఉండటం, అధికార యంత్రాంగం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరం. బిఆర్ఎస్ ప్రభుత్వం మా హయాంలో పట్టణ అభివృద్ధికి కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ప్రజలపై భారం మోపడం తప్ప అభివృద్ధి చేయడంలో ఈ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ఇకనైనా ప్రజలు ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని గుర్తించి ప్రశ్నించాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీని గెలిపించి అబ్బద్దాల పునాదులపై వెలిసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ఒట్లు పెట్టి ప్రజలను మభ్యపెడుతున్న రేవంత్ రెడ్డిని అదాపాతాళానికి తొక్కాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భూపాలపల్లి మున్సిపాలిటీ రిజర్వేషన్లు ఖరారు..

- మున్సిపాలిటీ చైర్మన్ బీసీ జనరల్ కేటాయింపు
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో
- డ్రా తీసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, జనవరి 17 (తారా జ్యోతి):** భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు సంబంధించిన రిజర్వేషన్ల ప్రక్రియను శనివారం ఐడీఓసి కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, 30 వార్డులకు ఎస్టీ 2, ఎస్సి 6, బిసి 7, అన్ రిజర్వ్15 స్థానాలు కేటాయించినట్లు తెలిపారు. అలాగే ఎస్టీ వార్డుల్లో 1 మహిళకు, ఎస్సి వార్డుల్లో 3 మహిళలకు, బిసి కేటాయించిన 7 స్థానాల్లో 3 మహిళలకు, అన్రి జర్వ్15 స్థానాల్లో 8 మహిళలకు రిజర్వేషన్లు కేటాయించినట్లు వివరించారు. రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో వీడియో గ్రఫీ మధ్య లాటరీ పద్ధతిలో నిర్వహించామని, ఈ ప్రక్రియ పూర్తిగా నిష్పక్షపాతంగా మరియు పారదర్శకంగా సాగిందని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆటగాళ్లలో నైపుణ్యం పెంచడానికే క్రీడా పోటీలు..

## - జాదరావుపేట సర్పంచ్ బండి సువర్ణ రమేష్







**కాటారం జనవరి 17, ( తారా జ్యోతి):** ఆటగాళ్లలో నైపుణ్యాలను పెంచడానికి క్రీడా పోటీలు ఎంతో అవసరమని, తద్వారా క్రీడల్లో రాణిస్తారని జాదరావుపేట సర్పంచ్ బండి సువర్ణ రమేష్ అన్నారు. సర్పంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామస్థాయి వాలీబాల్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ పోటీల్లో 8 టీమ్స్ ఉత్సాహంగా పాల్గొన్నారు క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో అద్భుతమైన ఆటతీరుతో విజేత జట్టు కె ఎఫ్ రైడర్స్ టీం కప్‌ను కైవసం చేసుకుంది. ఈ జట్టుకు కెప్టెన్‌గా ఎండి అజారుద్దీన్ నేతృత్వం వహించారు. గోమాస మనోజ్ కెప్టెన్ నేతృత్వంలో రన్నర్ ఆఫ్‌గా మనీ లెవెన్ టీం నిలిచింది. వాలీబాల్ మొదటి విజేతగా ఫ్లాష్ మ్యాన్ టీం సి దుర్గం ధనుష్ రన్నర్ ఆఫ్ సి ఓ 90(సి) దుర్గం రాంబాబు టీం నిలిచారు. ఇరు జట్ల విజేతలకు గ్రామ సర్పంచ్ చేతుల మీదుగా కప్ అందజేశారు. మరియు అన్ని జట్లను అభినందిస్తూ, టోర్నమెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన ఆర్గనైజర్ దుర్గం మహేష్‌కి అంపైర్లు మరియు వాలంటీర్లకు వార్డు సభ్యులకు గ్రామపంచాయతీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలకు ఎంపికైన చిరంజీవి, వినయ్ కుమార్

## - విద్యార్థులను అభినందించిన పాఠశాల ఉపాధ్యాయులు





**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, జనవరి 17 (తారా జ్యోతి):** పెద్దపల్లి జిల్లాలోని త్రినిట్ పాఠశాలలో ఈ నెల 4వ తేదీన పెద్దపల్లి జిల్లా ఖో ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సబ్ జూనియర్ ఖో ఖో ఎంపిక పోటీలలో అత్యంత ప్రతిభ కనబరిచిన చిరంజీవి, వినయ కుమార్‌లు రాస్తా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మహాదేవపూర్ బాలుర పాఠశాల వ్యాయామ ఉపాద్యాయులు శిరంగి రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల్ కుమార్ తెలియజేశారు. ఈ నెలలో తేదీ 17.01.2026 నుండి 20.01.2026 వరకు మహాబాద్ జిల్లాలో జరుగు ఖో ఖో టౌర్నమెంట్ లో పాల్గొంటారు. రాష్ట్ర స్థాయి కి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ఉపాద్యాయులు రాజిరెడ్డి, ప్రభాకర్ రెడ్డి, తిరుపతి రెడ్డి, దేవేందర్ రెడ్డి, సమయ్య, శ్రీనివాస్, అనిల్ కుమార్, లచ్చయ్య రాజయ్య కోటేశ్వరరావు, షాహాజ, అనిత, కవిత,లు అభినందించారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం ప్రజాబాట




**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, జనవరి 17 ( తారా జ్యోతి):** భూపాలపల్లి మండలంలోని గుర్రంపేట గ్రామంలో ప్రజాబాట కార్యక్రమంలో ఎస్.ఎస్ నెంబర్ 28 /25కేవిఏ డిటీఆర్ క్రింద లైన్ కు తగిలే చెట్టుకొమ్మలు కొట్టివేయడం జరిగింది మరియు లూస్ లైన్ ఉంటే సరిచేయటం జరిగింది. ఎల్ టి లైన్ లో మిడిల్ పోల్స్, మరియు రోడ్ క్రాసింగ్ పోల్స్ కొరకు ఎస్టిమేషన్ పంపించి మిడిల్ పోల్స్, మరియు రోడ్ క్రాసింగ్ పోల్స్ వేస్తాము అని చెప్పారు, విద్యుత్ షాక్ కు గురికాకుండా ఉండడానికి కనీస జాగ్రత్తలు తీసుకోవాలని రైతులు వ్యవసాయ బావుల వద్ద ఉన్న ట్రాన్స్ఫర్మర్స్ ఫ్యూస్ బూర్న్ అయినపుడు ఫ్యూజ్లను వెంటనే వేయవద్దని వెంటనే విద్యుత్ సిబ్బందికి తెలియపర్చాలి.తెగివున్న లైన్ను తాకకూడదు వెంటనే విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని అన్నారు. రైతులు జాయింట్ ఉన్న సర్వీస్ వైర్స్ ను వెంటనే మార్చాలని అన్నారు. విద్యుత్ వినియోగదారుల్లు ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని అన్నారు. సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1912 కి సంప్రదించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గుర్రంపేట గ్రామ సర్పంచ్ కోడూరి రమేష్, విద్యుత్ శాఖ భూపాలపల్లి సర్కిల్ ఎస్ ఏ ఓ లకపతి , విద్యుత్ శాఖ భూపాలపల్లి రూరల్ సబ్ ఇంజనీర్ గుగులోత్ నాగేష్ ,సిబ్బంది రవి అసిస్టెంట్ లైన్ మాన్, రవి కట్టర్, , రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పొత్కపల్లి పోచమ్మకు పోత లింగన్న లే(డా)డు?


◆ కొంతకాలం క్రితం ధ్వంసం చేసినట్టు ఆందోళనలు ◆ పందులు రాకాయంటూ కొందరి వివరణలు
◆ కానరాని పునః ప్రతిష్టలు ◆ పట్టించుకోని నాయకులు ◆ పోచమ్మ దేవాలయంపై అందిస్తున్న ప్రత్యేక కథనం..

**బ్యూరో,(తారజ్యోతి):** అవును మీరు చదివింది అక్షరాల నిజమే. ఈ పోచమ్మ తల్లి ముందు పోతలింగన్న విగ్రహం లేదు. పెట్టాలన్న సోయి కూడా ఏ ఒక్కరిలో రాకపోవడంతో నిరాదరణకు గురైనట్టు కనిపిస్తున్నది. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పొత్కాపల్లి మేజర్ గ్రామంలో ఉన్న పోచమ్మ తల్లి దేవాలయం ముందు పోత లింగన్న లేడు. బహుశా రాష్ట్రంలో ఇలా ఉన్న దేవాలయం ఇది ఒక్కటే కావచ్చు అంటున్నారు కొందరు.

మన హిందూ సంప్రదాయం ప్రకారం గ్రామంలో ఉన్నవారు అందరూ ఏ కార్యక్రమం చేయాలన్నా, మొదలు పెట్టాలన్నా ముందుగా మొక్కులు చెల్లించాల్సింది పోచమ్మ తల్లికే. కొత్తగా ఇల్లు కట్టుకోవాలి అనుకున్నా, పూర్తిచేసుకుని గృహప్రవేశం చేయాలన్నా, ఇంట్లో జరిగే పెళ్లిళ్లకు పేరంటాలకు శుభకార్యాలకు ఆఖరికి తీర్థయాత్రలకు బయలుదేరాలన్నా ముందుగా పోచమ్మ తల్లికి దండం పెట్టుకుని రావాల్సిందే. ఇది అనాదిగా గ్రామాల్లో పాతుకుపోయిన పురాతన ఆచారం.

అక్కడ చెల్లించే ముక్కుల్లో ఏమాత్రం తేడా వచ్చినా జరిగే శుభకార్యాల్లో కీడును శంకిస్తూ ఉంటారు మన పెద్దలు. కొంచెం అటు ఇటుగా జరిగినా కూడా పోచమ్మ తల్లి కి చెల్లించే మొక్కుల్లో తేడానే కారణం కావచ్చని పరిష్కారాల కోసం పూనకాల( దేవుళ్ళు ) వద్ద కు పరిగెత్తుతూ ఉంటారు. ఇలాంటి సన్నివేశం దాదాపుగా ప్రతి ఒక్కరికి ఏదో ఒక సందర్భంలో అనుభవ పూర్వకంగా జరిగే ఉంటుంది. మరి అలాంటిది గత కొంతకాలం నుండి ఇక్కడ పోతలింగన్న లేకుండానే భక్తులు పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకుంటున్నారు అనే బదులు చెల్లించుకోవాల్సి వస్తున్నది అనడమే కరెక్ట్. దీనికి గల కారణాన్ని ఒకసారి వెనక్కి వెళ్లి చూద్దాం....

గత సంవత్సరం లో ఒకరోజు రాత్రి అనుకోకుండా గుడి ముందు గల పోత లింగన్న విగ్రహం క్రింద పడి ఉండడాన్ని కొంతమంది గమనించారు.



ఉద్దేశపూర్వకంగా ఎవరో ధ్వంసం చేశారంటూ కొందరు భక్తులు ఆందోళనకు దిగారు. ఈ విషయం మీద అన్ని రాజకీయపార్టీల వాళ్లు బెల్లం కొట్టిన రాయిలా ఉన్నా కూడా బిజెపికి చెందిన కొందరు యువకులు మాత్రం గట్టి పట్టు పట్టడం జరిగింది. ఆ తర్వాత ఏమైందోఏమో గానీ మళ్ళీ అందరూ సైలెంట్ అయిపోయారు. అయితే కొందరు మాత్రం ఇది ధ్వంసం చేయబడలేదు అంటూ వివరణ ఇస్తూ రాత్రి పూట పందులు రాకడం వల్ల విరిగింది అంటూ సమస్యను మూగ జీవుల వైపు మళ్ళించడం జరిగింది . ఇక దాంతో కథ ముగిసింది. విగ్రహ ధ్వంసం అంశం పందుల కొట్టంలో దూరి భూస్థాపితం అయింది. కట్టె విరగలేదు పాము చావలేదు అన్న విధంగా సమస్య పక్కదోవ పట్టింది.

ఎలా జరిగితేనేమి విగ్రహం మాత్రం కుప్పకూలింది. అది సరే ఇప్పటివరకు తిరిగి దానిని పునః ప్రతిష్ట చేయాలన్నసోయి గానీ ఆలోచనగానీ ఈ గ్రామ నాయకుల్లో ఒక్కరికి కూడా రాకపోవడం విడ్డూరమే కాదు విచిత్రం కూడా . మరి చిన్న చిన్న పొరపాట్లను సహించని మన సాంప్రదాయ పెద్దలు ప్రస్తుతం పోతలింగన్న లేకుండా ఎలా మొక్కులు చెల్లిస్తున్నారు అనేది సమాధానం లేని ప్రశ్నగానే మిగిలిపోతున్నది.

అయితే ఇలా పోతలింగన్న వద్ద పూజలు లేకుండా మొక్కులు చెల్లించడం గ్రామానికి మంచిది కాదు అంటున్నారు కొందరు పెద్దమనుషులు. గ్రామ ఇలవేల్పుగా మొదటి ముక్కు చెల్లించాల్సిన పోచమ్మ తల్లి వద్ద ఆచారం ప్రకారంపోత లింగన్న విగ్రహాన్నితక్షణమే ప్రతిష్ట చేసే విధంగా నాయకులు ఆలోచించాలని పలువురు కోరుతున్నారు.




విరిగిన పోత లింగన్న విగ్రహం

# ఓట్ల కోసం కులసంఘాలను మోసం చేస్తున్న మంథని ఎమ్మెల్యే...

◆ కుల సంఘ భవన నిర్మాణాల్లో కుల వివక్ష చూపించిండు ◆ మంథని దాటి రాష్ట్రాన్ని మోసం చేస్తున్న దుద్దిళ్ల శ్రీధర్
◆ ప్రజల్లో చైతన్యం వచ్చే వరకు పోరాటం చేస్తూనే ఉంటా ◆ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

**కాటారం, జనవరి 17 (తారజ్యోతి):** ఎన్నికలు వస్తేనే అభివృద్ధి పనులు గుర్తుకు వచ్చే మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఈసారి ఓట్ల కోసం కుల సంఘాలను మోసం చేస్తున్నాడని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. శనివారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత అక్టోబర్ మాసంలో కుల సంఘాలకు భవనాలు మంజూరు చేశానంటూ పాలాభిషేకాలు చేయించుకున్న మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ ఆ భవనాలకు జనవరి 12న శంఖుస్థాపనలు చేశారని అన్నారు. అయితే మంథని పట్టణంలోని పోచమ్మ గుడి వద్ద మేర, పూసల, స్వర్ణకార, కుమ్మరి, నాయిబ్రాహ్మణ కుల సంఘాలకు ఒకే చోట భవన నిర్మాణాల కోసం శిలాఫలకాలు వేసి శంఖుస్థాపన చేశారని, అయితే ఆ ప్రాంతమంతా వాగు ఒడ్డున ఉందని, ముంపుకు గురయ్యే ప్రాంతంలో కులసంఘ భవనాలు నిర్మించడం ఏంటని ప్రశ్నించారు. బఫర్ జోన్, నాలా నద్దీ ప్రాంతాల్లో నిర్మించిన నిర్మాణాలను తొలగిస్తున్న క్రమంలో ఇక్కడ భవనాలు నిర్మిస్తామనడంలో అంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సాధారణంగా టెండర్లు పూర్తయి సైట్ ఆధీనంలోకి వచ్చి కాంట్రాక్ట్ చేతికి సైట్ అందిన తర్వాతనే శిలాఫలకాలు వేసి శంఖుస్థాపనలు చేస్తుంటారని, ఒక్కోసారి కాంట్రాక్ట్ వచ్చి సైట్ ఆదీనంలోకి రాకపోసే క్యాన్సల్ అయ్యే ప్రమాదం కూడా ఉంటుందని ఆయన వివరించారు. కానీ ఇక్కడ ఏమీ లేకుండానే కేవలం టెండర్లు పిలిచి శంఖుస్థాపనలు చేసి కుల సంఘాలను మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ మోసం చేశాడని అన్నారు. అంటే వాగు ఒడ్డున ఉన్న కులసంఘా భవనాలన్నీ వాగులో కొట్టుకుపోవాలన్నదే ఆయన ఆలోచననా అని ప్రశ్నించారు. అంతేకాకుండా ఈ కులసంఘ భవనాలు గ్రామస్థాయిలోనా లేక మండల స్థాయిలోనా నియోజకవర్గ స్థాయిలోనా అనేది ఏదీ చెప్పడం లేదని, స్పష్టత లేకుండా కుల సంఘాలకు శిలా ఫలకాలు వేసి ఆ సంఘాల్లో లొల్లి పెట్టించడమే మంథని ఎమ్మెల్యే ఆలోచన అని ఆయన అన్నారు. పోచమ్మగుడి ప్రాంతంలో భవనాలు నిర్మించాలంటే ముందుగా వాగుకు సీసీవాల్స్ కట్టి రక్షణ ఉందని తేలిన తర్వాతనే శంఖుస్థాపనలు చేయాల్సి ఉండగా ఆ దిశగా చేయలేదన్నారు. ఓట్లు వస్తేనే ఇవన్నీ మంథని ఎమ్మెల్యేకు గుర్తుకు వస్తాయని, రెండేళ్ల కాలంలో కులసంఘ భవనాలు ఎందుకు గుర్తుకు రాలేదని ఆయన ప్రశ్నించారు. కేవలం ఓట్లు మాత్రమే దుద్దిళ్ల కుటుంబానికి కావాలని, ప్రజలపై ఎలాంటి చిత్తశుద్ధి లేదని తేలిందన్నారు. అంతేకాకుండా బీద కులాలన్నింటిని ఊరి బయటపడేసి వాళ్లకు కావాల్సిన కుల సంఘాలకు మాత్రం



మంథనిలో చోటు ఇచ్చారని, అంటే ఇక్కడ కులవివక్ష చూపినట్లే కదా అని అన్నారు. కాపు కుల సంఘానికి కూచిరాజ్‌పల్లి వద్ద కేటాయింపు చేశారని ఆయన వివరించారు. కులాలు లేవని అంటూనే వివక్ష చూపిస్తున్నాడని ఆయన అన్నారు. ఇప్పటికే 420హామీల చైర్మన్‌గా మంథని నియోజకవర్గాన్ని దాటి రాష్ట్రాన్ని మోసం చేస్తున్నాడని, రాబోయే రోజుల్లో రాహుల్ గాంధీ పక్కన చేరి రాష్ట్రం దాటి దేశాన్ని సైతం మోసం చేస్తాడని ఆయన విమర్శించారు. శిలాఫలకాలు వేసినవన్నీ కులసంఘాల భవనాల కోసం కాదని అవన్నీ ఓట్ల సంఘ భవనాలని ఆయన ఎద్దేవా చేశారు. సమాజం మేల్కొనే వరకు ప్రజలను అప్రమత్తం చేయడంలో అలసత్వం వహించకుండా నా పాత్రను పోషిస్తానని ఆయన ఈసందర్బంగా స్పష్టం చేశారు. రాష్ట్ర ఖజానాలో పైసాలేవని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓవైపు మొత్తుకుంటుంటే నగర అభివృద్ధి సంస్థ పేరిట నిధులు ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే బిల్లులు రాక ఎంతో మంది కాంట్రాక్టర్‌లు పనులు మధ్యలోనే ఆపేస్తున్నారని ఆయన వివరించారు,. ఇప్పటికైనా కుల సంఘాల నాయకులు మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ మాటలకు మోసపోవద్దని, ఈనాడు శిలాఫలకాలు వేసి మున్సిపల్ ఎన్నికల పూర్తయ్యాక మిమ్మల్ని పట్టించుకోదని, మళ్లీ ఎన్నికలు వచ్చాకనే మరోరూపంలో వచ్చి మభ్యపెట్టే ప్రయత్నం చేస్తాడని తెలిపారు. మోసాలకు మారుపేరు అబద్దాలకు నిలువెత్తు సాక్ష్యం మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ అని ఆదారాలతో సహ ఈ సమాజం ముందు చూపుతున్నానని, మనం ఎప్పటి వరకు చైతన్యవంతులం కామో అప్పటి వరకు ఓట్ల కోసం మోసం చేస్తూనే ఉంటాడని ఆయన ఈ సందర్బంగా స్పష్టం చేశారు.

# ఉదయాన్నే ఖాళీకడుపుతో ఇవి రెండంటే రెండే ఆకులు తినడం అలవాటు చేసుకోండి..! క్రమంగా మ్యాజిక్ చూస్తారు..



తులసిలో యాంటీఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. రోగాల బారిన పడకుండా శరీరాన్ని రక్షిస్తుంది. సీజనల్ వ్యాధులను దూరం చేయడంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయి. తులసి ఆకులను తినటం వల్ల మనసును ప్రశాంతంగా ఉంచి, ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. తులసి ఆకులు పళ్లు, చిగుళ్ళ ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు సహాయపడుతుంది. తులసి ఆకుల రసం లేదా కషాయాన్ని నోటితో పుక్కిలించి ఉమ్మేయటం వల్ల నోటి నుంచి వచ్చే వాసన తగ్గిపోతుంది. వర్షాకాలంలో తులసి ఆకులను తినడం వల్ల శ్వాసకోశ సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ఇది శ్వాసకోశ వ్యవస్థను శుభ్రపరుస్తుంది. జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి సమస్యలను తగ్గిస్తుంది. తులసి ఆకులను నమలడం వల్ల దానిలోని పోషకాల వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ఇది అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలను కూడా తగ్గిస్తుంది. ఆకలిని నియంత్రించడంలో కూడా ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. పరగడుపునే తులసి ఆకులను తినటం వల్ల రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. మధుమేహం ఉన్నవారికి చాలా మంచిది. అంతేకాదు, తులసిలోని యాంటీ ఆక్సిడెంట్లు గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. రక్తపోటును తగ్గించి, హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. తులసిలో విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ కె వంటి అనేక రకాల విటమిన్లు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచి చర్మ ఆరోగ్యాన్ని కాపాడతాయి. తులసిలో కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్, ఐరన్, పొటాషియం వంటి ఖనిజాలు కూడా పుష్కలంగా ఉన్నాయి. ఎముకల ఆరోగ్యానికి, రక్త ప్రసరణకు, నరాల ఆరోగ్యానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

# ఇలాంటి లక్షణాలు కనిపిస్తున్నాయా..? డయాబెటిస్ రోగానికి చేరువైనట్లే..



ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, తప్పుడు ఆహారపు అలవాట్ల వల్ల మధుమేహం (డయాబెటిస్) కేసులు వేగంగా పెరుగుతున్నాయి. మధుమేహం ముందు పరిస్థితిని అంటే.. రోగం ప్రారంభానికి ముందు ప్రీడయాబెటిస్ అని పిలుస్తారు. మధుమేహం ప్రారంభ దశలో రక్తంలో చక్కెర స్థాయిలు సాధారణం కంటే ఎక్కువగా ఉంటాయి.. క్రమంగా పెరుగుతుంటాయి.. అయితే.. ప్రీడయాబెటిస్‌ను గుర్తించడం చాలా ముఖ్యం. ఎందుకంటే ఇది మధుమేహం ప్రారంభ సంకేతం.. ఈ దశలో సరైన చర్యలు తీసుకుంటే, ఈ వ్యాధిని నివారించడం సాధ్యమవుతుంది. వైద్య నిపుణుల ప్రకారం.. ప్రీడయాబెటీస్ రోగులలో రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణ లేకుండా పోయే అవకాశం ఉంది.. ఇది తరువాత టైప్ 2 మధుమేహం రూపాన్ని తీసుకోవచ్చు.. సరైన సమయంలో గుర్తించడం ద్వారా డయాబెటిస్ ను నియంత్రించవచ్చు. సరైన వైద్యాన్ని తీసుకోవచ్చు.. ప్రీడయాబెటిస్ లక్షణాలు: ప్రీడయాబెటిస్ లక్షణాలు తరచుగా చాలా తక్కువగా ఉంటాయి.. ప్రజలు సాధారణంగా వాటిని విస్మరిస్తారు. కానీ అలసట, తరచుగా దాహం, ఆకలి పెరగడం, బరువులో అవాంఛనీయ మార్పులు వంటి చిన్న చిన్న సమస్యలపై శ్రద్ధ పెట్టాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎక్కువసార్లు మూత్రవిసర్జన చేయడం, తరచుగా పుండ్లు కావడం, చూపు స్పష్టంగా లేకపోవడం, గాయాలు, దెబ్బలు త్వరగా మానకపోవడం కూడా ప్రీడయాబెటిస్ సంకేతాలే.. ఈ లక్షణాలు కనిపిస్తే, వెంటనే రక్తంలో చక్కెరను తనిఖీ చేయాలి. సమయానుకూలంగా పరీక్షలు చేయించుకోవడం – జీవనశైలిలో మార్పులు తప్పనిసరి.. ఇంకా, మంచి ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యమని వైద్యనిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వారి కుటుంబంలో మధుమేహం ఉన్నా.. ఇలాంటి లక్షణాలు కనిపించినప్పుడు రక్తంలో చక్కెరను క్రమం తప్పకుండా పరీక్షించడం అవసరం. రెగ్యులర్ పరీక్షల ద్వారా, ప్రీడయాబెటిస్‌ను గుర్తించడం మాత్రమే కాకుండా దానిని సకాలంలో నియంత్రించవచ్చు. ప్రిడయాబెటిస్ రిస్క్ నుంచి ఇలా బయటపడండి: ఆరోగ్యకరమైన ఆహారం, పండ్లు, కూరగాయలు, గింజలు, తృణధాన్యాలు, ఆలివ్ నూనె అధికంగా ఉండే ఆహారం ప్రిడయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. మరింత చురుకుగా ఉండటం, బరువు తగ్గడం, ధూమపానం మానేయడం, అవసరమైన మేరకు మందులు తీసుకోవడం ద్వారా ప్రిడయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గించవచ్చు..

# రిటైర్ మెంట్ బెనిఫిట్స్‌ను అందించాలి


**- ఆర్టీసీ అధికారులకు విశ్రాంత ఉద్యోగుల వినతి**



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, జనవరి 17 (తారా జ్యోతి):** భూపాలపల్లి ఆర్టీసీ డిపోలో అనేక ఏళ్లు పాటు విధులు నిర్వర్తించి రిటైర్మెంట్ పొందిన ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ను వెంటనే అందించాలని డిపో విశ్రాంత ఉద్యోగులు కోరారు. ఈ మేరకు శనివారం భూ పాలపల్లి ఆర్టీసీ డిపో అధికారులకు వినతి పత్రాన్ని అందించారు. 2017 నుండి ఇప్పటి వరకు 9 సంవత్సరాలుగా సెటిల్మెంట్లు అన్నియూ సకాలంలో రాక అనేక రకాలుగా ఇబ్బందులు పడుతన్నామని వివరించారు. ఈ విషయంలో వెంటనే చొరువ చూపి వెంటనే తమ సమస్యలన పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు కె. సదయ్య, కె. స్వామి, మల్లయ్య, రాములు, రవిందర్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటాలి..

**- ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర**




**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి జనవరి 17,(తారజ్యోతి):** త్వరలో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ జెండా ఎగరవేయడమే ధ్యేయంగా పని చేయాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా భూపాలపల్లి మున్సిపాలిటీ వార్డులలో ఇన్చార్జిలను నియమించి వారికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని భూపాలపల్లి అభివృద్ధి పై కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగట్టాలని సూచించారు. గత బిఆర్ఎస్ పార్టీ పాలనలో ఎటువంటి అభివృద్ధి జరిగింది అనేది ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని కోరారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బిఆర్ఎస్ శ్రేణులు విస్తృతంగా కృషి చేయాలని సూచించారు.

# మీకెప్పుడైనా తీవ్ర భయం, ఆందోళనగా అనిపిస్తే.. వెంటనే ఇలా చేయండి! 2 నిమిషాల్లో నార్మల్ అవుతారు

మనిషి శారీరకంగా ఎంత ఆరోగ్యంగా ఉన్నా, మానసికంగా ప్రశాంతత లేకపోతే జీవన గందరగోళంగా ఉంటుంది. సరైన సమయంలో చికిత్స తీసుకోకుంటే దీర్ఘకాలిక రుగ్మతలకు దారి తీస్తుంది. తద్వారా విపరీత ఆలోచనలతో ఆత్మహత్యలకు ప్రేరేపిస్తుంది. మితిమీరిన ఆందోళన, పని ఒత్తిడి, కుటుంబ సమస్యల గురించి అతిగా ఆలోచించడం మిమ్మల్ని మానసికంగా, శారీరకంగా అనారోగ్యానికి గురి చేస్తుంది. ఇది ఆందోళన వంటి సమస్యలను కూడా కలిగిస్తుంది. ఇది ఒక రకమైన మానసిక రుగ్మత. ఇది నిద్రను కూడా ప్రభావితం చేస్తుంది. కండరాల ఒత్తిడిని పెంచుతుంది. జీర్ణ సమస్యలు, చిరాకు, ఏకాగ్రత లేకపోవడం, తీవ్ర భయాందోళనలకు గురవుతుంటారు. దేశంలో దాదాపు 88% మంది ప్రజలు ఏదో ఒక రకమైన ఆందోళనతో బాధపడుతున్నారని ఒక అధ్యయనం వెల్లడించింది. అంటే ప్రతి 100 మందిలో 88 మంది ఈ మానసిక రుగ్మతకు గురవుతున్నారన్నమాట. కాబట్టి మీ చుట్టుపక్కల ఎవరైనా పానిక్ అటాక్‌తో బాధపడుతున్నట్లయితే, ఇలా చేయండని మానసిక వైద్యులు సలహా ఇస్తున్నారు. మీరూ పానిక్ అటాక్‌తో బాధపడుతుంటే ఎలా సహాయం చేయాలో ఇక్కడ తెలుసుకుందాం.. నీళ్లు తాగడం వల్ల వారిలో కొంత భయం, ఆందోళన తగ్గుతాయి. చల్లటి నీరు తాగడం వల్ల పారాసింపథెటిక్ నాడీ వ్యవస్థ ఉత్తేజితమవుతుంది. ఇది వ్యక్తిని శాంతింపజేయడానికి సహాయపడుతుంది. తీవ్ర భయాందోళనకు గురైతే వెంటనే చేతులు, కాళ్ళను చల్లటి నీటితో కడగాలి. అలాగే టవల్‌ను తడిపి మీ ముఖం లేదా మెడపై ఉంచుకోవాలి. ఇది భయం నుండి కొంచెం శాంతపరచడానికి సహాయపడుతుంది. మీ చుట్టుపక్కల లేదా ఇంట్లో ఎవరైనా భయాందోళనకు గురవుతున్నట్లు అనిపిస్తే.. మీరు వారి ప్రవర్తనను చూస్తే దూరంగా ఉండకండి.బదులుగాఆవ్యక్తిని సౌకర్యవంతమైన కుర్చీ లేదా సోఫాలో కూర్చోబెట్టి.. కాసేపు మీరు వారితో గడపడానికి ప్రయత్నించాలి.

# సాక్స్ లేకుండా షూస్ వేసుకుంటున్నారా? నష్టాలు ఏంటో తెలుసుకోండి!

సాధారణంగా చాలా మంది సాక్స్ లేకుండా షూస్ వేసుకుంటారు. ఇటీవలి కాలంలో కూడా యువతలో ఇలాంటి ఫ్యాషన్ ఎక్కువగా ఉంది. సాక్స్ లేకుండా షూస్ వేసుకోవడం వల్ల పాదాల్లో దుర్వాసన రావడమే కాకుండా ఆరోగ్యం కూడా పాడవుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. శరీరంలో చెమట ఎక్కువగా ఉండే భాగాలలో పాదాలు ఒకటి. అలాగే రోజంతా షూస్ వేసుకోవడం వల్ల చెమట ఎక్కువగా పడుతుంది. అందుకే దీనిని వదిలించుకోవడానికి, వాసనను నివారించడానికి, పాదాలను పొడిగా ఉంచడానికి సాక్స్ ఉత్తమం. వీటన్నింటితో పాటు, ఇది తరచుగా పాదాలకు చెమట పట్టడాన్ని నివారిస్తుంది. అందుకే సాక్స్ లేకుండా బూట్లు ధరించడం వల్ల కలిగే నష్టాలు ఏమిటి? సాక్స్ మన పాదాలను ఎలా ఆరోగ్యంగా ఉంచుతుంది? దానికి సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకుందాం. సాక్స్ ధరించడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. ఇది అనేక రకాల బ్యాక్టీరియా నుండి మిమ్మల్ని రక్షిస్తుంది. అలాగే వీటిని ధరించడం వల్ల ఎలాంటి ఫంగల్ లేదా బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు దరిచేరవు. సాక్స్ వేసవిలో చెమట పట్టకుండా నిరోధించడమే కాకుండా శీతాకాలానికి కూడా మేలు చేస్తుంది. ఎందుకంటే ఆ సమయంలో సాక్స్ వేసుకోవడం వల్ల జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే ఇవి మీ పాదాలను వెచ్చగా ఉంచుతాయి. అలర్జీ సమస్య: సాక్స్ ధరించకుండా షూస్ వేసుకునే వారికి అలర్జీ సమస్య రావచ్చు. కొంతమందికి చాలా సున్నితమైన చర్మం ఉంటుంది. అందుకే అబ్బాయిలు, సాక్స్ లేకుండా బూట్లు ధరించవద్దు. లేకపోతే చాలా మందికి పాదాలకు చెమట పట్టడం, వారి పాదాలకు అనేక రకాల సమస్యలు వస్తాయి. చెమట బూట్ల లోపల తేమను మరింత పెంచుతుంది. ఇది వివిధ రకాల బ్యాక్టీరియా లేదా ఫంగల్ ఇన్ఫెక్షన్లకు దారి తీస్తుంది. కొందరికి సాక్స్ లేకుండా షూస్ వేసుకోవడం వల్ల పాదాలకు పొక్కులు వస్తాయి. ఇలాంటి సమస్య రాకుండా ఉండాలంటే బూట్లు వేసుకునే వారు సాక్స్ ధరించాలని నిపుణులు చెబుతున్నారు.

TARAJYOTHI TELUGU DAILY తారాజ్యోతి

# బెండకాయలో ఉన్న ఆరోగ్య ప్రయోజనాలు తెలుసా..?
# ఖాళీ కడుపుతో ఇలా వాడితే బోలెడు లాభాలు..



బెండకాయ చాలా మందికి ఇష్టమైన కూరగాయ. దీంతో ఎన్నో రకాల వంటకాలు తయారుచేస్తాం. బెండకాయ ఫ్రై, బెండకాయ మసాలా, కర్రీ, చారు ఇలా ఎన్నో వంటకాలు. అయితే, రోజూ ఖాళీ కడుపుతో బెండకాయ నీళ్లు తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. బెండాకాయను రాత్రంతా నీళ్లలో నానబెట్టి మర్నాడు ఉదయం ఈ నీటిని తాగాలని చెబుతున్నారు. బెండకాయ నీటి కోసం ముందుగా లేత బెండకాయలను నాలుగు తీసుకుని శుభ్రంగా వాష్ చేసుకోవాలి. ఆ తర్వాత వాటిని నిలువునా, అడ్డంగా ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఒక బౌల్‌లో డ్రింకింగ్ వాటర్ పోసి అందులో కట్ చేసుకున్న బెండకాయ ముక్కలు వేయాలి. రాత్రంతా అవి నీటిలో బాగా నానిపోతాయి. ఆ మర్నాడు బెండకాయ నీటిని వడకట్టి నీటిని తాగండి. ఇక దీంతో కలిగే లాభాలు తెలిస్తే ఆశ్చర్యపోతారు.. బెండకాయలో ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, మాంగనీస్, విటమిన్ సి కలిగి



ఉంటాయని చెప్పారు. ఇందులో విటమిన్ బి, సి, ఫోలిక్ యాసిడ్, ఫైబర్ పుష్కలంగా ఉన్నాయి. ఇది ఆకలిని తగ్గిస్తుంది. తద్వారా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అలాగే, ఫెన్నెల్ వాటర్ శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడానికి, జీవక్రియను పెంచడానికి సహాయపడుతుంది. బెండకాయలో మాంగనీస్ ఉంటుంది. ఇది జీవక్రియ, రక్తంలో చక్కెర నియంత్రణకు కీలకమైన ఖనిజం. బెండకాయలో కరిగే, కరగని ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. రక్తంలో చక్కెరను నియంత్రించడంలో ఇది ప్రభావవంతంగా ఉంటుంది. ఇది శరీరం నుండి కార్బోహైడ్రేట్ల శోషణను నెమ్మదిస్తుంది. జీర్ణక్రియను ఆలస్యం చేస్తుంది. బెండకాయలో విటమిన్ ఎ, సి మరియు యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది రక్తాన్ని శుద్ధి చేయడంతోపాటు టాక్సిన్స్‌ను బయటకు పంపుతుంది. ఇది చర్మం వృద్ధాప్య ప్రక్రియను ఆలస్యం చేయడంలో, మచ్చలు ఇతర చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. బెండకాయలో ఫైబర్, ప్రోటీన్, కార్బోహైడ్రేట్లు, కాల్షియం, ఫాస్పరస్ పుష్కలంగా లభిస్తాయి. ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, సోడియం, కాపర్ వంటి పోషకాలు ఉన్నాయి. బెండకాయ రోగనిరోధక వ్యవస్థపై సానుకూల ప్రభావాన్ని చూపుతుంది. బెండకాయలో ఫ్లేవనాయిడ్స్, పాలీఫెనాల్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు అధికం. కళ్లకు , ఎముకలకు బెండకాయ చాలా మంచిది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు బెండకాయ చాలా మంచిది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో బెండకాయ నానబెట్టిన నీటిని తాగితే రక్తంలో చక్కెర స్థాయి అదుపులో ఉంటుంది. కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచడంలో సహాయపడుతుంది. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. బెండకాయలో క్యాన్సర్ నిరోధక గుణాలు ఉన్నాయి. పేగు క్యాన్సర్ వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరుచడంలో బెండకాయ సహాయపడుతుంది. బరువు తగ్గడానికి, రక్తపోటు నియంత్రణలో బెండకాయ సహాయపడుతుంది. బెండకాయను ఉడికించేటప్పుడు నూనె తక్కువ వాడితే ఆరోగ్యానికి మంచిది.

# ఆరు గంటల కంటే తక్కువగా నిద్రపోతున్నారా.. అయితే మీ బాడీ ఇక షెడ్డుకే, లేటెస్ట్ సర్వేలో షాకింగ్ నిజాలు

నిద్ర లేమి చాలా మందికి జీవితంలో ఒక భాగమైపోయింది. డిజిటల్ క్రియేటర్స్ అవార్డ్‌లో ఇటీవల జరిగిన ఇంటరాక్షన్ సందర్భంగా, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కూడా మనిషి నిద్ర ప్రాముఖ్యతను హైలైట్ చేశారు. చాలామంది తమ నిద్ర దినచర్యకు సంబంధించి క్రమశిక్షణతో లేరని నొక్కి చెప్పాడు. ప్రపంచ నిద్ర దినోత్సవం సందర్భంగా లోకల్ సర్కిల్స్ నిర్వహించిన తాజా సర్వేలో గత రెండేళ్లలో, రోజుకు 7 గంటలు కూడా నిరంతరాయంగా నిద్రపోవడంలో అనేక మంది పౌరులు సమస్యలు ఎదుర్కొంటున్నారని వెల్లడించింది. సర్వే ప్రకారం, 61 శాతం మంది భారతీయులు గత 12 నెలల్లో రాత్రిపూట 6 గంటల కంటే తక్కువ నిరంతరాయంగా నిద్రపోగా, 38 శాతం మంది రాత్రిపూట 4 నుండి 6 గంటల నిరంతరాయ నిద్రను పొందుతున్నారు. వారిలో దాదాపు 23 శాతం మంది పౌరులు 4 గంటల వరకు నిద్రపోవడం లేదట. అయితే 50 శాతం మంది ప్రజలు రోజుకు 6 గంటల కంటే తక్కువ నిద్రపోతున్నారట. సర్వేలో అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఇంతకు ముందు నిర్వహించిన సర్వేలతో పోల్చినప్పుడు, ప్రతిరోజూ 6 గంటల కంటే తక్కువ నిద్రపోయే భారతీయ పౌరుల శాతం 2022లో 50 శాతం నుండి 2023లో 55 శాతానికి పెరిగింది. 2024లో నిద్ర లేమి ఫిర్యాదులతో ప్రతివాదులు 61 శాతానికి నిరంతరంగా పెరుగుతున్నారని సర్వే పేర్కొంది. 72 శాతం మంది ప్రతివాదులు నిద్రలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ సార్లు వాష్‌రూమ్‌ని ఉపయోగించడం కోసం మేల్కొంటారని చెప్పారు. అంతరాయం లేని నిద్ర వెనుక మానసిక ఆరోగ్య సమస్యల నుండి శారీరక ఆరోగ్య సమస్యల వరకు ఉండవచ్చు. ఇక దాదాపు 72 శాతం మంది తమ నిద్రలో ఒకసారి లేదా అంతకంటే ఎక్కువ సార్లు వాష్‌రూమ్‌ని ఉపయోగించారు. సర్వేలో దాదాపు 43 శాతం మంది వ్యక్తులు నిద్రపోవడానికి చాలా సమయం తీసుకుంటున్నారని, ఇక ఉదయాన్నే ఇంటి కార్యకలాపాలకు దూరంగా ఉంటారని చెప్పారు. -19 మహమ్మారి సమయంలో వారి నిద్ర నాణ్యత క్షీణించిందని సర్వేలో



పాల్గొన్న 26 శాతం మంది వ్యక్తులు గుర్తించారు. యోగ, ధ్యానం నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మంచి నిద్ర కోసం కొన్ని చిట్కాలు రోజూ నడవడం, గంటపాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల నిద్ర మెరుగుపడుతుంది. ఆరోగ్యంగా తినండి లేదా తేలికపాటి రాత్రి భోజనం చేయండి. రాత్రి భోజనం, నిద్రవేళ మధ్య 3 గంటల గ్యాప్ ఉంచండి. నిద్రకు 3 గంటల ముందు టీ లేదా కాఫీకి దూరంగా ఉండండి. మంచి నిద్ర కోసం మీరు పుస్తకాన్ని చదవవచ్చు. ధ్యానం చేయవచ్చు

## ఈ సూపర్ ఫుడ్స్‌తో మెరిసే చర్మం సొంతం



కాంతులీనే చర్మం కోసం పలువురు రకరకాల చర్మ సంరక్షణ ఉత్పత్తులను వాడుతూ ప్రయోగాలు చేస్తుంటారు. చర్మ సౌందర్యాన్ని సహజ సిద్ధంగా పెంపొందించి చర్మ నిగారింపులో కీలకంగా పనిచేసే ఆహార పదార్థాలను మాత్రం నిర్లక్ష్యం చేస్తుంటారు. యూఎస్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ 2020 పరిశోధనా కథనంలో ప్రస్తావించిన వివరాల ప్రకారం పోషకాహారానికి చర్మ ఆరోగ్యంతో సంబంధం ఉందని వెల్లడైంది. దెబ్బతిన్న చర్మాన్ని పోషకాహారం, మన ఆహారపు అలవాట్లతో చక్కదిద్దవచ్చని పోషకాహార నిపుణులతో పాటు డెర్మటాలజిస్టులూ చెబుతున్నారు. మీ చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలంటే ఐదు భారతీయ సూపర్ ఫుడ్స్‌ను ఎంచుకోవాలని ఎండీ, డెర్మటాలజిస్ట్ డాక్టర్ జుష్య భాటియా సరిన్ ఇన్‌స్టాగ్రాంలో షేర్ చేశారు. నట్స్ నుంచి కూరగాయాలు, మసాలా దినుసులు, తృణధాన్యాల వంటివి వివిధ రెసిపీల్లో వాడితే చర్మ సంరక్షణ, చర్మ ఆరోగ్యం మెరుగవుతుందని చెబుతున్నారు. టమాటాలు చర్మ సౌందర్యానికి అద్భుతంగా పనిచేస్తాయని ఆమె చెబుతున్నారు. ఇందులో ఉండే లైకోపీన్ అనే యాంటీ ఏజింగ్, యాంటీఆక్సిడెంట్స్ చర్మానికి మేలు చేస్తాయి. టమాటా సూప్స్, టమాటా కర్రీ వంటి వండిన టమాటా డిష్‌లను అధికంగా తీసుకోవాలని ఇన్‌స్టాగ్రాం రీల్‌లో ఆమె వివరించారు. ఇంకా రెడ్ క్యారెట్స్, వాటర్ మెలన్స్, పపాయాల వంటివి కూడా చర్మ సంరక్షణకు ఉపయోగపడతాయని తెలిపారు. ఇక చర్మ ఆరోగ్యానికి మేలు చేసే ఐదు ఆహార పదార్థాలను పరిశీలిస్తే..

## ఆలివ్ షాట్స్.. ఇప్పుడిదే సరికొత్త ట్రెండ్

షాట్స్ అంటే మద్యానికి సంబంధించిన గ్లాసులే గుర్తుకొస్తాయి. కానీ ఇప్పుడో సరికొత్త ట్రెండ్ మొదలైంది. అదే ఆలివ్ ఆయిల్ షాట్స్! ఓ రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ నూనెను గుటుక్కున మింగేయడమే. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. సాక్షాత్తు కర్దాషిన్, జెన్నిఫర్ లోపెజ్ మద్దతిస్తున్న ట్రెండ్. జెన్నిఫర్‌కు ఆలివ్ ఆయిల్ మీద ఎంత నమ్మకం అంటే తన తరగని అందానికి రహస్యం బొటిక్స్, సర్జరీలు కాదు, ఆలివ్ ఆయిల్ సేవనమే అని చెబుతారు. నిజంగానే ఆలివ్ ఆయిల్‌తో చాలా ఉపయోగాలు ఉన్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే పాలిఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్స్ చర్మ సంరక్షణకు దోహదం చేస్తాయట. గుండె నుంచి కాలేయం వరకు శరీరంలోని అన్ని అవయవాలకూ ఆలివ్ ఆయిల్ మేలు చేస్తుందనేది నిపుణుల మాట. భోజనానికీ భోజనానికీ మధ్య విరామంలో ఆలివ్ షాట్స్ తీసుకుంటే మంచిదని సూచిస్తున్నారు. దీనికోసం ఎలాంటి రసాయనాలూ కలవని వర్జిన్ ఆలివ్ ఆయిల్‌ని రెండు చెంచాలు వాడాలి. అయితే, ఇలా చేయడం అందరి శరీరాలకు పడకపోవచ్చునీ, వైద్యులను సంప్రదించిన తర్వాతే ఆలివ్ షాట్స్ తీసుకోవాలనీ నిపుణులు సూచిస్తున్నారు.

## మౌత్‌వాష్ వాడటం మంచిదేనా.. నోటిలో పుండ్లు ఉంటే వాడొచ్చా ?

మౌత్‌వాష్‌ను ఒకప్పుడు విలాసంగా భావించేవారు. ఇప్పుడలా కాదు. నలుగురిలో మాట్లాడే టప్పుడు అసౌకర్యంగా ఉండకూడదన్నా, నోరు తాజాగా అనిపించాలన్నా.. మౌత్‌వాష్ వాడేస్తున్నారు. ఫ్లోరైడ్ జోడించిన మౌత్‌వాష్ వల్ల పళ్లకు బలమనీ, ఆల్కహాల్ కలవని మౌత్‌వాష్ వల్ల దుష్ఫలితాలు తగ్గుతాయనీ, అలొవెరా లాంటి సహజ పదార్థాలు జోడించిన




మౌత్‌వాష్ మరింత ప్రయోజనకరమని నిపుణులు చెబుతున్నారు. ఇంకా బ్యాక్టీరియాను అరికట్టి, పంటి ఎనామిల్‌ను కాపాడటంలో ఫ్లోరైడ్ కలిగిన మౌత్‌వాష్‌లు సాయపడతాయి. హానికర సూక్ష్మక్రిములను అడ్డుకుని.. చిగుళ్లు గట్టిగా ఉండేలా, వాపులాంటి సమస్యలు రాకుండా చూసుకుంటాయి. పంటి మీద మరకల్ని పోగొట్టి, మెరిసేలా చేస్తాయి. శ్వాసలో దుర్వాసన హరించి, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి. నోటిలో ఏర్పడే పుండ్లను తగ్గించడంలోనూ కీలకపాత్ర పోషిస్తాయి. అయితే ఏ మౌత్‌వాష్ వాడాలి అనే విషయాన్ని దంతవైద్యుడిని సంప్రదించిన తర్వాతే నిర్ణయించుకోవాలని సూచిస్తున్నారు ఆరోగ్యనిపుణులు.

## గుడ్డు- పాలు..ఇందులో ఆరోగ్యానికి ఏది ఎక్కువ ప్రయోజనకరం!



గుడ్డు, పాలు రెండూ ఎక్కువ పరిమాణంలో తీసుకుంటారు. అయితే ఎప్పుడూ చర్చకు వచ్చే ప్రశ్న ఒకటుంది. అదేంటంటే రెండు గుడ్లు లేదా పాలల్లో ఏది ఎక్కువ ప్రయోజనకరం. ఈ రెండింటిలోనూ శరీరానికి మేలు చేసే పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. గుడ్లు, పాలు రెండింటిలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. కండరాల పెరుగుదలను మెరుగుపరచాలనుకునే వ్యక్తులు గుడ్లు, పాలు తీసుకోవడం మంచిది. రెండింటిలో విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. అయితే మరింత ప్రయోజనకరమైనది ఏమిటో తెలుసుకుందాం. ఒక గుడ్డులో ఎలాంటి పోషకాలు ఉంటాయి? హెల్త్‌లైన్ నివేదికల ప్రకారం, ఒక ఉడికించిన గుడ్డు (1 గుడ్డు)లో 6.3 గ్రాముల ప్రోటీన్, 77 కేలరీలు, 5.3 గ్రాముల మొత్తం కొవ్వు, 212 మిల్లీగ్రాముల కొలెస్ట్రాల్, 0.6 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 25 మిల్లీగ్రాముల కాల్షియంతో పాటు విటమిన్  విటమిన్ 2, విటమిన్ 12, విటమిన్ బి5, ఫాస్పరస్, సెలీనియం వంటి అనేక పోషకాలు కూడా ఉన్నాయి. ఇంకో విషయం ఏంటంటే ఇది కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటుంది. అయితే ఇది రక్త కొలెస్ట్రాల్‌పై తక్కువ ప్రభావాన్ని చూపుతుంది. అలాగే గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచదు. అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారు గుడ్లు తీసుకునే ముందు వారి వైద్యుడిని లేదా డైటీషియన్‌ను సంప్రదించాలి. ఒక కప్పు పాలలో ఎలాంటి పోషకాలు ఒక కప్పు పాలలో అంటే 250 గ్రాముల పాలు. 8.14 గ్రాముల అధిక నాణ్యత గల ప్రోటీన్, 152 కేలరీలు, 12 గ్రాముల పిండి పదార్థాలు, 12 గ్రాముల చక్కెర, 8 గ్రాముల కొవ్వు, 250 మిల్లీగ్రాముల కాల్షియం, విటమిన్ 12, రిబోఫ్లావిన్, ఫాస్పరస్, అనేక ఇతర పోషకాలు ఉన్నాయి. పాలలో 88 శాతం నీరు ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడంలో సహాయపడుతుంది. పాలలో కొంత వెయ్ ప్రోటీన్ కూడా ఉంటుంది. ప్రోటీన్‌తో పాటు, పాలు కాల్షియం అద్భుతమైన మూలంగా పరిగణించబడుతుంది. ముఖ్యంగా పాల నుండి లభించే కాల్షియం శరీరం సులభంగా గ్రహించబడుతుంది. రెండింటిలో ఏది ఎక్కువ ప్రయోజనకరం? ఇప్పుడు మనం పాలు, గుడ్లను పోల్చినట్లయితే రెండింటిలో మంచి మొత్తంలో ప్రోటీన్లు ఉంటాయి. కానీ పాలలో గుడ్లు కంటే ఎక్కువ కాల్షియం ఉంటుంది. గుడ్లలో కొలెస్ట్రాల్ ఎక్కువగా ఉంటుంది. కానీ పాలలో ఉండదు. రెండూ చాలా ఎక్కువ కేలరీలు కలిగి ఉండవు. తినడానికి సురక్షితంగా పరిగణించబడతాయి. కానీ మీరు శాఖాహారులైతే పాలను సమృద్ధిగా తీసుకోండి. కానీ గుడ్లు తింటే వారానికి 4 నుంచి 5 గుడ్లు తినొచ్చు. మరోవైపు మీరు ప్రతిరోజూ పాలు తాగవచ్చు. ఎందుకంటే ప్రతిరోజూ పాలు తాగడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ రావు.

## మందుబాబులు ఇది మీకు తెలుసా..! ఆల్కహాల్.. మెదడుపై ఎంతసేపట్లో ఎఫెక్ట్ చూపుతుంది..?




సాధారణంగా చాలామంది మానసిక ఉల్లాసం కోసం మద్యం సేవిస్తుంటారు. మద్యం అలవాటు, ఆల్కహాల్ తాగడం అనేది కొందరికి హాబీ, కొందరికి అలవాటు. మద్యానికి అలవాటు పడిన చాలా మంది దానికి బానిసలయ్యారు. ఇప్పుడు చాలా పార్టీలలో ఆల్కహాల్ ప్రత్యేక విందుగా, స్టేటస్ సింబల్‌గా ఏర్పాటు




చేస్తున్నారు. మద్యం అలవాటుతో మెదడు ఉత్తేజితమవుతుంది. ఆల్కహాల్ తాగిన వెంటనే శరీరంలో ఉత్సాహం పెరుగుతుంది. అయితే మద్యం మెదడుపై ప్రభావం చూపడానికి ఎంత సమయం పడుతుందో తెలుసా? మద్యానికి సంబంధించిన కొన్ని ఆసక్తికరమైన విషయాలు ఇక్కడ తెలుసుకుందాం.. మద్యం సేవించిన తర్వాత ఎంతకాలం అది మెదడుపై ప్రభావం చూపుతుందనే విషయంపై అధ్యయనం చేసిన పరిశోధకులు పలు విషయాలను వెల్లడించారు. ఒక పరిశోధన ప్రకారం, మద్యం తాగిన 6 నిమిషాల తర్వాత మెదడుపై ప్రభావం చూపుతుందని తేల్చారు. అప్పుడు శరీరంలో ఉత్పత్తయ్యే డోపమైన్, ఎండార్ఫిన్ లాంటి హార్మోన్లు మెదడును తాత్కాలికంగా ఉత్తేజపరుస్తాయి. అలాంటి ఆల్కహాల్ ఎఫెక్ట్ ప్రభావం పురుషులు, స్త్రీలపై సమానంగా ఉంటుందా అనే విషయానికి వస్తే.. మద్యం మత్తు పురుషులు, స్త్రీలను భిన్నంగా ప్రభావితం చేస్తుందని చెప్పారు. ప్రపంచంలోనే బలమైన బీర్‌లో ఆల్కహాల్ ఎంత శాతం ఉందనే దానిపై కూడా పరిశోధకులు విశ్లేషించారు. ప్రపంచంలోనే అత్యంత బలమైన బీర్‌లో 67.5 శాతం ఆల్కహాల్ ఉంటుందని వెల్లడించారు. ఇకపోతే, కొందరు మహిళలకు మద్యం అలవాటు ఉంటుంది. అలాంటి వారు గర్భధారణ సమయంలో మద్యపానం చేయటం వల్ల పుట్టబోయే శిశువుపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే విషయంపై కూడా పరిశోధకలు విశ్లేషించారు..గర్భధారణ సమయంలో మద్యం సేవించడం వల్ల బిడ్డకు 428 రకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని గుర్తించారు. అలాగే, మద్యం మత్తు ఎప్పుడు గరిష్ట స్థాయికి చేరుకుంటుందనే విషయాన్ని వారు వెల్లడించారు. ఖాళీ కడుపుతో ఆల్కహాల్ తాగడం వల్ల ఎక్కువ మత్తు వస్తుందని చెప్పారు. అయితే ఆహారంతో పాటు ఆల్కహాల్ తీసుకోవడం వల్ల మత్తుకు ఎక్కేందుకు ఆలస్యం అవుతుందని చెప్పారు. అంతేకాదు..ఆల్కహాల్ తాగడం వల్ల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుందా..? అనే విషయంపై కూడా పరిశోదించగా, ఆల్కహాల్ తీసుకున్న తర్వాత శరీర ఉష్ణోగ్రత పెరుగుతుందని చాలా మంది అనుకుంటారు. కానీ అలా జరగదు. నిజానికి శరీర ఉష్ణోగ్రత తగ్గుతోందని గుర్తించారు. మద్యం అతిగా తాగటం వల్ల మెదడులో క్రియాశీలత తగ్గిపోతుంది. నాడులు దెబ్బతింటాయి. గుండె కొట్టుకునే వేగం తగ్గుతుంది. శ్వాస క్రియ కూడా నెమ్మదిస్తుంది. అది కొన్నిసార్లు మరణానికి కూడా దారితీయవచ్చునని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే, అత్యధికంగా బీరు తాగిన రికార్డుకెక్కిన వ్యక్తి కూడా ఒకరు ఉన్నారని పరిశోధకులు వెల్లడించారు. అతను రెజ్లర్ ఆండ్రీ ది జెయింట్ అత్యధికంగా బీర్ తాగిన రికార్డును సొంతం చేసుకున్నాడు. కానీ, ఆల్కహాల్ ప్రభావం వివిధ దశలుగా ఉంటుంది. ఆఖరి దశ మరణం. మద్యం ఎంత ఎక్కువగా తీసుకుంటే దుష్ప్రభావాల తీవ్రత అంతగా పెరుగుతుంది. గణాంకాల ప్రకారం, మద్యం సేవించడం వల్ల ప్రతి సెకనుకు ఒకరు మరణిస్తున్నారని చెప్పారు. ఇకపోతే, మద్యం సేవించడం వల్ల కొన్ని ప్రయోజనాలు కూడా ఉన్నాయని చెప్పారు. మానవులు జీవించడానికి 13 ఖనిజాలు అవసరం, ఈ ఖనిజాలన్నీ ఆల్కహాల్‌లో ఉంటాయని పరిశోధకులు చెబుతున్నారు.

# రోహిత్ కెప్టెన్సీ కోల్పోవడంలో అజీత్ అగార్కర్, గంభీర్ పాత్ర

## భారత మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ సంచలన వ్యాఖ్యలు

మ్ఇండియా స్టార్ ఆటగాడు రోహిత్ శర్మ వన్డే కెప్టెన్సీని కోల్పోవడం వ్యవహారంపై భారత మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ సంచలన వ్యాఖ్యలు చేశాడు. గతేడాది రోహిత్ నాయకత్వంలో టీమ్ఇండియా ఛాంపియన్స్ ట్రోఫీ నెగ్గింది. అయినప్పటికీ అతడిని కెప్టెన్సీ నుంచి తప్పించడం వెనుక హైడ్రామా జరిగిందని అన్నాడు. రోహిత్ కెప్టెన్సీ కోల్పోవడంలో బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజీత్ అగార్కర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పాత్ర ఉందని మనోజ్ తివారీ ఆరోపించాడు. తాజాగా జాతీయ మీడియా ఇంటర్వ్యూలో పాల్గొన్న తివారీ ఈ వ్యాఖ్యలు చేశాడు. భారత్?కు టీ20 ప్రపంచకప్, ఛాంపియన్స్ ట్రోఫీ అందించిన ఉత్తమ కెప్టెన్ రోహిత్?ను అకస్మాత్తుగా నాయకత్వ బాధ్యతల నుంచి తప్పించడం సరైంది కాదని తివారీ అన్నాడు. ఇది కచ్చితంగా రోహిత్‌ను అవమానించినట్లేనని అసంతృప్తి వ్యక్తం చేశాడు. 'అగార్కర్ వ్యక్తిత్వం ఉన్నవాడు. అతడు డెసిషన్ మేకర్. ఎంతటి పెద్ద నిర్ణయాలు తీసుకోవడానికైనా అగార్కర్ వెనుకాడడు. అయితే ఇలాంటి నిర్ణయాన్ని మాత్రం అతడు ఒక్కడే తీసుకొని ఉండడు. ఈ నిర్ణయం వెనుక మరొకరు ఉండవచ్చు. అగార్కర్ చీఫ్ సెలెక్టర్ హోదాలో, కోచ్ సూచనల మేరకే ఈ



నిర్ణయం తీసుకుని ఉండాలి. అందుకే దీనికి ఇద్దరూ బాధ్యులే' అని మనోజ్ తివారీ జఅయితే గతేడాది మార్చిలో ఛాంపియన్స్ ట్రోఫీ నెగ్గిన తర్వాత రోహిత్ మే నెలలో టెస్టులకు రిటైర్మెంట్ ఇచ్చేశాడు. కేవసం వన్డేలపైనే దృష్టి పెట్టాడు. ఈ క్రమంలోనే ఆసీస్ సిరీస్?కు సిద్ధమవుతుండగా రోహిత్?ను బీసీసీఐ కెప్టెన్ బాధ్యతల నుంచి తప్పించింది. యంగ్ బ్యాటర్ శుభ్?మన్ గిల్?ను మేనేజ్?మెంట్ వన్డే, టెస్టు ఫార్మాట్?కు కెప్టెన్?గా నియమించింది. పొట్టి ఫార్మాట్ టీ20లకు సూర్యకుమార్ యాదవ్ సారథిగా వ్యవహరిస్తున్నాడు.కాగా, రోహిత్ శర్మ 2021లో టీమ్ఇండియా ఫుల్?టైమ్ కెప్టెన్?గా బాధ్యతలు అందుకున్నాడు. .2022 టీ20 వరల్డ్?కప్?లో సెమీస్?లో భారత్ ఓడింది. కానీ ఆ తర్వాత వరుసగా ఆడిన మూడు ఐసీసీ టోర్నీల్లో రోహిత్ కెప్టెన్సీలోనే భారత్ ఫైనల్?కు వెళ్లింది. అతడి కెప్టెన్సీలో టీమ్ఇండియా తొమ్మిది నెలల వ్యవధిలో రెండుసార్లు ఐసీసీ టోర్నమెంట్ ఛాంపియన్?గా నిలిచింది. 2024 టీ20 వరల్డ్?కప్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీని నెగ్గింది. 2023 వన్డే వరల్డ్?కప్?లో ఓటమిలేకుండా ఫైనల్?కు చేరింది. కానీ తుదిమెట్టుపై ఆసీస్?ను ఢీ కొట్టిన భారత్ బోల్తా పడింది. దీంతో రన్నరప్?తో సరిపెట్టుకుంది. ?ఇక ఓవరాల్?గా అతడి కెప్టెన్సీ రికార్డ్ చూసుకుంటే, హిట్?మ్యాన్ సారథ్యంలో 56 వన్డేల్లో భారత్ ఏకంగా 42 విజయాలు సొంతం చేసుకుంది. మరో 12 మ్యాచ్?ల్లో ఓడింది. ఒక మ్యాచ్ టై కాగా, ఇంకో వన్డేలో ఫలితం తేలలేదు. ఇక టీ20లల్లోనూ రోహిత్ కెప్టెన్సీ రికార్డు ఘనంగానే ఉంది. 62 మ్యాచ్?ల్లో 49 టీ20ల్లో టీమ్ఇండియా విజయం సాధించింది. టీ20 ఫార్మాట్లో అతడి విన్నింగ్ పర్సంటేజ్ 79.03గా ఉంది.

# స్పోర్ట్స్



## బంగ్లాదేశ్ సారథికి ఆయుశ్ మాత్రే నో షేక్ హ్యాండ్

అండర్ 19 వరల్డ్?కప్?లో భాగంగా బులవాయో వేదికగా భారత్ – బంగ్లాదేశ్ యువ జట్లు తలపడుతున్నాయి. ఈ మ్యాచ్?లో టాస్ ఓడిన టీమ్ఇండియా తొలుత బ్యాటింగ్?కు దిగింది. అయితే అంతకుముందు మైదానంలో అసక్తికర సంఘటన జరిగింది. టాస్ సమయంలో భారత్ కెప్టెన్ ఆయుశ్ మాత్రే, బంగ్లాదేశ్ సారథికి షేక్?హ్యాండ్ ఇవ్వలేదు! ప్రస్తుతం క్రీడావర్గాల్లో హాట్?టాపిక్?గా మారింది.ప్రస్తుతం భారత్– బంగ్లాదేశ్? మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బంగ్లాలో హిందువులపై దాడుల నేపథ్యంలో ఆ దేశంలో దౌత్య సంబంధాలు దెబ్బ తిన్నాయి. ఈ కాంట్రవర్సీ క్రికెట్?దాకా వచ్చింది. దీంతో ఇరుదేశాల మధ్య వివాదం రోజురోజుకూ ముదురుతోంది. ఈ క్రమంలో తాజా మ్యాచ్?లో టాస్ సమయంలో బంగ్లా కెప్టెన్? జవేద్ అబ్రార్?తో టీమ్ఇండియా కెప్టెన్ ఆయుశ్ మాత్రే షేక్?హ్యాండ్ ఇవ్వలేదు. దీంతో ఇది క్రీడావర్గాల్లో హాట్?టాపిక్?గా మారింది. అయితే దీనిపై అటు బంగ్లాగానీ, భారత్?గానీ అధికారికంగా స్పందించలేదు. బంగ్లాలో హిందువులపై దాడుల నేపథ్యంలో ఆ దేశ పేస్ బౌలర్?? ముస్తాఫిజుర్?ను బీసీసీఐ ఐపీఎల్? నుంచి తప్పించింది. బోర్డు ఆదేశాల మేరకు వేలంలో ముస్తాఫిజుర్?ను కొనుగోలు చేసిన కోల్?కతా ఫ్రాంచైజీ అతడిని జట్టులోంచి రిలీజ్ చేసింది. దీంతో ప్రతి చర్యగా వచ్చే నెలలో భారత్? వేదికగా జరగనున్న టీ20 వరల్డ్?కప్?లో ఆడేందుకు బంగ్లాదేశ్ జట్టును ఇక్కడికి పంపేందుకు బీసీబీ నిరాకరిస్తోంది. భారత్?లో కాకుండా శ్రీలంకలో తమ మ్యాచ్?లు ఆడేలా రీ షెడ్యూల్ చేయాలని ఇటీవల ఐసీసీకి విజ్ఞప్తి చేసింది. దీనిపై సస్పెన్స్? ఇంకా కొనసాగుతోంది. అయితే ఈ వ్యవహారంపై ఐసీసీ ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.గతేడాది పహల్గామ్? ఉగ్రగాడికి నిరసనగా ఆసియా కప్?లో భారత సీనియర్ క్రికెటర్లు పాకిస్థాన్?తో కరచాలనం చేయలేదు. ఆ టోర్నీలో పాక్?తో మూడుసార్లు భారత్ తలపడగా, మూడుసార్లు కూడా మన ప్లేయర్లు దాయాది జట్టు ఆటగాళ్లకు షేక్ హ్యాండ్ ఇవ్వలేదు. ఫైనల్?లో నెగ్గిన తర్వాత కూడా పాకిస్థాన్?కు చెందిన మోసిన్ నఖ్వీ చేతిలమీదుగా ట్రోఫీని అందుకునేందుకు టీమ్ఇండియా నిరాకరించింది. దీంతో నఖ్వీ ఈ ట్రోఫీని తనతోపాటు తీసుకెళ్లాడు. ఆ ట్రోఫీ ఇంకా భారత్?కు అందలేదు. ప్రస్తుతం దీనిపై కూడా కాంట్రవర్సీ నడుస్తోంది. 2025 మహిళల వన్డే వరల్డ్?కప్?లో భారత్– పాకిస్థాన్ మధ్య మ్యాచ్?లోనూ ఇదే పునరావృతం అయ్యింది. పురుషుల క్రికెట్?లోలాగే మహిళలు కూడా పాకిస్థాన్ క్రికెటర్లకు షేక్ హ్యాండ్ ఇవ్వలేదు. టాస్? సమయంలోగానీ, మ్యాచ్? ముగిసిన తర్వాతగానీ టీమ్ఇండియా ప్లేయర్లు పాకిస్థాన్ క్రీడాకారిణులతో కరచాలనం చేయలేదు. ఇదే పాలసీని ఇప్పుడు యువ భారత జట్టు కూడా కొనసాగించింది.తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 48.4 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌటైంది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 49 ఓవర్లకు కుదించారు. అభిజ్ఞాన్ కుందు (80; 112 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సులు), వైభవ్ సూర్యవంశీ (72; 67 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్సులు) రాణించారు. కనిష్క్ చౌహాన్ (28) ఫర్వాలేదనిపించాడు. ఆయుష్ మాత్రే (6), వేదాంత్ త్రివేది (0) నిరాశపర్చడంతో ఆరంభంలోనే భారత్ 12 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. బంగ్లాదేశ్ బౌలర్లలో ఫహద్ 5, ఇక్బాల్ 2, హకీమ్ తమీమ్ 2, పావెజ్ జిబోన్ ఒక వికెట్ పడగొట్టారు.

## చిత్తుగా ఓడిన ముంబై ఇండియన్స్!

వుమెన్స్ ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)2026 సీజన్‌లో ముంబై ఇండియన్స్‌కు మరో ఘోర పరాజయం ఎదురైంది. యూపీ వారియర్స్‌తో శనివారం జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా విఫలమైన ముంబై ఇండియన్స్ 22 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. యూపీ కెప్టెన్ మెగ్‌లాన్నింగ్ విధ్వంసకర బ్యాటింగ్‌తో ముంబై పతనాన్ని శాసించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన యూపీ వారియర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 187 పరుగులు చేసింది. మెగ్ లాన్నింగ్(45 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సలతో 70), ఫోబే లిట్చ్‌ఫీల్డ్(37 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సలతో 61) హాఫ్ సెంచరీలతో రాణించారు. ముంబై బౌలర్లలో నాట్ సివర్ బ్రంట్ రెండు వికెట్లు తీయగా.. అమెలియా కేర్ మూడు వికెట్లు పడగొట్టింది. నికోలా కేరీ, హీలీ మాథ్యూస్, అమన్‌జోత్ కౌర్ తలో వికెట్ తీసారు. అనంతరం ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 165 పరుగులే చేసి ఓటమిపాలైంది. అమెలియా కేర్(28 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 49 నాటౌట్), అమన్‌జోత్ కౌర్(24 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సలతో 41 నాటౌట్) పోరాడినా ఫలితం లేకపోయింది. భారత బౌలర్లో శిఖా పాండే(2/30) రెండు వికెట్లు తీయగా.. క్రాంతి గౌడ్, సోఫీ ఎక్లేస్టోన్, దీప్తి శర్మ, చోలే ట్రయాన్ తలో వికెట్ తీసారు. లక్ష్యఛేదనలో ముంబై బ్యాటర్లు తేలిపోయారు. ఓపెనర్లు హీలీ మాథ్యూస్(13), సజీవన్ సజన(10) నిరాశపర్చారు. దాంతో ముంబై పవర్ ప్లేలో 2 వికెట్లకు 38 పరుగులే చేసింది. ఆ వెంటనే నాట్ సివర్ బ్రంట్‌ను శిఖా పాండే పెవిలియన్ చేర్చింది. నికోలా కేరిని దీప్తి శర్మ ఔట్ చేయగా.. హర్మన్‌ప్రీత్ కౌర్(18) ట్రయన్ వెనక్కి పంపింది. దాంతో ముంబై 69 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితుల్లో అమెలియా కేర్, అమన్‌జోత్ కౌర్ పోరాడారు. కానీ ఛేజింగ్ రన్‌రేట్ ఎక్కువగా ఉండటంతో ముంబైకి ఓటమి తప్పలేదు. ఇప్పటి వరకు ఐదు మ్యాచ్‌లు ఆడిన ముంబైకి ఇది మూడో పరాజయం. రెండు సార్లు యూపీ వారియర్స్ చేతిలోనే ఓడటం గమనార్హం.






## చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లకు గ్రీన్ సిగ్నల్

### కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం కీలక ప్రకటన

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్యాన్స్?కు కిక్కిచ్చే న్యూస్. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో ఇంటర్నేషనల్, ఐపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ బోర్డుకు లైన్ క్లియర్ అయ్యింది. ఈ మేరకు అనుమతి లభించినట్లు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ సంఘం  శనివారం ప్రకటించింది. ప్రభుత్వం, సంబంధిత అధికారులు సూచించిన నిర్దిష్ట నిబంధనలు, షరతులకు అనుగుణంగానే చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌ల నిర్వహణ ఉంటుందని తెలిపింది. 'ఇంటర్నేషనల్, ఐపీఎల్ మ్యాచ్‌లను నిర్వహించడానికి కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్‌కు హోం శాఖ, కర్ణాటక ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని ప్రకటించడానికి మేం సంతోషిస్తున్నాం' అని కర్ణాటక రాష్ట్ర క్రికెట్ బోర్డు ఓ ప్రకటనలో పేర్కొంది. దీంతో 2026 ఐపీఎల్?లో ఆర్సీబీ హోం గ్రౌండ్ మ్యాచ్?లు చిన్నస్వామిలోనే నిర్వహించనున్నారు. ఈ వార్తతో ఆర్సీబీ ఫ్యాన్స్?లో జోష్ నిండినట్లైంది.కాగా, 2025 ఐపీఎల్?లో ఆర్సీబీ ఛాంపియన్‌గా నిలవడంతో జూన్ 04న చిన్నస్వామి స్టేడియంలో సక్సెస్ సంబరాలు నిర్వహించారు. ఈ ఈవెంట్?కు ఊహించిన దానికంటే అధికంగా అభిమానులు రావడంతో స్టేడియం బయట తొక్కిసలాట జరిగింది. ఈ తొక్కిసలాటలో ఘటనలో 11 మంది మృతి చెందారు. మరో 50 మందికి పైగా గాయపడ్డారు. దీంతో ఈ ఘటనపై విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ జాన్ మైకెల్ డి.కున్హా నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం జ్యుడిషియల్ కమిషన్ వేసింది.చిన్నస్వామి స్టేడియం మ్యాచ్‌ల నిర్వహణకు సురక్షితం కాదని ఈ కమిషన్ తేల్చింది. దీంతో ఆ తర్వాత ఈ స్టేడియంలో నిర్వహించేందుకు షెడ్యూల్ చేసిన అన్ని మ్యాచ్?లను షిఫ్ట్ చేశారు. తర్వాత కర్ణాటక డొమెస్టిక్ మహారాజా ట్రోఫీని కూడా ఆగస్టులో మైసూరుకు తరలించారు. ఆ తర్వాత మహిళల వన్డే వరల్డ్?కప్?లోనూ చిన్నస్వామిలో కొన్ని మ్యాచ్?లు జరగాల్సి ఉండగా, వాటిని వేరే వేదికలకు మార్చారు. ఇటీవల విజయ్ హజారే ట్రోఫీలోని మ్యాచ్?లు కూడా ఇక్కడ జరగాల్సి ఉండగా, అనుమతి లేకపోవడంతో ఆ మ్యాచ్?లను బీసీసీఐ ఎక్స్?లెన్స్?కు తరలించారు. అయితే ఇప్పుడు కొన్ని షరతులతో మ్యాచ్‌లు నిర్వహించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వడం ఫ్యాన్స్?కు కచ్చితంగా ఆనందాన్ని ఇస్తుంది. కాగా, 2026 ఐపీఎల్ మార్చి 26 నుంచి ప్రారంభం కానుంది.

## యువరాజ్, లారా నా ఆల్‌టైమ్ ఫేవరేట్ క్రికెటర్లు

### టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ

టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ తన ఫేవరేట్ క్రికెటర్ ఎవరో చెప్పాడు. టీమిండియా క్రికెట్ దిగ్గజాలైన సచిన్ టెండూల్కర్, మహేంద్ర సింగ్ ధోనీ, విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల పేర్లు కాకుండా ఇతర పేర్లు చెప్పడం అందర్నీ ఆశ్చర్యపరిచింది. అంతేకాకుండా ఒకరి పేరు కాకుండా ఈ 14 ఏళ్ల కుర్రాడు ఇద్దరు ఆటగాళ్లు తన ఆల్‌టైమ్ ఫేవరేట్ అని పేర్కొన్నాడు. ఇందులో ఒకరు భారత ఆటగాడు ఉండగా.. మరొకరు విదేశీ ప్లేయర్ ఉన్నాడు. ఐసీసీ అండర్ 19 ప్రపంచకప్ 2026 నేపథ్యంలో వైభవ్ సూర్యవంశీ ఈ విషయాన్ని వెల్లడించాడు. టోర్నీ నిబంధనల ప్రకారం ప్రతీ ప్లేయర్ తమను తాము పరిచయం చేసుకోవాల్సి ఉంటుంది. తమ బ్యాటింగ్, బౌలింగ్ శైలితో పాటు ఫేవరేట్ క్రికెటర్ల పేరు చెప్పాలి. అంతేకాకుండా బ్యాటర్లు అయితే తమ ఫేవరేట్ షాట్, బౌలర్లు అయితే తమ ఫేవరేట్ బాల్



ఏంటో తెలియజేయాలి. ఇందుకు సంబంధించిన వీడియోలను ప్రతీ మ్యాచ్అబశ్రీశ్రీలో ప్లే చేస్తుంటారు. బ్యాటింగ్‌కు వచ్చిన తర్వాత బ్యాటర్ల వీడియోలు.. బౌలింగ్ చేస్తున్న బౌలర్ల వీడియోలను చూపిస్తారు. ఈ క్రమంలోనే వైభవ్ సూర్యవంశీ తన ఫేవరేట్ ప్లేయర్ల పేర్లు వెల్లడించాడు. టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్, వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం బ్రియాన్ లారా తమ ఆల్‌టైమ్ ఫేవరేట్ క్రికెటర్లు అని చెప్పుకొచ్చాడు. తనకు పుల్ షాట్ అంటే చాలా ఇష్టమని పేర్కొన్నాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. జనవరి 15(గురువారం)న ప్రారంభమైన అండర్ 19 ప్రపంచకప్‌లో భారత్.. తమ తొలి మ్యాచ్‌ను అమెరికాతో ఆడింది. ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ(2) విఫలమైనా.. భారత్ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్ ద్వారా వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. అండర్ 19 ప్రపంచకప్ ఆడిన అతి పిన్న భారత ప్లేయర్‌గా నిలిచాడు. 14 ఏళ్ల 294 రోజుల వయసులో వైభవ్ సూర్యవంశీ అండర్ 19 ప్రపంచకప్ బరిలోకి దిగాడు. ఈ క్రమంలో కుమార్ కుశాగ్ర రికార్డ్‌ను అధిగమించాడు. అతను 15 ఏళ్ల 88 రోజుల వయసులో అండర్ 19 ప్రపంచకప్ ఆడాడు. 2020లో జరిగిన టోర్నీలో అమెరికాతో జరిగిన మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధించాడు. తాజాగా ఈ రికార్డ్‌ను వైభవ్ సూర్యవంశీ బ్రేక్ చేశాడు.

## భక్తి పారవశ్యంలో మునిగిపోయిన స్టార్ క్రికెటర్లు

భారత్, న్యూజిలాండ్ మధ్య జరగనున్న నిర్ణయాత్మకమైన మూడో వన్డే కోసం టీమిండియా ఇప్పటికే ఇండోర్ చేరుకుంది. సిరీస్ 1–1 తో సమానంగా ఉండటంతో, గెలుపు గుర్రం ఎక్కాలనే కసితో ఆటగాళ్లు ఉన్నారు. అయితే మైదానంలో చెమటోడ్చడమే కాకుండా, దైవబలం కోసం టీమిండియా స్టార్ ప్లేయర్లు ఇప్పుడు ఆధ్యాత్మిక బాట పట్టారు. ఇండోర్‌కు అతి సమీపంలో ఉన్న ఉజ్జయినిలోని మహాకాళేశ్వర జ్యోతిర్లింగాన్ని విరాట్ కోహ్లీ, కుల్దీప్ యాదవ్ శనివారం తెల్లవారుజామున సందర్శించుకున్నారు. భారత క్రికెట్ జట్టులో ఇప్పుడు ఆధ్యాత్మిక ధోరణి బాగా కనిపిస్తోంది. కీలకమైన మ్యాచ్‌లకు ముందు ఆటగాళ్లు ఉజ్జయిని మహాకాళుడిని దర్శించుకోవడం ఒక ఆనవాయితీగా మారింది. శనివారం తెల్లవారుజామున 4 గంటలకు జరిగే అత్యంత పవిత్రమైన భస్మ హారతిలో విరాట్ కోహ్లీ, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ పాల్గొన్నారు. సుమారు రెండు గంటల పాటు ఆలయ ప్రాంగణంలోనే గడిపిన వీరు, నంది హాల్‌లో కూర్చుని పరమశివుని నామస్మరణలో మునిగిపోయారు. గర్భాలయ చౌకట్ నుంచి స్వామివారిని దర్శించుకుని జలాభిషేకం చేశారు. ఆలయ కమిటీ వారికి స్వామివారి ప్రసాదాన్ని, చిత్రపటాన్ని బహుకరించింది. ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఉజ్జయిని మహాకాళేశ్వరాలయం అత్యంత విశిష్టమైనది. ఇది దక్షిణాభిముఖ జ్యోతిర్లింగం కావడం దీని ప్రత్యేకత. ఇక్కడ జరిగే భస్మ హారతి ప్రపంచ ప్రసిద్ధి చెందింది.

# విశ్వేజి



## వారసత్వ బట్టతలకు చెక్.. నివారణోపాయాలు ఇవిగో!

జుట్టు రాలడం అనేది వయసుతో పాటు వచ్చే సహజ ప్రక్రియ. కానీ, కొందరికి యుక్త వయసులోనే జుట్టు పలుచబడి బట్టతల రావడం ఆందోళన కలిగిస్తుంది. బట్టతల రావడానికి అనేక కారణాలున్నప్పటికీ, జన్యుపరమైన కారణాలు ప్రధానమైనవి. మీ తాత ముత్తాతలకు బట్టతల ఉంటే మీకు కూడా వచ్చే అవకాశం ఉందా? ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలంటే, బట్టతల వెనుక దాగి ఉన్న జన్యు రహస్యాలను తెలుసుకోవాలి. వారసత్వమే ప్రధాన కారణమా? బట్టతల రావడానికి వంశపారంపర్యంగా వచ్చే జన్యువులే ప్రధాన కారణమని శాస్త్రీయ అధ్యయనాలు చెబుతున్నాయి. ఆండ్రోజెనెటిక్ అలోపేసియా అని పిలువబడే సాధారణ బట్టతల, జన్యువుల ద్వారా సంక్రమిస్తుంది. ఈ పరిస్థితిలో, జుట్టు కుదుళ్లు చిన్నగా, బలహీనంగా మారుతాయి. దీని ఫలితంగా జుట్టు రాలడం ప్రారంభమవుతుంది. ముఖ్యంగా పురుషుల్లో నుదుటి భాగంలో, నెత్తి మధ్యలో జుట్టు రాలడం ఎక్కువగా కనిపిస్తుంది. బట్టతల అనేది ఒక సంక్లిష్టమైన లక్షణం. ఇది ఒకే జన్యువు ద్వారా కాకుండా అనేక జన్యువుల కలయిక ద్వారా ప్రభావితమవుతుంది. అంటే, మీ తల్లిదండ్రులిద్దరి నుండి సంక్రమించే జన్యువులు మీ జుట్టు ఆరోగ్యాన్ని నిర్ణయిస్తాయి. కాబట్టి, మీ తండ్రికి బట్టతల లేకపోయినా, మీ తల్లి వైపు బంధువులకు ఉంటే మీకు బట్టతల వచ్చే అవకాశం ఉంది. బట్టతలకు కారణమయ్యే ఇతర అంశాలు: జన్యువులే కాకుండా, ఇతర అంశాలు కూడా బట్టతలకు కారణమవుతాయి. వాటిల్లో హార్మోన్ల అసమతుల్యత ఒకటి. ఆండ్రోజెన్ అనే హార్మోన్ జుట్టు పెరుగుదలను ప్రభావితం చేస్తుంది. ఈ హార్మోన్ స్థాయి పెరిగినప్పుడు జుట్టు కుదుళ్లు కుంచించుకుపోయి జుట్టు రాలడం మొదలవుతుంది. అంతే కాకుండా వయస్సు పెరిగే కొద్దీ జుట్టు కుదుళ్లు బలహీనమవుతాయి. దీనివల్ల జుట్టు రాలడం సాధారణం. విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్లు తగినంతగా తీసుకోకపోతే జుట్టు బలహీనంగా మారుతుంది. దీర్ఘకాలిక ఒత్తిడి జుట్టు రాలడానికి దారితీస్తుంది. ఒత్తిడి హార్మోన్ల ఉత్పత్తిని పెంచుతుంది. ఇది జుట్టు కుదుళ్లను ప్రభావితం చేస్తుంది. థైరాయిడ్ సమస్యలు, రక్తహీనత, కొన్ని రకాల చర్మ వ్యాధులు జుట్టు రాలడానికి కారణమవుతాయి. కొన్ని రకాల మందులు, కీమోథెరపీ జుట్టు రాలడానికి దారితీస్తాయి. బట్టతలను నివారించడం ఎలా? వారసత్వంగా బట్టతల వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా జుట్టు రాలడాన్ని తగ్గించవచ్చు. విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ఒత్తిడిని తగ్గించుకోండి. యోగా, ధ్యానం, వ్యాయామం వంటి వాటి ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. జుట్టును శుభ్రంగా ఉంచుకోవాలి. రసాయనాలతో కూడిన ఉత్పత్తులను వాడకుండా సహజమైన ఉత్పత్తులను ఉపయోగించాలి. జుట్టు రాలడం ఎక్కువగా ఉంటే, వెంటనే వైద్యుడిని సంప్రదించి సరైన చికిత్స తీసుకోవాలి. బట్టతల అనేది ఒక సాధారణ సమస్య అయినప్పటికీ, దాని గురించి దిగులు చెందాల్సిన అవసరం లేదు. సరైన జాగ్రత్తలు, చికిత్సలతో జుట్టు రాలడాన్ని నివారించవచ్చు. ఒకవేళ బట్టతల వచ్చినా, ఆత్మవిశ్వాసంతో ఉండటం ముఖ్యం. ఎందుకంటే, మీ వ్యక్తిత్వం మీ జుట్టు కన్నా ఎంతో విలువైంది.

## కీళ్ల నొప్పులకు చెక్ .. ఈ సూపర్ ఫుడ్స్ ట్రై చేయండి!



కీళ్ల నొప్పులు.. ఈ పేరు వింటేనే చాలామంది వణికిపోతారు. వయసుతో సంబంధం లేకుండా ఎందరినో వేధిస్తున్న సమస్య ఇది. కీళ్ల నొప్పులు రావడానికి ఎన్నో కారణాలున్నాయి. వంశపారంపర్యంగా రావచ్చు, ఆర్థరైటిస్ వంటి సమస్యల వల్ల రావచ్చు, లేదా శరీరంలో యూరిక్ యాసిడ్ ఎక్కువగా ఉండడం వల్ల కూడా కీళ్ల నొప్పులు వస్తాయి. కారణం ఏదైనా నొప్పి మాత్రం నరకం చూపిస్తుంది. అయితే కొన్ని రకాల ఆహార పదార్థాలు తీసుకోవడం ద్వారా ఈ నొప్పుల నుంచి కొంత ఉపశమనం పొందవచ్చు. అవేంటో ఇప్పుడు చూద్దాం.. కీళ్ల నొప్పులను తగ్గించే ఆహారాలు: చేపలు: సాల్మన్, ట్యూనా, మాకెరెల్ వంటి చేపల్లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలో మంటను తగ్గించి కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. వారానికి కనీసం రెండుసార్లు చేపలు తినడం మంచిది. ఆకుకూరలు: పాలకూర, బచ్చలికూర, మెంతికూర వంటి ఆకుకూరల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి కీళ్ల నొప్పులను తగ్గించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా పాలకూరలో ఉండే సల్ఫోరాఫేన్ అనే సమ్మేళనం కీళ్లలో మంటను తగ్గిస్తుంది. పండ్లు: నారింజ, బత్తాయి, నిమ్మ వంటి సిట్రస్ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది కీళ్ల ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అలాగే బెర్రీలు, చెర్రీలు వంటి పండ్లలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి కీళ్లలో మంటను తగ్గిస్తాయి. %ఖాశీఃవతీవం దీఎ% గింజలు, విత్తనాలు: బాదం, వాల్‌నట్స్, అవిసె గింజలు, చియా విత్తనాలలో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ ఇ, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. ఇవి కీళ్ల నొప్పులను తగ్గించడంలో సహాయపడతాయి. వీటిని రోజూ తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది. పసుపు: పసుపులో కర్కుమిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీగా పనిచేస్తుంది. పసుపును ఆహారంలో భాగంగా తీసుకోవడం వల్ల కీళ్ల నొప్పులను తగ్గించుకోవచ్చు. పసుపు పాలు తాగడం లేదా కూరల్లో పసుపు వేసుకోవడం మంచిది. అల్లం: అల్లంలో జింజెరాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది కీళ్ల నొప్పులను తగ్గించడంలో అద్భుతంగా పనిచేస్తుంది. అల్లాన్ని టీలో వేసుకుని తాగడం లేదా కూరల్లో ఉపయోగించడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. వెల్లుల్లి: వెల్లుల్లిలో అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది కీళ్ల నొప్పులను తగ్గించడంలో సహాయపడుతుంది. రోజూ రెండు మూడు వెల్లుల్లి రెబ్బలు తినడం ఆరోగ్యానికి మంచిది. ఆలివ్ ఆయిల్: ఆలివ్ ఆయిల్‌లో ఒలియోకాంతల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది కీళ్లలో మంటను తగ్గిస్తుంది. వంటల్లో ఆలివ్ ఆయిల్ ఉపయోగించడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుంది. తీసుకోవలసిన జాగ్రత్తలు: సరైన ఆహారంతో పాటు వ్యాయామం కూడా చాలా ముఖ్యం. రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం వల్ల కీళ్లు దృఢంగా ఉంటాయి. బరువును అదుపులో ఉంచుకోవడం కూడా చాలా అవసరం. అధిక బరువు వల్ల కీళ్లపై ఒత్తిడి పెరిగి నొప్పులు వచ్చే అవకాశం ఉంది. ధూమపానం, మద్యపానం ఆరోగ్యానికి హానికరం. వీటిని మానుకోవడం మంచిది. ఈ ఆహార పదార్థాలను మీ డైట్‌లో చేర్చుకోవడం ద్వారా కీళ్ల నొప్పుల నుంచి కొంత వరకు ఉపశమనం పొందవచ్చు. అయితే నొప్పి తీవ్రంగా ఉంటే వైద్యుడిని సంప్రదించడం మంచిది. ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, సరైన చికిత్సతో కీళ్ల నొప్పులను జయించవచ్చు.

## వేసవిలో శక్తినిచ్చే సూపర్ ఫుడ్స్ ఇవే!



చాలామంది వేసవికాలంలో ఎండ దెబ్బకు శరీరం డిహైడ్రేట్ అయ్యి శక్తిని కోల్పోయి నీరసంగా ఫీల్ అవుతూ ఉంటారు. అటువంటివారు సమ్మర్లో రోజంతా చురుకుగా ఉండడానికి శక్తినిచ్చే ఆరు రకాల సూపర్ ఫుడ్స్ ను తింటే మంచిదని డైటీషియన్లు చెప్తున్నారు. ఇక ఆ సూపర్ ఫుడ్స్ ఏంటి అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. అరటి పండ్లు అరటి పండ్లు మంచి పోషకాలతో కూడుకున్న ఆహారం. అరటి పండ్లలో పొటాషియం, కార్బోహైడ్రేట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరానికి కావలసిన శీఘ్ర శక్తిని అందిస్తాయి. వీటిని ప్రీ వర్కవుట్ ఫుడ్ గా కూడా తీసుకోవచ్చు. గ్రీన్ టీ గ్రీన్ టీ కూడా మనకు శరీరానికి కావలసిన శక్తిని ఇస్తుంది. గ్రీన్ టీ తాగితే ఇది మన శరీరంలో అలసటను తగ్గించి జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. వ్యాయామం చేసేటప్పుడు శక్తి స్థాయిలను కూడా ఇది పెంపొందిస్తుంది. కనుక ఈ సీజన్ లో గ్రీన్ టీ తాగడం ఎంతో మంచిది. పాలకూర పాలకూరలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. ఎవరైతే తక్కువ ఐరన్ స్థాయిలు కలిగి ఉంటారో వారు శక్తి హీనులుగా ఉంటారు. ఇక శక్తి వంతులుగా ఉండాలంటే కచ్చితంగా ఆహారంలో పాలకూరని భాగంగా చేసుకోవడం సూచించదగింది. చియా సీడ్స్ చియా సీడ్స్ ను కూడా మనం ఒక సూపర్ ఫుడ్ గా చెప్పుకోవాలి. చియా సీడ్స్ ను నానబెట్టి తీసుకోవడం వల్ల శక్తి వస్తుంది. ఇందులో ఉండే ఒమేగా త్రీ ఫ్యాటీ ఆసిడ్స్ మన శరీరానికి కావాల్సిన ఎనర్జీని ఇచ్చి ఎంతగానో దోహదం చేస్తాయి. డార్క్ చాక్లెట్ డార్క్ చాక్లెట్ చిన్న ముక్కను ప్రతిరోజు తింటే మన శరీరంలో రక్తప్రసరణ మెరుగుపడుతుంది. ఇది యాంటీ ఆక్సిడెంట్లను శరీరానికి అందిస్తుంది. అలసటను తగ్గించి శక్తిని పెంచుతుంది. దృష్టిని కూడా మెరుగుపరుస్తుంది. ఓట్స్ ఓట్స్ లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఓట్స్ తిన్న తర్వాత మన శరీరంలో శక్తి పెరుగుతుంది. ఇక ఎండాకాలంలో అలసటతో బాధపడేవారు, శక్తి తక్కువగా ఉందని ఇబ్బంది పడేవారు,

## ఈ అలవాట్లను మార్చుకోకపోతే.. డాక్టర్లు కూడా మిమ్మల్ని రక్షించలేరు!

బరువు పెరగడం అనేది చాలా మందిని వేధించే సమస్య. కొందరికి ఇది ఆరోగ్య సమస్యల కారణంగా సంభవించినప్పటికీ, ఎక్కువ మందికి వారి రోజువారీ అలవాట్లే ప్రధాన కారణం. మనం చేసే చిన్న చిన్న పొరపాట్లు, నిర్లక్ష్యంగా తీసుకునే ఆహారం, జీవనశైలిలో మార్పులు క్రమంగా మన బరువును పెంచుకుంటూ పోతాయి. ఈ బరువు పెంచే అలవాట్లను గుర్తిస్తే, మనం ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపవచ్చు. జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్: మొదటగా ఆహారం విషయానికి వస్తే, చాలా మంది సమయం లేకపోవడం లేదా ఇతర కారణాల వల్ల సరైన ఆహారం తీసుకోరు. దీనికి బదులుగా జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్ లేదా అధిక కేలరీలు ఉండే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకుంటారు. పిజ్జాలు, బర్గర్లు, ఫ్రెంచ్ ఫ్రైస్ వంటి ఆహారాల్లో కేలరీలు, కొవ్వులు , చక్కెరలు అధికంగా ఉంటాయి. వీటిని తరచుగా తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషకాలు అందకపోయినా, అధిక మొత్తంలో కేలరీలు మాత్రం చేరుతాయి. ఇది క్రమంగా బరువు పెరగడానికి దారితీస్తుంది. భోజనం చేసే వేళల్లో మార్పులు: తరువాత, చాలా మందికి భోజనం చేసే వేళలు కూడా సరిగా ఉండవు. ఒకరోజు ఉదయం 8 గంటలకు తింటే, మరోరోజు 11 గంటలకు తినడం వల్ల జీర్ణక్రియ వ్యవస్థ గందరగోళానికి గురవుతుంది. అంతేకాకుండా, చాలా మంది రాత్రిపూట ఆలస్యంగా భోజనం చేస్తారు. రాత్రిపూట జీర్ణక్రియ నెమ్మదిగా జరుగుతుంది కాబట్టి, ఆహారం సరిగ్గా జీర్ణం కాక కొవ్వుగా మారే అవకాశం ఉంది. నిద్రపోయే ముందు భారీగా తినడం కూడా బరువు పెరగడానికి ఒక ముఖ్య కారణం. శీతల పానీయాలు: ఇక పానీయాల విషయానికి వస్తే, చాలా మంది శీతల పానీయాలు, చక్కెర కలిపిన జ్యూస్‌లు , ఇతర తీపి పానీయాలను ఎక్కువగా తాగుతారు. వీటిలో కేలరీలు చాలా ఎక్కువగా ఉంటాయి, కానీ పోషక విలువలు మాత్రం శూన్యం. వీటిని తాగడం వల్ల కడుపు నిండిన భావన కలగదు, కానీ శరీరానికి మాత్రం అధిక మొత్తంలో చక్కెర చేరుతుంది. ఇది ఇన్సులిన్ నిరోధకతకు దారితీసి, బరువు పెరగడానికి కారణమవుతుంది. నీరు తక్కువగా తాగడం కూడా బరువు పెంచే అలవాట్లలో ఒకటి. నీరు జీవక్రియను మెరుగుపరచడానికి మరియు ఆకలిని నియంత్రించడానికి సహాయపడుతుంది. కాబట్టి, తగినంత నీరు తాగకపోతే శరీరం డీహైడ్రేషన్‌కు గురవ్వడమే కాకుండా, బరువు కూడా పెరిగే అవకాశం ఉంది.

# మార్కెట్

## హైదరాబాద్‌లో భారత్ బయోటెక్

### కణ, జన్యు చికిత్స కేంద్రం

### జీనోమ్ వ్యాలీలో రూ.650 కోట్లతో ఏర్పాటు

హైదరాబాద్, మార్చి 20: హైదరాబాద్ ఆధారిత ఔషధ రంగ దిగ్గజం భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్.. ఇక్కడి జీనోమ్ వ్యాలీలో దాదాపు రూ.650 కోట్లతో ఓ కణ, జన్యు చికిత్స (సీజీటీ) కేంద్రాన్ని ప్రారంభించింది. ఇది వైరల్ వెక్టర్ ప్రొడక్షన్ ఫెసిలిటీ కూడా అని గురువారం సంస్థ ప్రకటించింది. అలాగే దేశంలోనే ఇది తొలి వర్టికల్లీ ఇంటిగ్రేటెడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కావడం గమనార్హం. 'సైంటిఫిక్ సవాళ్లను ఎదుర్కోవడంలో మా ఈ సెల్, జీన్ థెరపీ ఫెసిలిటీ ఓ నూతన శకానికి నాంది పలికింది' అని ఈ సందర్భంగా కంపెనీ ఓ ప్రకటనలో తెలియజేసింది. ప్రధానంగా క్యాన్సర్ వంటి జెనెటిక్ వ్యాధుల చికిత్సలో ఇక మంచి ఫలితాలు రాగలవన్న ఆశాభావాన్ని వెలిబుచ్చింది. ప్రస్తుతం జన్యు, కణ చికిత్సలు పెరిగిపోయాయని భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ కృష్ణ ఎల్లా తెలిపారు. తమకున్న అనుభవంతో వైద్య విధానాన్ని మరింత మెరుగుపరుస్తామన్న ఆయన వైరల్ వ్యాక్సిన్ల తయారీలో తమ ప్రతిష్ఠ ఈ సీజీటీతో మరింత పెరగగలదన్న విశ్వాసాన్ని కనబర్చారు. ఆంకాలజీ, అరుదైన వ్యాధుల చికిత్సలపై తాము దృష్టి పెట్టామని, అందులో భాగంగా తెచ్చినదే ఈ సీజీటీ అని భారత్ బయోటెక్ చీఫ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ రాచెస్ ఎల్లా అన్నారు. కాగా, ఈ కేంద్రం 50 వేల చదరపు అడుగుల్లో విస్తరించి ఉన్నది.



## మార్కెట్ కళకళ.. సెన్సెక్స్, నిఫ్టీ దూకుడు! ఇన్వెస్టర్ల పండగ!!



వరుసగా ఐదవ రోజు కూడా మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ , నిఫ్టీ సూచీలు రెండూ కూడా ఉత్సాహంగా ట్రేడింగ్ ముగించాయి. రూపాయి బలం పుంజుకోవడం, విదేశీ పెట్టుబడిదారులు అమ్మకాలు తగ్గించడం, ఇంకా సమాచార సాంకేతిక రంగం షేర్లు మళ్లీ పుంజుకోవడం వంటి కారణాల వల్ల మార్కెట్ సెంటిమెంట్ ఒక్కసారిగా మారిపోయింది. నిఫ్టీ 50 సూచీ అయితే ఏకంగా 23,400 మార్కును కూడా తాకింది! గత రెండు నెలల్లో ఈ స్థాయికి చేరుకోవడం ఇదే మొదటిసారి. గత వారం రోజులుగా భారతీయ స్టాక్ మార్కెట్లో కనిపిస్తున్న ఈ టర్న్‌అరౌండ్‌కు ప్రధాన కారణం విదేశీ ఇన్వెస్టర్ల సెంటిమెంట్ మారడమే. నెల రోజుల పాటు అమ్మకాలు చేసిన %ఖీ××%లు గత మూడు సెషన్లలో రెండు సార్లు కొనుగోలుదారులుగా మారారు. మార్కెట్‌లో కొనుగోళ్ల జోరు.. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 557.45 పాయింట్లు పెరిగి 76,905.51 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 159.75 పాయింట్లు లాభంతో 23,350.40 వద్ద ముగిసింది. మార్కెట్లో కొనుగోళ్ల జోరు స్పష్టంగా కనిపించింది. మొత్తం 2,684 స్టాకులు లాభపడగా, 1,179 స్టాకులు నష్టపోయాయి. 118 స్టాకలలో మాత్రం ఎలాంటి మార్పు లేదు. ఇక వారం మొత్తం చూసుకుంటే, నిఫ్టీ 50, సెన్సెక్స్ రెండూ కూడా 4 శాతానికి పైగా పెరిగాయి. గత నాలుగేళ్లలో ఇదే అత్యుత్తమ వారం అని విశ్లేషకులు వెల్లడించారు. లాభపడ్డ %ఉ% నష్టపోయిన స్టాక్స్ ఇవే! సెక్టార్ల వారీగా చూస్తే, 13 ప్రధాన రంగాల సూచీలలో 11 లాభాల్లో ముగిశాయి. నిఫ్టీలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఎన్‌టీపీసీ, ఓఎన్‌జీసీ, బజాజ్ ఫైనాన్స్ , బీపీసీఎల్ వంటి స్టాక్‌లు టాప్ గెయినర్లుగా నిలిచాయి. ఒక్కో స్టాక్ దాదాపు 3 శాతం వరకు పెరిగింది. మరోవైపు ఎం%ఉ%ఎమ్, విప్రో, హిందాల్కో ,ఇన్ఫోసిస్ స్టాక్‌లు 1-2 శాతం వరకు పడిపోయి నష్టపోయిన స్టాక్‌లుగా నిలిచాయి. మార్కెట్ జోష్‌కు రూపాయి విలువ వరుసగా ఎనిమిదవ సెషన్‌లో కూడా పెరగడం సానుకూల సెంటిమెంట్‌ను మరింత పెంచింది. ఇది ఈక్విటీ మార్కెట్లోకి పెట్టుబడులు పెరగడానికి దోహదపడింది. అంతేకాకుండా, మార్కెట్ పడిపోయిన తర్వాత లార్జ్-క్యాప్ స్టాక్‌ల వాల్యుయేషన్లు ఆకర్షణీయంగా ఉండటం కూడా ఇన్వెస్టర్లను ఆకర్షించింది. ప్రస్తుతం మనం చూస్తున్నది ఒక తాత్కాలిక ర్యాలీ మాత్రమే. ఇది 23,300-23,500 స్థాయిల వరకు కొనసాగవచ్చు మార్కెట్ నిపుణులు

## పాన్ కార్డు పోయిందా? చింతించకండి..

### నిమిషాల్లో డూప్లికేట్ కోసం అప్లై చేయండి ఇలా!



పాన్ కార్డు పోగొట్టుకోవడం లేదా దొంగిలించబడటం అనేది ఈ రోజుల్లో చాలా సాధారణం అయిపోయింది. ఎన్నో ముఖ్యమైన పత్రాలతో పాటు పాన్ కార్డును కూడా ఎక్కడో పెట్టి మర్చిపోవడం లేదా అనుకోకుండా పోగొట్టుకోవడం సహజంగా జరుగుతుంది. కానీ పాన్ కార్డు లేకపోతే అనేక పనులు ఆగిపోతాయి. ముఖ్యంగా ఆర్థికపరమైన విషయాల్లో చాలా చిక్కులు ఎదురవుతాయి. అయితే మీరు అస్సలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు! పోగొట్టుకున్న పాన్ కార్డును తిరిగి పొందడం ఇప్పుడు చాలా సులభం. మీరు ఇంట్లో కూర్చొనే ఆన్‌లైన్‌లో డూప్లికేట్ పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. పాన్ కార్డు కేవలం ఒక ప్లాస్టిక్ ముక్క మాత్రమే కాదు, అది మీ గుర్తింపుకు చిహ్నం. ఈ రోజుల్లో పాన్ కార్డు ఒక ముఖ్యమైన పత్రంగా మారిపోయింది. గ్యాస్ కనెక్షన్ తీసుకోవాలన్నా, కొత్తగా బ్యాంకు ఖాతా తెరవాలన్నా, ఇంకా మరెన్నో ముఖ్యమైన పనులకు పాన్ కార్డు తప్పనిసరి. ఒకవేళ మీ పాన్ కార్డు పోతే, మీరు చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది. అందుకే, పాన్ కార్డు పోగొట్టుకున్న వెంటనే డూప్లికేట్ కోసం దరఖాస్తు చేసుకోవడం చాలా ముఖ్యం. ఇప్పుడు డూప్లికేట్ పాన్ కార్డు కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలుసుకుందాం రండి.. డూప్లికేట్ పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే విధానం: అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించండి: మొదటగా మీరు (నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్) అధికారిక వెబ్‌సైట్‌కు వెళ్లాలి. వెబ్‌సైట్ చిరునామాను గూగుల్‌లో సెర్చ్ చేసి తెలుసుకోవచ్చు లేదా నేరుగా వెబ్‌సైట్‌కు వెళ్లడానికి ప్రయత్నించవచ్చు. వివరాలను నమోదు చేయండి: వెబ్‌సైట్‌లో డూప్లికేట్ పాన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే విభాగానికి వెళ్లండి. అక్కడ మీరు మీ పాన్ కార్డు నంబర్ (గుర్తుంటే), మీ 10 అంకెల ఆధార్ నంబర్ మరియు, మీ పుట్టిన తేదీని నమోదు చేయాలి. మీరు ఈ వివరాలను జాగ్రత్తగా , సరిగ్గా నమోదు చేయాలి.

# జగన్ చర్యలతో అమరావతికి ఐదేళ్ల కష్టం

**భూములిచ్చిన రైతులను నానా యాతన పెట్టారు**

**మూడు రాజధానుల పేరుతో డ్రామాలు**

**మండిపడ్డ మంత్రి కొలుసు పార్థసారధి**



అమరావతి,జనవరి 17 : మూడు రాజధానుల పేరుతో జగన్ రెడ్డి ఐదేళ్లు కాలయాపన చేసి, ఒక్క రాజధానినైనా నిర్మించకుండా రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టారని మంత్రి కొలుసు పార్థసారథి ఘాటు విమర్శలు చేశారు. ఇది తుగ్లక్ పాలనకు సమానమని మంత్రి విమర్శించారు. ఈ మేరకు రాజధాని అమరావతి అభివృద్ధిపై మంత్రి కొలుసు పార్థసారథి కీలక వ్యాఖ్యలు చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2014లో అసెంబ్లీలో అమరావతికి మద్దతిచ్చిన జగన్ రెడ్డి.. 2019 ఎన్నికల ముందు అక్కడే ఇల్లు కట్టుకున్నానని ప్రజలను నమ్మించి, అధికారంలోకి వచ్చాక దానిని నాశనం చేయడం ఘోరమైన నమ్మకద్రోహమని ఆరోపించారు. సీఎం చంద్రబాబు పిలుపునకు 29వేల మంది రైతులు ముందుకు వచ్చి 33వేల ఎకరాల భూమిని రాజధాని కోసం స్వచ్ఛందంగా ఇచ్చారని, ఇది ప్రపంచంలోనే అరుదైన సంఘటన అని మంత్రి అన్నారు. అమరావతిని ఎడారిగా, శ్మశానంతో పోల్చి, కమ్మరావతి – బ్రహ్మరావతి వంటి నీచమైన మాటలతో ప్రాంతీయ, కుల విద్వేషాలు రెచ్చగొట్టడంతో వైసీపీ రాజకీయాల స్థాయిని బయటపెట్టిందని పేర్కొన్నారు. న్యాయం కోసం శాంతియుతంగా ఉద్యమించిన రైతులు, మహిళలపై పోలీసులతో దౌర్జన్యం చేయించి ఉద్యమాన్ని అణచివేయాలని జగన్ ప్రభుత్వం ప్రయత్నించిందని మంత్రి ఆరోపణలు చేశారు. 2024 ఎన్నికల్లో ప్రజల కోపానికి గురైన వైసీపీకి అమరావతి పాపమే శాపమైందని.. కేవలం 11 సీట్లకే పరిమితమైందన్నారు. నదీ ఒడ్డున రాజధాని ఎందుకు అని ప్రశ్నించే జగన్‌కు.. లండన్, వాషింగ్టన్, కైరో వంటి ప్రపంచ నగరాలన్నీ నదీ తీరాల్లోనే అభివృద్ధి చెందిన విషయం తెలియకపోవడం ఆశ్చర్యకరమని మంత్రి వ్యాఖ్యానించారు. ఒకప్పుడు.. సైబరాబాద్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దిన చంద్రబాబు.. ఇప్పుడు అమరావతిని క్వాంటం వ్యాలీగా మార్చి రాష్ట్ర భవిష్యత్తుకు దారి చూపిస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వరల్డ్ బ్యాంక్, ఏడీబీ, నాబార్డ్ నుంచి వేల కోట్ల నిధులు సమీకరించి అమరావతిలో పనులను వేగంగా ప్రారంభించిందని మంత్రి తెలిపారు. అమరావతిలో భూముల విలువ పెరగడం ద్వారా వచ్చే ఆదాయంతో రాయలసీమ, ఉత్తరాంధ్ర సహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న స్పష్టమైన ఆర్థిక దృష్టితో ప్రభుత్వం ముందుకెళ్తోందని వివరించారు. 30 శాతం గ్రీన్ కవర్, 10 శాతం వాటర్ బాడీస్‌తో.. పర్యావరణానికి హానిలేకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో రాజధాని నిర్మాణం జరుగుతోందని మంత్రి చెప్పారు. పీపీపీ విధానంలో పెట్టుబడులు పెడితే అరెస్ట్ చేస్తామని బెదిరించడం ద్వారా జగన్ పెట్టుబడిదారులను భయపెట్టి, గతంలో సోలార్ ఒప్పందాల రద్దుతో రాష్ట్రానికి వేల కోట్ల నష్టం తెచ్చారని పార్థసారథి ఆరోపించారు. జగన్‌కు నిజంగా ప్రజలపై ప్రేమే ఉంటే.. రాజధానిపై ఉన్న సందేహాలను అసెంబ్లీకి వచ్చి చర్చించాలి తప్ప, బయట ఉండి విష ప్రచారం చేయడం సరైన రాజకీయ ధోరణి కాదన్నారు. 2027–28 నాటికి అంతర్జాతీయ స్థాయి అమరావతిని, అలాగే పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో ముందుకు నడిపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

## ముంబయిలో కుట్ర పూరిత గెలుపు

**యుద్ధం ఇప్పుడే మొదలయ్యింది**

**కార్యకర్తల భేటీలో ఉద్ధవ్ ఠాక్రే**

ముంబై,జనవరి17 : యుద్ధం ముగియలేదని.. ఇప్పుడే మొదలయ్యిందని శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే పేర్కొన్నారు. బిజెపి వారి కుట్రలను త్వరలోనే బయటపెడతామన్నారు. మహారాష్ట్ర స్థానిక సంస్థల ఎన్నికల్లో స్థానికంగా బలంగా ఉన్న పవార్, ఠాక్రే కుటుంబాలను వెనక్కి నెట్టి భాజపా నేతృత్వంలోని కూటమి ఘన విజయం సాధించింది. ఈ నేపథ్యంలో శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే తమ కార్యకర్తలతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక ఎన్నికల్లో అవకతవకలు జరిగినందువల్లే భాజపా గెలుపొందిందని ఆరోపించారు. కుట్రపూరితంగా, అక్రమంగా విజయం సాధించిందన్నారు. ముంబయిని పూర్తిగా తాకట్టు పెట్టాలని ఆ పార్టీ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఈ ఒక్క గెలుపుతో తమను నిర్వీర్యం చేశామని భాజపా నేతలు భావిస్తున్నారని, అది ఎప్పటికీ సాధ్యం కాదని ఉద్ధవ్ ఠాక్రే అన్నారు. ఎన్నికల్లో తమ పార్టీ 64 స్థానాలను కైవసం చేసుకుందని తెలిపారు. ముంబయిలో శివసేన (ఐఃఃు) నుంచి మేయర్‌ను నియమించాలనేది తన కల అని.. అదే జరగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు. 227 స్థానాలున్న బృహన్‌ముంబయి (బీఎంసీ)లో అధికారాన్ని కైవసం చేసుకోవడానికి అవసరమైన 114 సీట్ల కన్నా అధికంగానే భాజపా, శివసేన (శిందే)తో కూడిన కూటమి సీట్లు సాధించింది. భాజపా 89 స్థానాల్లో విజయం సాధించింది. శిందే నేతృత్వంలోని శివసేన 27 చోట్ల గెలుపొందింది. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన 64 స్థానాలను కైవసం చేసుకుంది. రెండు దశాబ్దాల పాటు విడివిడిగా ఉన్న ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రే (మహారాష్ట్ర నవ నిర్మాణ సేన) ఈ ఎన్నికలకు ముందే జట్టుకట్టినా మహాయుతి విజయాన్ని అడ్డుకోలేకపోయారు.

## మంత్రి వివేక్ ఒంటెద్దు పోకడలు

**పార్టీకి రాజీనామా చేసిన కాంగ్రెస్ నేత**

మంచిర్యాల,జనవరి17 : మున్సిపల్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు ఉమ్మడి జిల్లా జడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. మంత్రి వివేక్ వెంకటస్వామి పార్టీలో ఒంటెద్దు పోకడలు, ఏకపక్ష నిర్ణయాలు, నియంత పరిపాలన తీవ్రంగా కలిచి వేసిందని పేర్కొంటూ కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు. త్వరలో తాను అనుచరులతో కలిసి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు రాజిరెడ్డి ప్రకటించారు. ఈ సందర్భంగా రాజీనామాకు గల కారణాలను లేఖ ద్వారా వివరించారు. కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, చెన్నూర్ మేనిఫెస్టోకు ఆకర్షితుడినై గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ , స్థానిక శాసన సభ్యుడు గడ్డం వివేక్ విజయానికి విశేష కృషి చేశానని తెలిపారు. అయితే కాంగ్రెస్ ఇచ్చిన హామీలో ఏ ఒక్క హామీని నెరవేర్చ లేదని ఆరోపించారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ హామీలపై ప్రజల్లో తీవ్రమైన ప్రతికూల పరిస్థితులు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. మంత్రి వివేక్ చెన్నూరు నియోజకవర్గానికి ప్రత్యేకంగా రూపొందించిన మేనిఫెస్టోలో ఒక్క హామీని నెరవేర్చ లేదని దుయ్యబట్టారు. దీనికి తోటు నియోజకవర్గంలో 45 వేల మంది యువకులకు ఉద్యోగాలు, మైనింగ్ ఇన్సిట్యూట్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, అగ్రిరీసెర్చ్ సెంటర్, అగ్రికల్చర్ మినీ యూనివర్సిటీ, కరకట్టల నిర్మాణం హామీ ముందడుగు పడలేదని వెల్లడించారు. ఎమ్మెల్యే వివేక్‌పై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత, వివేక్ విడుదల చేసి మోసపూరిత మేనిఫెస్టోతో ప్రజల్లో విశ్వసనీయతను కోల్పోవడంతోనే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు.

## టిడిపి నేతల వైసిపి గుండాల దాడి

**ఒకరు మృతి..మరో ఇదదరికి తీవ్ర గాయాలు**

కాకినాడ,జనవరి17 : జిల్లాలోని తుని ప్రాంతంలో వైసీపీ నేతలు బరితెగించారు. కోటనందూరు మండలం అల్లిపూడి గ్రామంలో కనుమ పండుగ రోజు ఘోరం జరిగింది. పుట్టినరోజు వేడుకలకు వెళ్లి తిరిగి వస్తున్న టీడీపీ నేతలపై కొందరు వైసీపీ కార్యకర్తలు విచక్షణా రహితంగా దాడి చేశారు. మాటువేసి మరీ కత్తులు, ఇనుప రాడ్లతో ముగ్గురు వ్యక్తులపై దాడి చేశారు. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వైసీపీ నేతల దాడిలో లాలం బంగారయ్య(30) అనే టీడీపీ నేత తీవ్రమైన కత్తిపోట్లతో నేలకొరిగాడు. వెంటనే ఆయన్ను తుని ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కొద్ది నిమిషాల్లోనే మృతిచెందాడు. గాయపడిన ఇద్దరు టీడీపీ నేతలు ప్రస్తుతం.. కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో శ్రీరామ్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. శుక్రవారం రాత్రి ఓ టీడీపీ నేత పుట్టినరోజు వేడుకల నుంచి తిరిగి వస్తుండగా.. సుమారు 20 మంది మంది కలిసి కత్తులు, ఇనుప రాడ్లతో వారిపై దాడి చేశారు. ఇరు వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ జరిగింది. ఘటన తర్వాత గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు పరారైనట్లు సమాచారం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. టీడీపీ నేతలపై దాడితో ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. దీంతో ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. టీడీపీ నేతలపై దాడి ఘటన జిల్లాలో తీవ్ర కలకలం రేపుతోంది.

## ఏప్రిల్ కోటా సేవల విడుదలకు రంగం సిద్ధం

**19న విడుదల చేయనున్న టిటిడి**

తిరుమల,జనవరి17 : భక్తుల సౌకర్యార్థం 2026 ఏప్రిల్ నెలకు సంబంధించిన శ్రీవారి ఆర్జిత సేవలు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన టికెట్లను ఈ నెల 19న ఉదయం 10 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఎలక్ట్రానిక్ లక్కీడిప్ రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల 21న ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ–టికెట్లు పొందిన వారు జనవరి 21 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే.. టికెట్లు మంజూరవుతాయి. 22న ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా, సాలకట్ల తెప్పోత్సవాలు, సాలకట్ల వసంతోత్సవాల టికెట్లు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను మధ్యాహ్నం 3 గంటలకు తితిదే ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. 23న ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను విడుదల చేయనున్నారు. ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. 24న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశదర్శనం రూ.300 టికెట్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అదే రోజు.. మధ్యాహ్నం 3 గంటలకు తిరుమల, తిరుపతిలో అ÷–దదె గదుల బుకింగ్ కోటాను విడుదల చేస్తారు. మార్చి నెలకు సంబంధించిన శ్రీవారి సేవ, పరకామణి సేవ కోటాను ఈనెల 27న మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. భక్తులు వెబ్‌సైట్‌లో మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని తితిదే అధికారులు సూచించారు.

## పునర్విభజన పేరుతో జిల్లాల రద్దు

**ప్రభుత్వ ప్రయత్నాలను తిప్పి కొట్టాలి**

**పార్టీ శ్రేణులకు కెటిఆర్ పిలుపు**

హైదరాబాద్,జనవరి17 : ప్రజలకు పరిపాలన ఫలాలు అందకుండా జిల్లాల పునర్విభజన పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం జిల్లాల రద్దుపై చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు ఉద్యమ కార్యాచరణ చేపట్టాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఉమ్మడి నల్లగొండ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, ముఖ్య నేతలతో ఆయన మాట్లాడారు. పాలమూరు, నల్గొండ జిల్లాలకు సంబంధించిన పాలమూరు?రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పనుల్లో జరుగుతున్న ఆలస్యం, కృష్ణా జలాల వాటా వంటి కీలక అంశాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. పాలమూరు జిల్లాలో ఉన్న ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని అక్కడి ప్రజలకు ప్రభుత్వం యొక్క సేవలు, అభివృద్ధి అందాల్సిన అవసరాలను వివరించాలన్నారు. కేసీఆర్ పరిపాలన, వికేంద్రీకరణ అనే దృక్పథంతో పాలమూరును అనేక జిల్లాలుగా మార్చిన విషయాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. పాలమూరు జిల్లా బిడ్డను అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి ఆ ఉమ్మడి జిల్లాపై కుట్రతో జిల్లాలను రద్దు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ రెండు అంశాలపై ఎక్కడికక్కడ ప్రజలను సమీకరించే విధంగా చైతన్యపరిచేలా వివిధ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రోవైపు రానున్న మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ప్రతి మున్సిపాలిటీ వారీగా ప్రత్యేక కార్యాచరణతో, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా సమష్టిగా ముందుకు పోవాలని సూచించారు. జిల్లాలో ఉన్న ఏకైక కార్పొరేషన్ అయిన మహబూబ్‌నగర్ పట్టణంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని వెల్లడించారు. దీంతోపాటు 20 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న హామీల అమలు వైఫల్యాన్ని, మోసాన్ని ఎండగట్టాలని సూచించారు. ఒకప్పుడు తీవ్రంగా వెనుకబడిన నల్లగొండ జిల్లాను బీఆర్ఎస్ హయాంలో ఏ విధంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామో ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రస్తుతం ఇద్దరు మంత్రులు ఉన్న నల్లగొండ జిల్లాకు ప్రత్యేకంగా చేసిందేమీ లేదని విమర్శించారు. నల్లగొండ పట్టణాన్ని అభివృద్ధి చేసిన తీరును పట్టణ ప్రజలకు వివరించాలన్నారు. గతంలో టీయూఎఫ్ఐడీసీ , పురపాలక శాఖ ద్వారా గతంలో అనేక వందల కోట్ల రూపాయలతో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రస్తావించాలన్నారు. ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాలో మొన్నటి పంచాయతీ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించారని, అదే స్ఫూర్తిని మున్సిపల్ ఎన్నికల్లో కొనసాగించాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీశ్ రెడ్డి , పలువురు పాల్గొన్నారు.

## ఇరాన్ అల్లర్ల కుట్రదారు ట్రంప్

**తీవ్ర విమర్శలు చేసిన ఇరాన్ సుప్రీం ఖమేని**

టెహ్రాన్,జనవరి17 : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నిరసనలకు మద్దతిచ్చిన ట్రంప్‌ను నేరస్థుడిగా పరిగణిస్తున్నామన్న ఆయన.. ఇరాన్‌లో ఆందోళనలకు, ప్రాణ నష్టానికి ఆయనే కారణమని ఆరోపించారు. ఇటీవల చోటు చేసుకున్న ఆందోళనల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఖమేనీ తొలిసారి ప్రస్తావించారు. ఇటీవల ఆందోళనల వెనుక అమెరికా కుట్ర దాగుంది. ఇరాన్‌ను అణచివేయడం, ఆధిపత్యం చలాయించడం వారి లక్ష్యం. ఆందోళనల వేళ అమెరికా అధ్యక్షుడు స్వయంగా వ్యాఖ్యలు చేస్తూ నిరసనకారులకు మద్దతు ప్రకటించారు. అందుకే ఆయన్ను నేరస్థుడిగా పరిగణిస్తున్నాం. నిరసనల్లో పాల్గొన్నవారు అమెరికా కోసం పనిచేసిన వారే. విద్యా సంస్థలు, ప్రార్థనా మందిరాలను ధ్వంసం చేశారు. ఎంతో మందిని గాయపరిచారు‘ అని సుప్రీం లీడర్ ఖమేనీ పేర్కొన్నారు. ఆందోళనకారులు విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న మందుగుండు సామగ్రిని వినియోగించారని ఖమేనీ ఆరోపించారు. యుద్ధం వైపు దేశాన్ని తీసుకెళ్లాలని అనుకోవడం లేదన్నారు. నేరస్థుల్లో విదేశీయులూ ఉన్నారన్నారు. నేరస్థులెవరినీ విడిచిపెట్టబోమని, కేసులను కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. ఆందోళనల్లో పాల్గొన్న వారిలో దాదాపు 800 మందికి ఇరాన్ మరణశిక్ష అమలు చేస్తుందనే వార్తలు వచ్చాయి. అమెరికా హెచ్చరికల నేపథ్యంలో గల్ఫ్ దేశాలు జోక్యం చేసుకోవడం తదితర పరిణామాల తర్వాత ఇరు దేశాలు వెనక్కి తగ్గినట్లు కనిపించింది. ఈ నేపథ్యంలో ఖమేనీ స్పందిస్తూ అమెరికాపై తీవ్ర వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు ఇరాన్ హింసాత్మక ఘటనల్లో ఇప్పటి వరకు 3వేలకు పైగా మరణించినట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడించాయి.

## పెట్టుబడులే లక్ష్యంగా దావోస్‌కు సిఎం చంద్రబాబు

**నేడు బయలుదేరనున్న ప్రత్యేక బృందం**

అమరావతి,జనవరి17 : ఆంధ్రప్రదేశ్‌కి పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యంగా.. ఇప్పటికే పలు మార్లు విదేశీ పర్యటనలకు వెళ్లిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.. ఆదివారం దావోస్ పర్యటనకు బయల్దేరనున్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ పర్యటనలో ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడమే ఈ పర్యటన ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పేర్కొంది. దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో తొలి రెండు రోజుల పాటు సీఎం చంద్రబాబు 20కు పైగా దేశాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలతో భేటీ అయి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడి అవకాశాలపై చర్చించనున్నారు. ఇక, 4 రోజుల పర్యటనలో మొత్తం 36 కార్యక్రమాల్లో సీఎం చంద్రబాబు పాల్గొననున్నట్లు అధికారులు తెలిపారు. ఐబీఎం , గూగుల్ క్లౌడ్, ఏపీ మోలర్ మెర్స్క్ వంటి ప్రముఖ సంస్థల సీఈవోలతో సీఎం చంద్రబాబు ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. అలాగే స్విట్జర్లాండ్, యూఏఈతో పాటు పలు దేశాల ప్రభుత్వ ప్రతినిధులతో భేటీ కానున్నారు. రాష్ట్రంలో ఐటీ, పరిశ్రమలు, గ్రీన్ ఎనర్జీ, మౌలిక సదుపాయాల రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం చంద్రబాబు అంతర్జాతీయ వేదికపై వివరించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు అనుకూల రాష్ట్రంగా నిలబెట్టడమే లక్ష్యంగా ఈ పర్యటన జరగనుందని అధికారులు తెలిపారు. దావోస్ పర్యటన పూర్తయ్యాక ఈ నెల 23న సీఎం చంద్రబాబు అమరావతికి తిరిగి రానున్నారని వెల్లడించారు.

## తిరుగు ప్రయాణంలో ఎపి ప్రజలు

**ప్రయాణికులతో కిటకిటలాడిన బస్టాండ్లు**

విజయవాడ,జనవరి17 : సొంత గ్రామాల్లో సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్న ప్రజలు తిరిగి నగరబాట పట్టారు. ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనం అయ్యారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని ప్రధాన నగరాల బస్ స్టేషన్లు ప్రయాణికులతో నిండిపోయాయి. వివిధ ఆర్టీసీ బస్ కాంప్లెక్స్‌లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఇక.. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉన్న రూట్లలో ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. స్పెషల్ బస్సుల్లో కూడా సాధారణ ఛార్జీలే వసూళ్లు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. దీంతో ఆర్టీసీ బస్సులలో ప్రయాణించేందుకే ప్రజలు మొగ్గుచూపుతున్నారు. మరోవైపు విజయవాడ – హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతోంది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ వై–జంక్షన్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తప్పాయి. సర్వీస్ రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేశారు. ఆ ప్రాంతంలో తాత్కాలిక రోడ్లను వేశారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణం సాఫీగా సాగుతోంది. వాహనాల సంఖ్య పెరిగినా ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రయాణాలు ముందుకు సాగుతున్నాయి. అధికారులు డ్రోన్ కెమెరాలు, సీసీటీవీలతో ట్రాఫిక్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

## తెలంగాణలో భారీగా ఐపీఎస్‌లు బదిలీ

**విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఐజీగా అభిషేక్ మహంతి**

హైదరాబాద్ : తెలంగాణలో భారీగా ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. మున్సిపల్ షెడ్యూల్ విడుదలకు ముందే అధికారుల బదిలీ జరగడం విశేషం. ఈ క్రమంలో 20మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఐజీగా అభిషేక్ మహంతి నియమితులయ్యారు. లాజిస్టిక్స్ ఎడిగా గజారావు భూపాల్, ఇంటెలిజెన్స్ డిఐజిగా ఆర్.భాస్కరన్, ఫ్యూచర్ సిటీ అడిషనల్ సీపీగా చందన దీప్తి, సైబరాబాద్ డిసిపిగా టి.అన్నపూర్ణ, ట్రాఫిక్–3 డిసిపిగా రాహుల్ హెగ్డే బదిలీ అయ్యారు. అలాగే అఎఆ ఎస్పీగా ఆర్.వెంకటేశ్వర్లు, హైదరాబాద్ క్రైమ్ డిసిపిగా ఎస్.చైతన్యకుమార్, ట్రాఫిక్–1 డిసిపిగా అవినాష్ కుమార్, ట్రాఫిక్–2 డిసిపిగా కాజల్, సైబరాబాద్ కమిషనరేట్ డిసిపిగా శేషాద్రిని రెడ్డి, మల్కాజ్‌గిరి కమిషనరేట్ డిసిపిగా రాహుల్ రెడ్డి, ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ డిసిపిగా శివం ఉపాధ్యాయ, మల్కాజ్‌గిరి ట్రాఫిక్–2 డిసిపిగా వి.శ్రీనివాసులు బదిలీ అయ్యారు.

## కృష్ణానగర్‌లో పేలిన వాషిగ్ మెషిన్

**పేలుడు ధాటికి ముక్కలైన మెషిన్**

హైదరాబాద్,జనవరి17 : నగరంలో వాషింగ్ మెషిన్ పేలుడు ఘటన కలకలం రేపింది. ఇటీవల.. అమీర్‌పేటలోని ఓ ఇంట్లో వాషింగ్ మెషిన్ పేలిన ఘటన మరువక ముందే కృష్ణానగర్‌లో అలాంటి ఘటనే చోటు చేసుకుంది. మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో రన్నింగ్‌లో ఉన్న వాషింగ్ మెషిన్ ఒక్కసారిగా పేలింది. బట్టలు ఉతకేందుకు.. మెషిన్ ఆన్ చేసి ఉంచగా.. అకస్మాత్తుగా పేలుడు సంభవించింది. రన్నింగ్‌లో ఉండగానే భారీ శబ్దంతో పేలిపోయింది. పేలుడు ధాటికి ఆ వాషింగ్ మిషన్ ముక్కలు ముక్కలైంది. అయితే.. ఘటనా సమయంలో వాషింగ్ మెషిన్ దగ్గర ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పేలుడు ప్రభావంతో ఇంట్లోని వస్తువులు దెబ్బతిన్నాయి. ఒక్కసారిగా వాషింగ్ మెషిన్ పేలడంతో ఇంట్లోని వారు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. కాగా.. ఇటీవల కాలంలో ఇలాంటి ఘటనలు హైదరాబాద్‌లో తరుచుగా చోటు చేసుకున్న విషయం తెలిసిందే. గత నవంబర్‌లోనూ అమీర్‌పేట్‌లోని ఒక ఇంటి బాల్కనీలో వాషింగ్ మెషిన్ రన్నింగ్‌లో ఉండగా భారీ శబ్దంతో పేలి తునాతునకలైంది. ఆ ఘటనలోనూ ఎవరూ మెషిన్ దగ్గర లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. అలాగే.. డిసెంబర్ 2025లో ఎస్‌ఆర్ నగర్ పరిధిలో వాషింగ్ మెషిన్ పేలిన ఘటనలో కంపెనీపై కేసు నమోదైంది. ఇలా తరచుగా వాషింగ్ మెషిన్‌లు పేలుతుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్న పరిస్థితి.

## గ్రామస్థాయిలో ఉద్యోగుల అటెండెన్స్

**పేస్ రికగ్నేషన్‌కు ప్రభుత్వం నిర్ణయం**

అమరావతి,జనవరి17 : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల పని తీరును మరింత పర్యవేక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగుల అటెండెన్స్ కోసం ఫేస్ రికగ్నిషన్ ఆధారిత మొబైల్ యాప్‌ను తప్పనిసరి చేయాలని నిర్ణయించింది. ఇకపై ఈ యాప్ ద్వారా హాజరు నమోదు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. కార్యాలయ సమయాలను ఖచ్చితంగా పాటించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆలస్యం, గైర్హాజరు లాంటి అంశాలపై కఠిన చర్యలు తీసుకునే ఛాన్స్ ఉందని పేర్కొన్నారు. ఇక, ప్రస్తుతం రీ–సర్వే కార్యక్రమాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు మాత్రం ఈ అటెండెన్స్ యాప్ నుంచి తాత్కాలిక మినహాయింపు ఇవ్వనున్నట్లు ఏపీ ప్రభుత్వం తెలిపింది. ఫీల్డ్‌లో పని చేస్తున్న వారి పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. కాగా, ఇటీవల కొంతమంది గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఆఫీసుల్లో అందుబాటులో ఉండటం లేదన్న ఫిర్యాదులు అధికారుల దృష్టికి వచ్చాయి. ప్రజలకు సక్రమంగా సేవలు అందడం లేదని, కార్యాలయాల్లో ఉద్యోగులు కనిపించకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి అని సర్కార్ సీరియస్‌గా తీసుకుంది.




## మత్తెక్కించేస్తున్న శాలిని పాండే

శాలిని పాండే తరవాత పెద్దగా సినిమాల్లో కనిపించలేదు. బాలీవుడ్‌లో మాత్రం అవకాశాలు దక్కించుకుంటోంది. ఈ మధ్య ఈ అమ్మడు తన ఎక్స్‌పోజింగ్‌తో కుర్రకారును మత్తెక్కిస్తోంది. తాజాగా శాలిని ఫోటోలు హాట్‌హాట్‌గా మారాయి.




## మరో భిన్నమైన కథతో ధనుష్..కర మూవీ

రెగ్యులర్ కమర్షియల్ సినిమాలకు పరిమితం కాకుండా, ఎప్పటికప్పుడు కొత్త కథలు, విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ వస్తున్న తమిళ స్టార్ ధనుష్ మరోసారి వార్తల్లో నిలిచారు. కథల ఎంపికలో తనకంటూ ప్రత్యేకమైన స్టైల్‌ను కొనసాగిస్తున్న ధనుష్, గత ఏడాది మూడు భాషల్లో సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పించాడు.గత ఏడాది తెలుగులో 'కుబేరా', తమిళంలో 'ఇడ్లీ కడాయ్', హిందీలో 'తేరే ఇష్క్ మేన్' చిత్రాల్లో నటించిన ధనుష్, ఈ మూడింటిలో 'ఇడ్లీ కడాయ్' మినహా మిగిలిన రెండు సినిమాలతో బ్లాక్‌బస్టర్ విజయాలను అందుకున్నాడు. ఈ విజయాలతో మరోసారి తన మార్కెట్‌ను మరింత పెంచుకున్న ఈ హీరో, ఇప్పుడు మరో సరికొత్త పాత్రతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఆ సినిమానే 'కర'. 'పోర్ తోజిల్' సినిమాతో సూపర్ హిట్ అందుకున్న దర్శకుడు విఘ్నేష్ రాజా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని తాజాగా సంక్రాంతి కానుకగా మేకర్స్ టైటిల్‌తో పాటు టీజర్‌ను విడుదల చేశారు. విడుదలైన టీజర్ ఒక్కసారిగా సినిమాపై అంచనాలను భారీగా పెంచింది.రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ధనుష్ ఇప్పటివరకు చేయని కొత్త రోల్‌లో కనిపించనున్నాడని టీజర్ చూస్తే స్పష్టంగా అర్థమవుతోంది. మట్టి వాసనతో కూడిన కథనం, పవర్‌ఫుల్ ప్రెజెన్స్‌తో ధనుష్ కనిపించిన తీరు అభిమానులను ఆకట్టుకుంటోంది. కథ, పాత్ర పరంగా ఈ సినిమా పూర్తిగా భిన్నంగా ఉండబోతోందనే సంకేతాలు టీజర్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి.




## మన శంకరవర్రప్రసాద్ గారు

### రూ.226 కోట్లకు పైగా గ్రాస్ వసూలు

టాలీవుడ్‌లో సంక్రాంతి సీజన్‌ను పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకున్న సినిమాగా 'మన శంకర వరప్రసాద్ గారు' నిలుస్తోంది. మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా, విజయవంతమైన దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ పండగకు విడుదలై థియేటర్లలో జోరుగా సాగుతోంది. ప్రమోషన్ల దశ నుంచే భారీ అంచనాలు ఏర్పడగా, విడుదల తర్వాత ఆ అంచనాలను వసూళ్ల రూపంలో నిజం చేస్తోంది. ముఖ్యంగా కుటుంబ ప్రేక్షకులు పెద్ద సంఖ్యలో థియేటర్లకు తరలిరావడంతో అన్ని ప్రాంతాల్లోనూ షోలు హౌస్‌ఫుల్ అవుతున్నాయి. వీకెండ్ కావడంతో కలెక్షన్లు మరింత ఊపందుకున్నాయి. ఆన్‌లైన్ టికెట్ బుకింగ్‌లోనూ ఈ సినిమానే ముందంజలో ఉంది. బుక్‌మైషో వేదికగా ఇప్పటివరకు దాదాపు 2.5 మిలియన్ల టికెట్లు అమ్ముడవడం ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు నిదర్శనం.ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ సినిమా తొలి రోజే భారీ ఓపెనింగ్‌ను నమోదు చేసింది. ఆ తర్వాత రోజురోజుకీ వసూళ్లు పెరుగుతూ మూడో రోజుకు రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌ను, నాలుగో రోజుకు రూ.200 కోట్ల క్లబ్‌ను దాటింది.




## హిట్టు కొట్టి చూపించా

వచ్చే సంక్రాంతికి మళ్లీ వస్తా: శర్వానంద్

'నారీ నారీ నడుమ మురారి'తో చెప్పి మరీ హిట్టు కొట్టాన'ని కథానాయకుడు శర్వానంద్ అన్నారు. ఈ కథ విన్న తొలిరోజు నుంచే ఇది తనకెంతో నమ్మకాన్ని కలిగించిందని.. ఈ సినిమా ఎప్పుడు విడుదల చేసినా తప్పకుండా బ్లాక్‌బస్టర్ అవుతుందని ముందే ఊహించానని.. ఇప్పుడా నమ్మకం నిజమైనందుకు ఆనందంగా ఉందని తెలిపారు. శర్వా హీరోగా నటించిన ఈ సినిమాని రామ్ అబ్బరాజు తెరకెక్కించారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సంయుక్తా మేనన్, సాక్షి వైద్య కథానాయికలు. నరేశ్, సంపత్ రాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఇటీవల విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. నిర్మాత దిల్‌రాజు, దర్శకుడు శ్రీను వైట్ల అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో శర్వానంద్ మాట్లాడుతూ.. 'ఇది నాకు చాలా ఎమోషనల్ మూమెంట్. హిట్ కొడతానని చెప్పి మరీ కొట్టాను. సంక్రాంతికి రావాలన్న నా కల నెరవేర్చినందుకు నిర్మాత అనిల్‌కు ధన్యవాదాలు. నేను చాలా రోజులుగా హిట్ కోసం ఎదురు చూస్తున్నా. నాకు ఆ హిట్ ఇచ్చిన దర్శకుడు రామ్ అబ్బరాజుకు కృతజ్ఞతలు. ఈ చిత్రానికి మరో హీరో నరేశ్. మా నాన్న పాత్ర పోషించారు. సినిమా చూసిన వాళ్లంతా 'చాలా రోజుల తర్వాత ఇంతలా నవ్వుకున్నామ'ని చెప్తుంటే ఆనందంగా అనిపించింది. నేనెప్పుడు సంక్రాంతికి వచ్చినా అన్ని సినిమాలు ఆడతాయి. అందుకే ఇకపై ప్రతి సంక్రాంతికి నాకోసం ఒక స్లాట్ పక్కన పెట్టండి ..వచ్చే సంక్రాంతికి మళ్లీ వస్తా. శ్రీను వైట్ల దర్శకత్వంలో మైత్రీ మూవీస్ నిర్మించనున్న నా తదుపరి సినిమా పండక్కే వస్తుందని అన్నారు.

## యుఫోరియా అందరికీ కనెక్ట్ అవుతుంది




### ట్రైలర్ విడుదలలో దర్శకుడు గుణశేఖర్

'యుఫోరియా'తో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు దర్శకుడు గుణశేఖర్. ఆయన దర్శకత్వంలో భూమిక, సారా అర్జున్, గౌతమ్ వాసుదేవ్ మేనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న చిత్రమిది . ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా గుణ శేఖర్ మాట్లాడుతూ ఈ సినిమా అందరినీ ఆలోచింపచేస్తుందన్నారు. యుఫోరియా'కు ప్రతి కుటుంబంలో ఒకరు కనెక్ట్ అవుతారు. కొత్త వాళ్లతో ఈ సినిమా చేయాలని 6 నెలలు ఆడిషన్స్ చేశాం. 20 మంది కొత్తవారిని తీసుకున్నాం. టీనేజ్ అనేది ప్రతి ఒక్కరి జీవితంలో ముఖ్యమైన వయసు. ఈ సినిమాలోని ప్రధాన పాత్రల్లో నటించినవారు అందరూ టీనేజ్ వాళ్లే. కథ వింటున్నప్పుడే సారా అర్జున్ అయితే బాగుంటుందని నిర్మాత నీలిమ చెప్పింది. సారా అర్జున్ నటిస్తేనే ఈ సినిమా తీద్దాం లేదంటే ఆపేద్దాం అని ఆమెతో చెప్పా. రేపు సినిమా చూశాక కూడా అందరూ ఇదే అంటారు. అంత గొప్పగా నటించింది. ఈ అమ్మాయి వయసు 17 ఏళ్లు అయినా.. చాలా ఉన్నతంగా ఆలోచిస్తుంది. ఈ రోజుల్లో ఇలాంటి కథ కచ్చితంగా ప్రేక్షకుల చెప్పాలి అని వెంటనే ఓకే చేసేసిందని అన్నారు. ఇందులో ఎంతో కీలకమైన మరో పాత్ర వింధ్య.. ఈ పాత్ర కోసం భూమికని తీసుకుందాం అని నీలిమ చెప్పగానే వద్దు అన్నాను. ఎందుకంటే భూమికను తల్లి పాత్రలో చూడడం నాకు ఇష్టం లేదు. తను ఎప్పటికీ నాకు ఒక్కడు'లో స్వప్నగానే కనిపిస్తుంది. కానీ, ఆమె అయితేనే ఈ పాత్రకు న్యాయం చేస్తుందనిపించింది. వెళ్లి అడగ్గానే కొడుతుందేమో అనుకున్నా.. స్క్రిప్ట్ చదివి ఓకే చేసింది. కొందరు నటీమణులు కేవలం గ్లామర్ పాత్రలే చేస్తామంటున్నారు. భూమిక ఈ సినిమాలో 17 ఏళ్ల అబ్బాయికి అమ్మగా నటించి వాటిని బ్రేక్ చేసింది. 'యుఫోరియా' రిలీజ్ అయిన తర్వాత ఆమె కచ్చితంగా ప్రశంసలు అందుకుంటుంది. అంటూ గుణశేఖర్ ప్రశంసలు కురిపించారు.





## లేడీ డాన్‌గా అనుష్క

కార్తీ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో రాబోయే 'ఖైదీ 2' పట్టాలెక్కడానికి ఇంకొన్ని నెలలు సమయం పడుతుంది. ఖైదీ, విక్రమ్, లియో చిత్రాలకు ముడి పెడుతూ ఖైదీ 2 ఉంటుందట. దీనిలో భాగంగా సినిమాలో చాలా పాత్రలు అదనంగా ఉంటాయి. అయితే ఖైదీ 2 చిత్రంలో అందమైన లేడీ భామల్ని కూడా రంగంలోకి దించుతున్నట్లు- సమాచారం. దీనిలో భాగంగా స్వీటీ అనుష్క ఈ చిత్రంలో లేడీ డాన్ పాత్రలో కనిపించబోతుందని కోలీవుడ్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే లోకేష్ సినిమాలో డోస్ పరిమితిని మించి ఉంటు-ంది. పాత్ర రగ్గడ్‌గా..రఫ్‌గా ఉంటుంది. ఆ విషయంలో లోకేష్ ఎక్కడా రాజీ పడడు. అందుకోసం అనుష్క అదనంగా కష్టపడాల్సి ఉంటు-ంది. లోకేష్ డెన్‌లోకి ప్రవేశిస్తే అనుష్క కెరీర్ కూడా కొత్త టర్నింగ్ తీసుకుంటుంది.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056